




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



గ్రామాల్లో 'తాగునీటి' సమస్య రావొద్దు..
వానాకాలం సాగుకు అన్ని ఏర్పాట్లు పూర్తి
కాళేశ్వరంపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్‌ఎస్ నేతలకు లేదు
ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా గుర్తింపు ప్రక్రియ 03



సంపుటి 09, సంచిక: 218 | బుధవారం | 08-07-2026 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి ఒప్పిస్తే..

# కాళేశ్వరాన్ని అప్పగిస్తా!




ఎందుకివ్వాలో చెబితే వారం కాదు.. మూడేళ్లు ఇస్తాం : ప్రతిపక్ష నేతకు సిఎం రేవంత్‌రెడ్డి సవాల్

- కాళేశ్వరంపై ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- 2027 జూలై నాటికి అందుబాటులోకి తెస్తాం : మంత్రి ఉత్తమ్‌కుమార్

ప్రజాపక్షం / హైదరాబాద్

'కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిందే వానలొచ్చి గోదావరి వరద జలాలు వృథాగా పోయి సముద్రంలో కలవకుండా ఎత్తిపోసేందుకు. ఇప్పుడు ఎలినినో వచ్చి కరవు వస్తే వర్షాలు రావు. వరదలు రావు, తుఫానులు రావు. ఎట్లా లిఫ్ట్ చేస్తరు. కెసిఆర్‌కు వారం రోజులు ఇస్తే కన్నెపల్లి పంపు హౌజ్ నడిపి చూపిస్తా అంటుండు. ఒకవేళ కెసిఆర్ శాసనసభకు వచ్చి ఒప్పిస్తే, కాళేశ్వరంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌ల వద్ద మూడింటికి మూడు పంపుహౌజులు చంద్రశేఖర్‌రావుకు నూటికి నూరు శాతం అప్పజెబుతాం. వారం రోజులు కాదు రాబోయే మూడేళ్ళు అప్పజెబుతాం. ఏమి చేస్తడో చేయమనండి' అని బిఆర్‌ఎస్ నేతలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సవాలు విసిరారు. తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చించి, ఒప్పించేందుకు శాసనమండలి చైర్మన్‌కు, శాసనసభకు స్పీకర్‌కు లేఖలు

తరువాయి 12లో




## ఆసుపత్రుల్లో కార్మికులకు కనీస వేతనం

# రూ.26 వేలకు పెంచాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్

ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ధర్నాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు పెంచాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా, నీలోఫర్, కింగ్‌కోఠి, పేట్లబురుజు ఆసుపత్రుల వద్ద భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించారు. ఉస్మానియా ఆసుపత్రిలో జరిగిన ధర్నాను ఉద్దేశించి నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా వీరికి ఐఎఫ్‌ఎంఎస్ పోర్టల్ ద్వారా ఒకటవ తేదీన జీతాలు

తరువాయి 8లో

## ఇండోనేసియాకు బ్రహ్మోస్ క్షిపణులు

ఇండో–పసిఫిక్‌లో సుస్థిరశాంతికి ఉమ్మడి కృషి

14 ఒప్పందాలపై మోదీ–సుబియంతో సంతకాలు



జకర్తా : భారత్ దేశీయంగా తయారు చేసిన అత్యంత అధునాతనమైన సూపర్ సోనిక్ బ్రహ్మోస్ క్షిపణులను, ఆస్ట్రా క్షిపణులను ఇండోనేసియాకు సరఫరా చేస్తుంది. ఈ మేరకు రెండు దేశాలమధ్యా ఒప్పందం కుదిరింది. ఐతే ఎన్ని బ్రహ్మోస్ క్షిపణులు సరఫరా చేస్తారన్న విషయంపై ఒప్పందంలో స్పష్టత లేదు. బహుశా ఈ విధంగా 600 మిలియన్ డాలర్ల విలువైన ఈ రెండు రకాల క్షిపణులను సరఫరా చేసేందుకు ప్రధానమంత్రి మోదీ సమక్షంలో ఒక ప్రకటన వెలువడటం,ఒప్పందంపై సంతకాలు చేయడం భారత రక్షణరంగంలో ఇదే మొదటిసారి. బ్రహ్మోస్–ఆస్ట్రా క్షిపణులు

తరువాయి 8లో

## తాడిచర్ల-2 బొగ్గుగనులు

# సింగరేణి చేతికి...

ప్రధాని మోదీ అంగీకారం

182 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రకటన

కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాపక్షం/హైదరాబాద్

తాడిచర్ల–2 బొగ్గు గనులను సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి మంగళవారమే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల–2లో 182 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40–50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి

తరువాయి 8లో




తొందరపడకుండా రాష్ట్రంలో లేబర్ కోడ్స్
కార్మికసంఘాలు, పారిశ్రామిక వేత్తలతో చర్చించాకే నిబంధనలు రూపకల్పన : కార్మిక మంత్రి వివేక్ 03








# రామాలయ నిధుల చోరీపై ఆత్మరక్షణలో హిందూత్వ శక్తులు

అయోధ్య బాలరామాలయంలో నిధుల దొంగతనం ఘటన షాక్ నుంచి ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, బిజెపి నేతలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. సమగ్ర విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని అంటున్నారు. అదే సమయంలో, ప్రతిపక్షాలు దీన్ని అవకాశంగా వాడుకుంటాయనే భయం వారిలో వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తదితర ప్రతిపక్ష నాయకులు రామాలయ నిధుల గోల్‌మాల్‌పై ఆరోపణలు చేస్తున్నందున వారినీ విచారించాలని విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్‌కు లేఖ రాయటం ఇందుకు తాజా ఉదాహరణ. ఉత్తరప్రదేశ్‌లో 'డబుల్ ఇంజిన్ సర్కార్' పనిచేస్తోంది. 2027 ఆరంభంలో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తమ పరువు ప్రతిష్టలు కాపాడుకోవటానికి ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేశారు. అది గత నెలలో సమర్పించిన తాత్కాలిక నివేదిక ప్రకారం ఎనిమిది మంది ఉద్యోగులను అరెస్టు చేశారు. దొంగతనం, విశ్వాస ద్రోహం, క్రిమినల్ కుట్ర ఆరోపణలు మోపారు. రూ.80 లక్షల నగదు, కొంత బంగారం, వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల నుంచి కొన్ని కోట్ల నగదు, ఆభరణాలు దొంగలించబడినట్లు ఆరోపణలుండగా, మొత్తం 40రోజుల్లో 70సార్లు దొంగతనం ఘటనలు జరిగినట్లు సిట్ ఇప్పటికే నమోదు చేయగా – ఇదంతా కిందిస్థాయి ఉద్యోగుల చేతివాటమేనా, పెద్దల పాత్ర లేకుండా ఈ ధనాపహరణ సాధ్యమా? పర్యవేక్షకులేమైనారు, సిసి కెమెరా ఫుటేజి ఎందుకు లేదు. రామతీర్థ క్షేత్ర ట్రస్టు తరపున యాజమాన్యం నిర్వహిస్తున్నవారు ఏం చేస్తున్నారు? అనే ప్రశ్నలు ఉదయించటం సమంజసం. రాముణ్ణి రాజకీయంలోకి లాగి ఆయన పేరుమీద ఓట్లు దండుకుని అధికారం చలాయిస్తున్నవారే కదా ఈ ఆలయాన్ని సొంత ఆస్తిగా చూసుకుంటున్నది? 2026 ప్రారంభంలో ధనాపహరణ సందేహాలు అంతర్గతంగా ఉత్పన్నంకాగా జూన్ 25న గాని పోలీసులు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయలేదు. ఈ ఆలస్యానికి కారణమేమిటి? అందిన కానుకల మొత్తానికి బ్యాంక్ డిపాజిట్లకు మధ్య తేడా బయట పడటంతో అనుమానాలు తలెత్తాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక నివేదికలోని అంశాలు గోప్యంగా ఉంచారు. ట్రస్టు ఐదేళ్ల ఆర్థిక లావాదేవీల రీఆడిట్‌ను సిట్ ఉత్తర్వు చేసిందంటే అనుమానాల వ్రేళ్లు లోతుగా ఉన్నట్లు ఊహించుకోవచ్చు. ఇదిలావుండగా, ఆలయ నిధుల అపహరణ వెలుగులోకి వచ్చిన నెలరోజుల తర్వాత నింపాదిగా జులై 6 న తొలిసారి సమావేశమైన రామాలయ ట్రస్టుబోర్డు, తమ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామాలు ఆమోదించినట్లు ప్రకటించింది. ముఖ్య కార్యనిర్వహణాధికారిని (సిఇఒ) ఎంపిక చేసేందుకు ముగ్గురితో ఒక కమిటీని నియమించింది. ఆలయంలో ఇప్పుడు జరిగినటువంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా నివారించేందుకు తీసుకోవలసిన అదనపు చర్యలు రూపొందించేందుకు మరో కమిటీని ఏర్పాటు చేశారు.

చంపత్‌రాయ్ సామాన్యుడు కాదు. ఆయన విహెచ్‌పి ఉపాధ్యక్షుడు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్. అనిల్ మిశ్రా కూడా విహెచ్‌పి ప్రముఖుడు. సుప్రీంకోర్టు ఆదేశంపై ఈ ట్రస్టును ఏర్పాటు చేసింది ప్రధానమంత్రి నరేంద్రమోదీ. రామాలయ ఉద్యమాన్ని, ఆలయ నిర్మాణాన్ని ఆదినుంచీ చేబట్టింది ఆర్‌ఎస్‌ఎస్ విభాగమైన విహెచ్‌పి. ఇంత జరిగినా ఆలయంపై తన ఆధిపత్యం కనీసం తగ్గించుకోవటానికి కూడా విహెచ్‌పి సిద్ధంగా ఉన్నట్లు లేదు. రామాలయ అడ్మినిస్ట్రేషన్‌లో మార్పులపై చర్చ జరుగుతుండగా, ఆలయంపై ప్రభుత్వ నియంత్రణను తాము అనుమతించబోమని విహెచ్‌పి జాయింట్ ప్రధాన కార్యదర్శి సురేందర్ జైన్ సోమవారం చెప్పారు. వృత్తినిపుణుడైన సిఇఒని నియమించటానికి తమకు అభ్యంతరం లేదని, అయితే అతను సర్వీసులో ఉన్న బ్యూరోక్రాట్ కాకూడదని, అతను తీర్థక్షేత్ర ట్రస్టుకే జవాబుదారీగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ట్రస్టుడీడ్‌ను లేదా బైలాస్‌ను మార్చాలని ఎవరూ కోరటం లేదన్నారు. ట్రస్టు డీడ్‌ను రూపొందించింది ప్రభుత్వం అయినప్పటికీ అందులోని సమాచారాన్ని ఆర్‌టిఐ కింద వెల్లడి చేయటానికి హోంమంత్రిత్వశాఖ, సమాచార ముఖ్య కమిషనర్ నిరాకరించటం గమనించదగింది. అందులో ప్రభుత్వ ప్రమేయం, వ్యయం లో వాటా లేదు. అది పూర్తిగా ప్రైవేటు ట్రస్టు. ప్రైవేటు ట్రస్టు ఆర్‌టిఐ కిందకు రాదన్నది వారి వాదన. కోట్లాది భక్తుల ఆరాధ్యుడైన రాముని ఆలయ నిర్వహణ విధివిధానాల్లో ఎందుకీ గోప్యత?

ఈ రోజు (జులై 7) వరకు జరిగిన దర్యాప్తులనుబట్టి అయోధ్య రామునికి భక్తులు చెల్లించిన కానుకల్లో కోట్ల రూపాయల దొంగతనం ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి వారి హస్తలాఘవం తప్ప మరెవరి ప్రమేయం లేదని తెలియజేస్తున్నది. అందువల్ల దీని రాజకీయ పర్యవసానాలు ఈ హిందూత్వ శక్తులపై ఉంటాయి. రామాలయం వారికి రాజకీయ చిహ్నం, అక్కడ ధనాపహరణం వారి ప్రతిష్టను భగపరిచింది. దాన్ని దాచిపెట్టకుండా దర్యాప్తు చేయిస్తున్నామని చెప్పుకోవటం ద్వారా రాజకీయ నష్ట నివారణకు ప్రయత్ని స్తున్నారు. అయితే దర్యాప్తు తీరు అనేక ప్రశ్నలకు జవాబు ఇవ్వనందున అది నిష్పాక్షికంగా జరుగుతున్నట్లు అనిపించదు. అందువల్ల సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలనే ప్రతిపక్షాల డిమాండ్‌కు అభ్యంతరం ఎందుకుండాలి. అటువంటి దర్యాప్తు ప్రజల్లో విశ్వాసం నింపుతుంది కదా! దర్యాప్తు ఆదేశించటంలో జరిగిన విపరీత జాప్యం పెద్దల విషయాలు అన్నీ సర్దుబాటు చేసుకున్నాక కిందిస్థాయి ఉద్యోగులను అరెస్టు చేసినట్లు సంకేతిస్తున్నది. ఈ దర్యాప్తు పర్యవసానాలు ఎలా ఉన్నా, రానున్న అసెంబ్లీ ఎన్నికల వరకు ఈ అంశాన్ని ప్రతిపక్షాలు జనంలోకి తీసుకెళుతూనే ఉంటాయి. విహెచ్‌పి హెచ్చరికలు వారిని భయపెట్టలేవు.



## సమగ్ర విచారణ చేయాలి

**విరాళాల చోరీకి సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలి.సంబంధిత ట్రస్టుల ఉన్నతాధికారుల పాత్రను కూడా పరిశీలించాలి.అయోధ్య రామమందిరం తర్వాత, బద్రీనాథ్ ఆలయంలో కూడా కానుకలు, విరాళాల చోరీ, దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ట్రస్టులకు సంబంధించిన ముఖ్య నిర్వాహకులపై కూడా సరైన విచారణ జరగాలి, లేకపోతే, భవిష్యత్తులో వారి స్థానంలో వచ్చేవారు కూడా ఇదే సాకుతో తమ పదవులను దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం, సిట్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి.విరాళాల చోరీ జరిగిందని ఆరోపించిన ఎస్‌పి, కాంగ్రెస్, ఆప్ పార్టీల సీనియర్ నాయకులు అందుకు తగిన ఆధారాలను సమర్పించాలి.**

- బిఎస్‌పి అధినేత్రి మాయావతి

---

ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేస్తే

## రైతుకు ఊరట... పల్లెకు పునర్జీవం!

గ్రామీణ భారతదేశానికి రైతు వెన్నెముక అయితే, కూలీ ఆ రైతు శ్రమకు జీవం. రైతు భూమిని నమ్ముకుని పంట పండిస్తాడు. కూలీ తన చెమటను నమ్ముకుని జీవిస్తాడు. ఈ ఇద్దరూ బలంగా ఉంటేనే పల్లె బలంగా ఉంటుంది. కానీ నేటి పరిస్థితి చూస్తే ఈ సహజ సమతుల్యం దెబ్బతింటోంది. ఒకవైపు చిన్న, సన్నకారు రైతులు పెరుగుతున్న కూలీ ఖర్చులతో, కూలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉపాధి హామీ పనులు వ్యవసాయానికి దూరంగా సాగుతుండటంతో, రైతు పొలంలో అవసరమైన సమయంలో కూలీలు దొరకక వ్యవసాయం మరింత భారంగా మారుతోంది. ముఖ్యంగా నాట్లు, కలుపు, కూరగాయలు, పప్పులు, ఉద్యాన పంటలు వంటి ఎక్కువ శ్రమ అవసరమైన రంగాల్లో ఈ సమస్య మరింత తీవ్రమైంది.

దేశంలో ఎక్కువ మంది రైతులు చిన్న భూస్వాములే. వారికి వ్యవసాయం లాభం ఇవ్వాలంటే కేవలం విత్తనాలు, ఎరువులు సరిపోవు, కూలీ కూడా అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుతం ఉపాధి హామీ పనులు చెరువుల పూడికతీత, మట్టి పనులు, గ్రామీణ నిర్మాణాల వరకే ఎక్కువగా పరిమితమవుతున్నాయి. గ్రామీణ ఉపాధి కల్పనలో ఇవి ఉపయోగకరమైనప్పటికీ, రైతు పొలానికి ప్రత్యక్షంగా బలం చేకూర్చే విధంగా వ్యవస్థ పూర్తిగా పనిచేయడం లేదు. ఫలితంగా రైతు తన పొలంలో పని చేయించుకోవడానికి అధిక వ్యయం భరించాల్సి వస్తోంది. శ్రమ ఎక్కువగా అవసరమయ్యే పప్పులు, కూరగాయలు, మిల్లెట్లు, పండ్ల తోటలు వంటి వైవిధ్య పంటల నుంచి రైతు వెనక్కి తగ్గి, తక్కువ శ్రమతో లేదా హామీ ఉన్న పంటల వైపు మొగ్గు చూపుతున్నాడు.

ఇది కేవలం రైతు సమస్య కాదు, ఇది భవిష్యత్తు ఆహార భద్రతకు సంబంధించిన అంశం. ఒకప్పుడు గ్రామాల్లో పెరటి తోటలు, పప్పులు, నూనెగింజలు, పశుగ్రాసం, పశు సంపద అన్నీ కలిసి ఒక సమగ్ర జీవన విధానంగా ఉండేవి. ఇప్పుడు ఒక్క పంట ఆధారిత వ్యవసాయం పెరగడం వల్ల మట్టి సారం తగ్గుతోంది, పోషకాహారం తగ్గుతోంది, నీటి వినియోగం పెరుగుతోంది. కాబట్టి ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేయడం అంటే కేవలం రైతుకు కూలీ అందించ డం కాదు, పల్లె జీవన వ్యవస్థను మళ్లీ సమతుల్యం చేయడం.

చిన్న రైతుల పెరటి తోటలు, పప్పుధాన్యాలు, కూరగాయల సాగు, పశుగ్రాసం, భూమి సమతలీకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, నీటి సంరక్షణ వంటి పనులకు ఉపాధి హామీని అనుసంధానం చేస్తే రైతుకు కూలీ భారం తగ్గుతుంది. అదే సమయంలో కూలీలకు తమ గ్రామంలోనే స్థిరమైన ఉపాధి లభిస్తుంది. పట్టణాలకు వలస తగ్గుతుంది. మహిళలకు, వెనుకబడిన వర్గాలకు మరింత జీవన భద్రత లభిస్తుంది. రైతు వైవిధ్య పంటల వైపు తిరిగి అడుగులు వేయగలడు. గ్రామీణ కుటుంబాల్లో పోషకాహారం మెరుగుపడుతుంది. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి హామీ వినియోగం మంచి ఫలితాలు ఇచ్చింది. పండ్ల తోటలు, భూసంరక్షణ, నీటి వినియోగ సామర్థ్యం పెంపు వంటి కార్యక్రమాల్లో రైతులు లాభపడ్డారు. అంటే సరైన ప్రణాళిక, నిజాయితీ, పారదర్శకత ఉంటే ఇది అసాధ్యం కాదు. అసలు అవసరం ప్రభుత్వ సంకల్పం.

ప్రభుత్వాలు తరచూ గ్రామాభివృద్ధి గురించి చెబుతాయి. కానీ నిజమైన గ్రామాభివృద్ధి అంటే రైతు పొలం లాభదాయకం కావడం. కూలీకి పని దొరకడం. రైతు ఖర్చు తగ్గడం. పంట వైవిధ్యం పెరగడం. గ్రామం స్వయం సమృద్ధి సాధించడం. ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేయడం ద్వారా ఈ నాలుగు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమవుతా యి.

అవినీతి, అమలు లోపాలు, వ్యక్తిగత ప్రయోజనాల భయం వంటి అభ్యంతరాలు ఉండొచ్చు. కానీ వాటిని కారణంగా చూపి రైతు అవసరాన్ని నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదు. గ్రామ సభల పర్యవేక్షణ, సామాజిక తనిఖీలు, డిజిటల్ పర్యవేక్షణ, చిన్న రైతులకు ప్రాధాన్యత వంటి పద్ధతులతో పారదర్శకత సాధ్యమే. నిజానికి దేశ భవిష్యత్తును కాపాడే విధానాల్లో ఇది ఒకటి కావాలి.

ఇప్పుడు వ్యవసాయానికి అవసరమైనది కేవలం పథకాలు కాదు, సమగ్ర దృష్టి. రైతు బతికితేనే గ్రామం బతుకుతుంది. గ్రామం బతికితేనే దేశ ఆహార భద్రత బలపడుతుంది. కాబట్టి ఉపాధి హామీ పథకం చేతులు రైతు పొలానికి చేరాలి. రైతు అడిగేది దానం కాదు, తన భూమిని నిలబెట్టే విధాన మద్దతు. రైతు చెమటకు ప్రభుత్వ పథకం తోడైతే, అది కేవలం పంటనేకాదు, గ్రామీణ భారత భవిష్యత్తును కూడా పండిస్తుంది.ఇక ఆలస్యం చేయరాదు. గుంతలు తవ్వే చేతులు పొలం దున్నే రైతుకు తోడైతేనే నిజమైన అభివృద్ధి. ఉపాధి హామీ వ్యవసాయాన్ని చేరిన రోజే పల్లెకు కొత్త ఊపిరి, రైతుకు కొత్త నమ్మకం, దేశానికి మరింత సురక్షితమైన భవిష్యత్తు లభిస్తుంది. ఇది రైతు కోసం తీసుకునే నిర్ణయం మాత్రమేకాదు, భారత భవిష్యత్తును కాపాడే చారిత్రక నిర్ణయం.

డి.శ్రీశైలం

---

# ప్రతి విద్యార్థి భవిష్యత్ కు భరోసా కోసం

## జులై 10న బంద్



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

రాష్ట్రంలో విద్యా రంగం రోజు రోజుకూ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. చాలా ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్లాస్ రూమ్‌లు, తాగు నీరు, టాయిలెట్ల లాంటి మౌలిక వసతులు కరువయ్యాయి. ఖాళీ టీచర్ పోస్టులు వెంటాడుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మీద ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. రాష్ట్రం వస్తే విద్యా రంగ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని, నిధులు వస్తాయనుకుంటే విద్యారంగాన్ని పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. మారింది రాష్ట్రమే తప్ప విద్యార్థుల భవిష్యత్ మాత్రం కాదు. కాంగ్రెస్ అయినా, బిఆర్ఎస్, బిజెపి అయినా అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడమేగానీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదు.

రాష్ట్రంలో విద్యశాఖకు ప్రత్యేకంగా ఒక మంత్రి లేరు. ఆ శాఖ సిఎం వద్దే ఉండడంతో విద్యారంగం మరింత అభివృద్ధి చెందుతుందనుకుంటే మరిన్ని కొత్త సమస్యలు ఎదుర్కొంటుంది. 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేల పాఠశాలలకు కుదిస్తామని స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం అంటే.. ప్రభుత్వ విద్యను బొందపెట్టడమే. చదువు కొనుక్కోలేని పేద విద్యార్థులను చదువుకు దూరం చేయడమే. రాష్ట్రంలో ఇప్పటికే 2,763 స్కూళ్లలో టాయిలెట్లు లేకపోవడం స్కూళ్ల దుస్థితికి అద్దం పడుతోంది. ఉన్న వాటిలోనూ చాలాచోట్ల నీళ్లు లేక నిర్వహణ సరిగ్గాలేవు.

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆసరాగా ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను గత కెసిఆర్ ప్రభుత్వం గతంలోనే రెండున్నరేళ్లు పెండింగ్‌లో పెట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి 30 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు సుమారు రూ.10వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయలేదు. మరోవైపు పైసలు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను సతాయిస్తున్నాయి. ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుకున్న విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, తలతాకట్టుపెట్టి సర్టిఫికెట్లు తీసుకెళ్తున్నారు. ఫుట్ బాల్ పోటీలకు అందాల పోటీలకు, ఇతర రాష్ట్రాల పత్రికల్లో ప్రకటనలకు, మంత్రుల హెలీకాప్టర్ల ప్రయాణాలకు వందల కోట్లు ఖర్చు పెడుతు న్న ప్రభుత్వం.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మాత్రం చెల్లించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్వీర్యం చేయడం విషాదం.

రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా ఇప్పటివరకు విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్, నోట్ బుక్స్ పూర్తి స్థాయిలో అందలేదు. స్కూళ్ల ప్రారంభానికి ముందే సమకూర్చాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోకి రావడానికి వెనుకంజ వేస్తున్నారు. మరోవైపు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతూ విద్యా వ్యాపా రం చేస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నాయి. ఎల్‌కేజీకి రాష్ట్రంలో రూ.లక్ష ఫీజు ఉంటే ఇంటర్ ఫీజు




రూ.5లక్షలు ఉంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేదు. అనుమతి లేని పాఠశాలలు, కళాశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రెసిడెన్షియల్ విద్యాసంస్థలు జైళ్లకంటే హీనంగా మారి నిబంధనలు పాటించడం లేదు. రాష్ట్రం లో ఉన్న 33 జిల్లాల్లో సగానికి పైగా డిఇఒలు ఇన్చార్జిలే ఉన్నారు. ఎంఇఒలంతా ఇన్‌చార్జ్‌లే. సంక్షేమ హాస్టల్, గురుకులాలు అనేకం అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణం గా విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ప్రభుత్వం సంక్షేమ హాస్టల్, గురుకులాలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్ల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తోంది. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం లేదు. ప్రతి ప్రభు త్వ పాఠశాల, ప్రతి జూనియర్ కళాశాల, హాస్టళ్లకు కరెంట్, ఇంటర్నెట్, తాగునీరు, మరుగుదొడ్లు, వంట షెడ్లు నిర్మించాలి. కెజి నుంచి పిజి వరకు ప్రతి విద్యార్థికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి. దక్షిణాది రాష్ట్రాలు అనేకం నూతన జాతీయ విద్యా విధానాన్ని(ఎన్ఈపీ 2020)ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశాయి. కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం చాపకింద నీరులా విడతలవారీ గా ఎన్ఇపి అమలవుతోంది. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో వెంటనే తీర్మానం చేయాలి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి విద్యార్థినికి ఎలక్ట్రిక్ స్కూటీలు, ప్రతి విద్యార్థికి ఉచిత ల్యాప్ టాప్, ప్రతి విద్యార్థికి, ఇంటింటికి ఉచిత ఇంటర్నెట్, ఐదు లక్షల విద్యా భరోసా కార్డులాంటి హామీలను నెరవేర్చాలి.

ఈ నేపథ్యంలోనే విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యారంగ సమస్యల పరిష్కారంకోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జులై 10న రాష్ట్రవ్యాప్తం గా పాఠశాలలు, కళాశాలల బంద్‌కి పిలుపునివ్వడం జరిగింది. ఈ బంద్ విజయవంతానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు సహకరించాలి. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి ఒక్క చెంప పెట్టు లాగా జులై 10న రాష్ట్రంలో ఉన్న ఏ విద్యార్థి బడికి పోకుండా, ఏ విద్యార్థి విద్యాసంస్థ బస్సు ఎక్కకుండా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం. ఈ బంద్ ద్వారా అయినా ప్రభుత్వంలో చలనం కలిగి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఆశిస్తున్నాం.

---

# పసిప్రాణాలు హరిస్తున్న ఇజ్రాయెల్... నిద్రపోతున్న ప్రపంచం!

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మానవాళి సాధించిన అద్భుత ప్రగతి, యుద్ధభూమిలో పసిప్రాణాలను బలితీసుకునే పరిస్థితులకు దారితీస్తే, అది నాగరిక సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన నైతిక సంక్షోభంగా పరిగణించాల్సి ఉంటుంది. గజాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో పిల్లలపై పడుతున్న ప్రభావంపై ఐక్యరాజ్యసమితి సంస్థలు, మానవ హక్కుల సంస్థలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఐక్యరాజ్యసమితి సంస్థలు ఉదహరించిన గాజా ఆరోగ్య అధికారుల నుండి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, సుమారు 20వేల మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోగా, 44 వేల మందికి పైగా పిల్లలు తీవ్రంగా గాయపడినట్లు, వారిలో అనేక మంది శాశ్వత అంగ వైకల్యానికి గురైనట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, దాడుల వెనుక అసలు లక్ష్యం ఏమిటి? అంతర్జాతీయ మానవతా చట్టాలు పసిప్రాణాలను రక్షించడంలో ఎందుకు విఫలమవుతున్నాయి? అనే ప్రశ్నలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.



**జస్టిస్ మురళీధర్ నేతృత్వంలోని కమిషన్ నివేదిక..**

ఇటీవల వెలువడిన ఒక ఐక్యరాజ్యసమితి స్వతంత్ర విచారణ కమిషన్ నివేదికలో నమోదైన ఆరోపణల ప్రకారం, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు, థర్మల్ ఇమేజింగ్ సాంకేతికత కలిగిన క్వాడ్‌కాప్టర్ డ్రోన్‌లను ఉపయోగించి పిల్లలను గుర్తించి కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోపణలకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు, వైద్యుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను కూడా కమిషన్ నమోదు చేసింది. అయితే, ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ప్రభుత్వం పూర్తిగా తిరస్కరిస్తూ, సాధారణ పౌరులకు జరిగిన ప్రాణనష్టం ఉద్దేశపూర్వకమైనది కాదని తన అధికారిక వైఖరిని వెల్లడిస్తోంది. మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్. మురళీధర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ఐక్యరాజ్యసమితి స్వతంత్ర కమిషన్ సమర్పించిన సుమారు 100 పేజీల నివేదిక గజాలో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన వివిధ ఆధారాలను పొందుపరిచింది. నివేదికలో నమోదైన వైద్యుల వాంగ్మూలాల ప్రకారం, కొందరు చిన్నారుల తలలు, మెడ భాగాలు లక్ష్యంగా చేసుకున్నట్లుగా కనిపించే గాయాలను తాము గమనించినట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. సాధారణ పౌరులకు, ముఖ్యంగా పిల్లలకు జరిగిన ప్రాణనష్టం యుద్ధ పరిస్థితుల్లో జరిగిన దురదృష్టకర పరిణామమే తప్ప ఉద్దేశపూర్వకమైనది కాదని ఇజ్రాయెల్ తన అధికారిక వైఖరిలో పేర్కొంటోంది. మరోవైపు, ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథాలయాలు వంటి మౌలిక వసతుల ధ్వంసం, నిర్బంధంలో ఉన్న పిల్లలపై జరిగినట్లు నివేదికల్లో నమోదైన ఆరోపణలు ఈ వివాదాన్ని మరింత సంక్లిష్టంగా మార్చుతున్నాయి. ఆరోపణలపై భిన్న వాదనలు కొనసాగుతున్న నేపథ్యంలో, అంతర్జాతీయ స్థాయిలో స్వతంత్ర విచారణలు, పరిశీలనలు కొనసాగుతున్నాయి.

**అంతర్జాతీయ సమాజపు మౌనం..**

బాలల హక్కుల పరిరక్షణ గురించి బహిరంగంగా మాట్లాడే ప్రపంచ దేశాలు, ఇలాంటి తీవ్ర ఆరోపణలపై తగిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శకులు పేర్కొంటున్నారు. ఈ వైఖరి వెనుక భౌగోళిక, రాజకీయ, వ్యూహాత్మక ప్రయోజనాలు పనిచేస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చారిత్రకం గా అలీన విధానాన్ని అనుసరించిన భారతదేశం కూడా ఇజ్రాయెల్‌తో ఉన్న వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాల నేపథ్యంలో ఈ అంశంపై అత్యంత జాగ్రత్తతో కూడిన దౌత్య వైఖరిని అవలంబిస్తోందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్ష నాయకులు, విశ్లేషకులు, పలు జాతీయ పత్రికల్లో ప్రచురితమైన వ్యాసా లు కూడా ప్రభుత్వాల ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తున్నాయి. అదే సమయంలో, భారత ప్రభుత్వం గాజాలో మానవతా సహాయం, పౌరుల రక్షణ, రెండు దేశాల పరిష్కారానికి మద్దతు వంటి అంశాలపై అధికారికంగా తన వైఖరిని పలు సందర్భాల్లో వెల్లడించింది. అయినప్పటికీ, అంతర్జాతీయ సంస్థలు అగ్రరాజ్యాల రాజకీయ ఒత్తిళ్ల ప్రభావంలో సమర్థవంతంగా పనిచేయలేకపోతున్నాయనే విమర్శలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. యుద్ధాలు కేవలం భూభాగాలను మాత్రమే కాదు, ఒక సమాజం యొక్క భవిష్యత్తును కూడా ఛిద్రం చేస్తాయి. గజాలో తన కుటుంబ సభ్యుల మృతదేహాల మధ్య కారులో చిక్కుకుని, రక్షణ కోసం గంటల తరబడి వేచి చూసిన ఐదేళ్ల చిన్నారి హింద్ రజబ్ చివరకు ప్రాణాలు కోల్పోయిన ఘటన ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆవేదన కు కారణమైంది. ఆ ఘటనకు సంబంధించిన పరిస్థితులపై పలు దర్యాప్తులు, నివేదికలు వెలువడినప్పటికీ, అది గాజాలో నెలకొన్న మానవతా సంక్షోభానికి ఒక విషాద ప్రతీకగా నిలిచింది. గాజాలో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన ఆరోపణలు, వాటిపై కొనసాగుతున్న దర్యాప్తులు, అంతర్జాతీయ స్పందన ప్రపంచ మానవ హక్కుల వ్యవస్థ ఎదుర్కొంటు న్న సవాళ్లను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ తరహా ఆరోపణలపై సమగ్ర, స్వతంత్ర, పారదర్శక విచారణలు జరిగి, వాస్తవాలు నిర్ధారితమైతే బాధ్యులపై అంతర్జాతీయ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవడం అంతర్జాతీయ సమాజం బాధ్యత. పసిప్రాణాల అరుపులు ప్రపంచ మనస్సాక్షిని మేల్కొల్పలేకపోతే, మానవత్వం తన అసలు అర్థాన్నే కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు విభేదాలకు అతీతంగా పిల్లల రక్షణను అత్యున్నత ప్రాధాన్యంగా గుర్తించి, అంతర్జాతీయ మానవతా చట్టాల అమలును మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

ఫిరోజ్ ఖాన్, 9640466464

---

# ఆదిలాబాదీయులకి అందనంత దూరంలో ఉన్నత విద్య

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం దాటినా, ఉన్నత విద్యా అవకాశాల విషయంలో ప్రాంతీయ అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు. తెలంగాణలోని అనేక ఉమ్మడి జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సాధారణ విశ్వవిద్యాలయాలు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాకతీయ విశ్వవిద్యాలయం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు విశ్వవిద్యాలయం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ విశ్వవిద్యాలయం, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శాతవాహన విశ్వవిద్యాలయం, ఉమ్మడి నల్గొండ జిల్లాలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకేంద్రాలు మరియు ఇతర ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. అయితే భౌగోళికంగా విస్తారమైన, గిరిజన జనాభా అధికంగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇప్పటికీ పూర్తి స్థాయి రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయం లేకపోవడం ఒక ముఖ్యమైన విద్యా సమస్యగా నిలిచింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ ఉత్తర సరిహద్దులో ఉంది. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలుగా విభజించబడిన ఈ ప్రాంతంలో వేలాది మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేస్తున్నారు. అయితే పీజీ, పరిశోధన, వృత్తి నైపుణ్య కోర్సుల కోసం హైదరాబాద్, వరంగల్ లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత విద్యను మధ్యలోనే వదిలివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు ప్రాపంచిక జ్ఞానానికి దూరం అవుతూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వివక్షతలకి లోనవుతున్నారు.

ఉన్నత విద్య అనేది కేవలం ఉద్యోగాల కోసమే కాదు; అది సమాజంలో జ్ఞానం, అవగాహన, శాస్త్రీయ దృక్పథం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే సాధనం. ఒక ప్రాంతంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు కావడం వల్ల స్థానిక విద్యార్థులకు చదువుల అవకాశాలు పెరగడమే కాకుండా, పరిశోధన, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి కూడా మార్గం ఏర్పడుతుంది. అంతే కాకుండా విశ్వవిద్యాలయం ఉన్న ప్రాంతంలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తూ, నూతన వ్యాపార సంస్థలు కూడా ఏర్పాటవుతాయి.అందువల్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం కాలానుగుణ అవసరంగా మారింది.నేటి తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలి. విద్యారంగంలో ప్రాంతీయ విభేదాలు తలెత్తకుండా సాధారణ విశ్వవిద్యాలయాలు లేని ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, ఖమ్మం జిల్లాలలో సాధారణ విశ్వవిద్యాలయాలు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా మొట్టమొదటగా భౌగోళికంగా వెనుకబడిన ఆదిలాబాద్ కేంద్రంగా లేదా జిల్లాలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిలో పూర్తిస్థాయి రాష్ట్ర విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలి. ముఖ్యంగా గిరిజన అధ్యయనాలు, అటవీ వనరులు, వ్యవసాయం, పర్యావరణ శాస్త్రం, ఖనిజ వనరులు, ప్రజా ఆరోగ్యం వంటి ప్రాంతీయ అవసరాలకు అనుగుణమైన ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. అయితే రాష్ట్ర పరిధిలోని సాధారణ విద్యాలయం ఉమ్మడి మెదక్, ఖమ్మం జిల్లాలో లేకున్నా హైదరాబాద్‌కి 100 కిలోమీటర్ల దూరం ఉండడం వల్ల ఓయూ పరిధిలో ఉమ్మడి మెదక్ జిల్లా విద్యార్థులు, కేయూ పరిధిలో ఖమ్మం విద్యార్థులు సులభతరంగా ఆధునిక ఉన్నత విద్యని అభ్యసిస్తున్నారు. కానీ హైదరాబాద్ జిల్లాకి 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకి ఏ ఒక్క సాధారణ విశ్వవిద్యాలయం లేకపోవడం వల్ల ఆ ప్రాంత విద్యార్థులు అక్కడి భౌగోళిక పరిస్థితుల వల్ల దూరప్రాంతాలకు వెళ్లి ఆధునిక విద్యను పొందలేకపోవడం ఒక కారణం ఐతే, అత్యధికంగా ఆర్థికంగా వెనుకబడిన గిరిజన, దళిత, బహుజన కులాలు ఉండటం వల్ల ఉమ్మడి అదిలాబాద్ జిల్లా విద్యార్థులు ఉన్నత విద్యకి అందనంత దూరంలో ఉంటున్నారు. అది ప్రాంతీయ సమానత్వానికి, సామాజిక న్యాయానికి, విద్యా హక్కుల విస్తరణకు సంకేతం. ఇది ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చడమే కాకుండా, తెలంగాణ అభివృద్ధి చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.

పుల్లెంల గణేష్, 9553041549



# గ్రామాల్లో 'తాగునీటి' సమస్య రావొద్దు..

● 'నీటిపారుదల' నిరంతరం సమన్వయం చేయాలి ● ప్రత్యామ్నాయ నీటి వనరులు వినియోగించండి: మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వర్షపాతం తగ్గినా, 'ఎల్‌నినో' ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పని చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. అన్ని జలాశయాల్లో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలను ప్రతి జలాశయాల్లో ముందుగానే నిర్ధారించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని నివాస ప్రాంతాలకు స్థానిక మంచి నీటి వనరులను వినియోగిస్తూ, ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా వ్యవస్థను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మంత్రి సీతక్క అధ్యక్షతన తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ బోర్డు సమావేశం హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం జరిగింది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా పరిస్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, రాబోయే నెలల్లో తాగునీటి అవసరాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రంలోని గ్రామీణ జనావాసాలకు ప్రధానంగా కృష్ణా, గోదావరి బేసిన్ల ఉపరితల జల వనరుల నుంచి శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. తాగునీటి కోసం వినియోగిస్తున్న 29 జలాశయాల నుంచి 123 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో, ప్రతి జలాశయంలో 45 రోజులు, 90 రోజులు, 180 రోజుల అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతపై మంత్రి సీతక్క సమీక్షించారు. జూలై నెలాఖరు వరకు తగిన నీటి ప్రవాహం లేకపోతే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉదయసముద్రానికి, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెంకు నీటిని విడుదల చేసేలా ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రస్తుతం సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో, రాబోయే 45 రోజుల్లో సింగూర్‌లోకి తగిన నీటి ప్రవాహం రాకపోతే సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి (పాక్షికంగా), నిజామాబాద్ (పాక్షికంగా) జిల్లాల్లోని గ్రామీణ జనావాసాలు, పట్టణ ఆధారిత నివాస ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల ఆధారిత తాగునీటి పథకాలను వినియోగించేలా తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో బోర్లను లోతుగా తవ్వడం, ఫ్లషింగ్ చేసి, అవసరమైతే బోర్‌వెల్స్‌ను అద్దెకు తీసుకోవడం వంటి చర్యలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కి షోర్, మిషన్‌భగీరథ ఇంజనీర్‌ఇన్‌చీఫ్ కృపాకర్ రెడ్డి, ఇతర చీఫ్ ఇంజనీర్లు,బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

**విఒఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి**

రాష్ట్రంలో గత రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న విఒఎలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, ఐకెపి విఒఎ–ఫీల్డ్ అసిస్టెంట్లు–మిషన్ భగీరథ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించిన ప్రతినిధి బృందం, ఉద్యోగ భద్రతతో పాటు ఎన్నికల హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది.



# వానాకాల సాగుకు వెంటనే ఏర్పాట్లు పూర్తి

- వ్యవసాయానికి అవసరమైన అన్ని చర్యలను పూర్తి చేయాలి
- అధికారులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ కార్యకలాపాలు ఎలాంటి అంతరాయం లేకుండా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు విత్తనం నాటినప్పటి నుంచి పంట విక్రయించే వరకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ పరిస్థితులు, ఆయిల్ పామ్ విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల సరఫరా, ఎరువుల లభ్యత, మొక్కజొన్న కొనుగోలు చెల్లింపులు, రైతు భరోసా నిధుల పంపిణీ, ఎల్‌నినో పరిస్థితులకు ప్రత్యామ్నాయ కార్యాచరణ తదితర కీలక అంశాలపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులు పొలాల్లో నాటేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో మొక్కల కొరత రావడం లేదా సరఫరాలో ఆలస్యం జరగడం వంటివి ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. జిల్లాల వారీగా ఉన్న అవసరాలను ముందుగానే శాస్త్రీయంగా అంచనా వేసి, నర్సరీల నుంచి సకాలంలో రైతులకు మొక్కలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు విజయవంతం కావడానికి డ్రిప్ ఇరిగేషన్ ఎంతో కీలకమని మంత్రి స్పష్టం చేశారు. డ్రిప్ పరికరాల సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా తయారీ, సరఫరా క్షేత్రస్థాయిలో అమలు చేసే సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ సబ్సిడీ ప్రయోజనాలు రైతులకు చేరడంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా, పరిపాలనా ప్రక్రియలను మరింత వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

**పెండింగ్ లేకుండా మొక్కజొన్న చెల్లింపులు, ఎరువుల సరఫరా**

మొక్కజొన్న కొనుగోళ్లపై జరిగిన సమీక్షలో భాగంగా, రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. చెల్లింపుల ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రైతుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో నగదు జమయ్యేలా మార్క్‌ఫెడ్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, వానాకాలంలో యూరియా సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు జిల్లాల వారీగా ఉన్న నిల్వలు, పంపిణీ వివరాలను పర్యవేక్షిస్తూ, స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా ఎరువుల సరఫరా జరిగేలా ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు జరిపించేందుకు గల సాధ్యాసాధ్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని మంత్రి అధికారులకు కీలక సూచన చేశారు.

ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో తీసుకోవాల్సిన తొలి ప్రత్యామ్నాయ కార్యాచరణను జిల్లాల వారీగా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇందుకోసం రైతు వేదికలు, గ్రామసభలు, క్షేత్రస్థాయి సమావేశాలను వేదికగా చేసుకుని రైతులకు అవసరమైన శాస్త్రీయ సూచనలు, సలహాలు అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.




# లేబర్ కోడ్స్‌పై తొందరపాటు లేదు

**కార్మికులు, పరిశ్రమలకు సమతుల్య విధానమే లక్ష్యం : మంత్రి వివేక్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల సంక్షేమాన్ని కాపాడుతూనే పరిశ్రమల అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, లేబర్ కోడ్స్ అమలులో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోబోమని కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. కార్మిక సంఘాలు, పారిశ్రామిక వర్గాలతో విస్తృతంగా చర్చించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నిబంధనలను రూపొందిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో మంగళవారం నిర్వహించిన లేబర్ కోడ్స్‌పై భాగస్వాముల సంప్రదింపుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, పరిశ్రమలు సజావుగా, లాభదాయకంగా కొనసాగితేనే ఉపాధి అవకాశాలు పెరిగి కార్మికులకు మరిన్ని సంక్షేమ ప్రయోజనాలు అందించే అవకాశం ఉంటుందన్నారు. యాజమాన్యాలు, కార్మికులు పరస్పర సహకారంతో ముందుకు సాగితే పరిశ్రమలకు సానుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. లేబర్ కోడ్స్‌కు సంబంధించి కార్మిక న్యాయస్థానాల అంశాలు, రాష్ట్ర ప్రయోజనాలు, కేంద్ర ప్రభుత్వానికి చేయాల్సిన సిఫార్సులు, రూపొందించాల్సిన నిబంధనలపై సమగ్ర చర్చ జరగాలని మంత్రి సూచించారు. పారిశ్రామిక వర్గాలు, కార్మిక సంఘాలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు. కార్మికుల హక్కులు, పరిశ్రమల అవసరాలు రెండింటినీ సమన్వయం చేసే విధానానికే ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసేందుకు పారిశ్రామిక సంఘాలతో నెలలుగా చర్చలు జరుపుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్‌టెక్నాలజీ సెంటర్ల (ఎటిసిలు) ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను సిద్ధం చేస్తామని వివరించారు. లేబర్ కోడ్స్‌పై అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# కాళేశ్వరంపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదు

తొమ్మిదిన్నరేళ్లలో ఎందుకు సమస్యలు పరిష్కరించలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలి : మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టును అప్పగిస్తే వారం రోజుల్లో నీళ్లు ఇస్తామని చెబుతున్న మాజీ మంత్రి కెటిఆర్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్లలో ఎందుకు సమస్యలను పరిష్కరించలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. నీళ్లు లేని సమయంలో సముద్రంలోకి నీటిని వదులుతున్నారని చేస్తున్న వ్యాఖ్యలు ఆయన అనుభవ రాహిత్యానికి నిదర్శనమన్నారు. ఎన్‌డిఎస్, సిడబ్ల్యుసి అనుమతులు లేకుండా బ్యారేజీల నిర్వహణ చేపట్టడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. ఎన్‌డిఎస్‌ఎ ఇప్పటికే బ్యారేజీల పునాదుల్లో లోపాలను గుర్తించిందని, వాటిని సరిచేయకుండా నీటిని నిల్వ చేయడం శాస్త్రీయంగా సరైంది కాదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అన్ని సాంకేతిక పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే కాళేశ్వరం పునరుద్ధరణ పనులు చేపడతామని మహేష్‌కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసినట్లుగా హడావుడి నిర్ణయాలు తీసుకోబోమని, ప్రజల నీటి సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని అక్రమాలు చేసిన గత ప్రభుత్వ వైఫల్యాలపై కెటిఆర్ ముందుగా పశ్చాత్తాపం వ్యక్తం చేయాలని, లేదంటే ప్రజలే బిఆర్ఎస్ నేతలకు తగిన బుద్ధి చెబుతారని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన బిఆర్ఎస్ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదని, ఆ ప్రాజెక్టుపై బిఆర్ఎస్ నేతలు మాట్లాడడం విడ్డూరమని ఆయన విమర్శించారు. కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అవినీతి కారణంగానే ప్రాజెక్టు నాణ్యత దెబ్బతిని 'కాళేశ్వరం' కాస్తా 'కూళేశ్వరం'గా మారిందని ఆయన ఆరోపించారు. ఇంజినీర్ల సూచనలను పక్కన పెట్టి అప్పటి సిఎం కెసిఆర్ తనను తాను ఇంజినీర్‌గా భావించుకుని తీసుకున్న ఏకపక్ష నిర్ణయాల వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యత దెబ్బతిన్నదన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగా దాని మనుగడకే ముప్పు ఏర్పడిందని ఆరోపించారు.

**బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటేనని మరోసారి తేలింది**

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ వైఖరి చూస్తుంటే ఆయన బిజెపి నాయకుడిగా మాట్లాడుతున్నారో లేక బిఆర్ఎస్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని మహేష్ కుమార్ విమర్శించారు. కాళేశ్వరం విషయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన సూచనలను పక్కనబెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని విడుదల చేయొద్దని చెప్పింది రాష్ట్ర ప్రభుత్వం కాదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఎన్‌డిఎస్‌ఎ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. కెటిఆర్ సాంకేతిక నిపుణుడు కాదని, ఈ విషయంలో ఎన్‌డిఎస్‌ఎ నిపుణుల అభిప్రాయాలకే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి ఎన్‌డిఎస్‌ఎ నిర్ణయంపై వివరణ కోరాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా కేంద్ర సంస్థ ఇచ్చిన సూచనలను విస్మరించి రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ మధ్య ఉన్న రాజకీయ సంబంధాలు మరోసారి బయటపడుతున్నాయని, ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ అన్నట్లుగా రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఈ రాజకీయ నాటకాలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ముందుకు తీసుకెళ్లి ఎండగడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# శాఖ అధికారాలపై కాంగ్రెస్‌లో కొత్త వివాదం

కడియం శ్రీహరిపై సిఎం రేవంత్‌కు మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేవాదాయ శాఖ అధికారులతో తనకు సమాచారం ఇవ్వకుండా అధికారిక సమీక్ష సమావేశం నిర్వహించారని ఆరోపిస్తూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం ప్రభుత్వ పరిపాలనా విధానాలకు, శాఖా మంత్రి అధికార పరిధికి విరుద్ధమని పేర్కొంటూ పార్టీ క్రమశిక్షణా కమిటీతో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రికి రాసిన లేఖలో, దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన విధాన నిర్ణయాలు, అధికారిక సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ సంబంధిత శాఖా మంత్రి పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేశారు. అయినప్పటికీ తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పా టు ఇతర అధికారులతో సమావేశమై పలు దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, దేవాలయ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, అధికారులకు గడువులు నిర్దేశించడం వంటి అంశాలపై అధికారిక సమీక్ష నిర్వహించారని ఆరోపించారు. ఈ చర్య ప్రభుత్వ నిబంధనల స్ఫూర్తిని ఉల్లంఘించడమే కాకుండా, శాఖా మంత్రి అధికారాలను బేఖాతరు చేసినట్లేనని మంత్రి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులందరికీ శాఖా పరిపాలనకు సంబంధించిన విధాన నిర్ణయాలు సంబంధిత మంత్రి ఆధ్వర్యంలోనే జరగాలన్న విషయం తెలిసినప్పటికీ, శాఖా మంత్రిని పూర్తిగా పక్కనపెట్టి సమీక్ష నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి దారితీస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వంలో పరిపాలనా సమన్వయాన్ని దెబ్బతీసి అధికార యంత్రాంగంలో అయోమయ పరిస్థితులు సృష్టించే ప్రమాదం ఉందని లేఖలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పార్టీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి సంబంధిత అంశాలపై వివరణ కోరాలని, అవసరమైతే పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

# రూ.360 కోట్లతో రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

10 ఆర్‌డిఒ, 107 తహసీల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం
ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్‌డిఒ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రెవెన్యూ భవనాల నిర్మాణాలపై మంగళవారం అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్‌డిఒ కార్యాలయాలకు రూ.263 కోట్లతో అలాగే స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్లతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు,నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డిఐజి కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి రూ.360 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని, ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో కలిసి నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదేళ్ల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

# ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా గుర్తింపు ప్రక్రియ

కాకతీయ విశ్వవిద్యాలయం ఉద్యమకారులతో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజమైన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరిగేలా సమగ్ర నివేదికను సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు కాకతీయ విశ్వవిద్యాలయం ఉద్యమ నేతలకు హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, వారి సామాజిక భద్రత, సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ మంగళవారం అమరవీరుల జ్యోతి ప్రాంగణంలో కాకతీయ విశ్వవిద్యాలయం (కెయు) విద్యార్థి ఉద్యమకారులతో సమావేశమైంది. ఈ సమావేశంలో రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోదండరాం, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్, మోతే శోభన్‌రెడ్డి పాల్గొని విద్యార్థి నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన విద్యార్థి నాయకుల సూచనలు, అభిప్రాయాలను కమిటీ సభ్యులు స్వీకరించారు. తెలంగాణ ఉద్యమంలో కాకతీయ విశ్వవిద్యాలయం పోషించిన పాత్రను గుర్తిస్తూ, ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని సభ్యులు పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమకారులు మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపు కార్డులతో పాటు వారి కుటుంబాలకు ఉపాధి, విద్య, వైద్యం, పెన్షన్ వంటి సామాజిక భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. మాజీ కాకతీయ విశ్వవిద్యాలయ జెఎసి వరంగల్ కన్వీనర్, ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రితో పాటు వివిధ కాకతీయ విశ్వవిద్యాలయ ఉద్యమ నాయకత్వం తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు సీనియర్ ఉద్యమ నా యకులు, విద్యార్థి నాయకులు, ఉద్యమ కార్యకర్తలతో కలిసి కమిటీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల విద్యార్థుల పాత్ర చారిత్రాత్మకమన్నారు. సమావేశంలో వచ్చిన అన్ని సూచనలు, సంక్షేమ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరిగేలా సమగ్ర నివేదిక సిద్ధం చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసి, ఉద్యమంలో విశేష సేవలందించిన నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవం, అధికారిక గుర్తింపు ఇచ్చి న్యాయం చేయాలని డాక్టర్. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి కమిటీని కోరారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి

సిపిఐ శిక్షణా తరగతుల్లో జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ




**ప్రజాపక్షం/భద్రాచలం :** రాజకీయ పార్టీలను విభజించి లబ్ధి పొందే ప్రయత్నంలో బిజెపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ ఆరోపించారు. 2004 ఎన్నికల్లో 300 సీట్ల కోసం ప్రయత్నం చేసి భంగపడ్డ బిజెపి దేశంలోని రాజకీయ పార్టీలను చీల్చి పార్లమెంట్‌లో ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు వెంపర్లాడుతోందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కౌన్సిల్ సభ్యుల స్థాయి రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు మంగళవారం భద్రాచలంలో ప్రారంభమయ్యాయి. ముందుగా పార్టీ పతాకాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు ఆవిష్కరించారు. శిక్షణా తరగతులను ప్రారంభించిన రామకృష్ణ , సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో విపక్షాలను చీల్చే ప్రయత్నం చేస్తూ కాషాయం పార్టీ వికృత క్రీడకు తెరలేపిందన్నారు. బెంగాల్‌లో బిజెపి వ్యవహరించిన తీరు ప్రజా స్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. ఒక పక్క సర్ పేరుతో ఓట్లను తొలగిస్తూ మరో పక్క రాజకీయ పార్టీలను ముక్కలు చేస్తుందని రామకృష్ణ ఆరోపించారు. బిజెపి అధికారంలోనికి రావడానికి కారణమైన రామనామానికే చివరకు శఠగోపం పెట్టే పరిస్థితి తీసుకొస్తోందన్నారు. దేశవ్యాప్తంగా రూ.3624 కోట్ల విరాళాలు వచ్చాయని చెబుతున్న మత సంస్థలు దారితప్పిన నిధులపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని రామకృష్ణ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాల నిధుల కైంకర్యంతో బిజెపి భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. దీనిపై బిజెపి మిత్రపక్షాలు స్పందించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల అవసరాలను గుర్తించి పాలన చేయని వారిని గద్దె దింపుతున్నారని, ఇందులో యువత ప్రధాన పాత్రపోషిస్తోందని రామకృష్ణ అన్నారు. ప్రస్తుత తరం మార్పు కోరుకుంటోందని తెలిపారు. ఇటీవల దేశంలో కాక్రోచ్ జనతా పార్టీకి వచ్చిన స్పందన తమిళనాడులో టివికె గెలుపు ఇవన్నీ మార్పులను సూచిస్తున్నాయన్నారు. కొత్తగూడెంలో ఒక సానుకూల పరిణామం తొలి మేయర్ గెలిచేందుకు కారణమైందని, అలాంటి పరిస్థితులే దేశంలో పునరావృతం కానున్నాయన్నారు. పెరిగిన నిరుద్యోగం, అవినీతి, ఆర్థిక అంతరాలు రానున్న కాలంలో మార్పుకు దారితీస్తాయని ఆయన తెలిపారు. నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లో వచ్చిన పరిణామాలు భారత్‌లో కూడా రానున్నాయన్నారు. యువత విద్యార్థులను ఆకర్షించడం ద్వారా ముందుకు సాగాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.

**బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ**

సిపిఐ బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందని రామకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు చేసేందుకు ఆగస్టు 6 నుండి 15 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామగ్రామాన పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న ప్రస్తుతం బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను నిరశిస్తూ చలో ఢిల్లీ పిలుపునిచ్చామని ఆయన తెలిపారు. ఈ తొలిరోజు శిక్షణ తరగతుల్లో మార్క్సిజం సమకాలీన సమాజంలో దాని ప్రాధాన్యత అనే అంశాన్ని ప్రొ॥యు గల్ రాయల్, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో భారదేశం అనే అంశాన్ని బివి మోహన్ రెడ్డి బోధించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, జమ్ముల జితేందర్ రెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎర్రా బాబు, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌కే జానీమియా, మున్నా లక్ష్మి కుమారి, ఏపూరి లతాదేవి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**మూసాపేట్ సర్కిల్-53**

**NIT No.** 12/EOI/CMC/MPT/EE/2026-27, తేది: 07.07.2026, **పని పేరు:** సిఎంసి, కెపిజెడ్, మూసాపేట్ సర్కిల్ పరిధిలోని క్రీడా ప్రాంగణం మరియు వైకుంఠదామం (హిందూ స్మశాన వాటిక) నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణ మరియు బిడ్ ఆహ్వానం, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 09.07.2026 ఉ.10.30గం.ల నుండి 23.06.2026 ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీమతి టి.రాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మూసాపేట్ సర్కిల్-53, సిఎంసి. ఫోన్ నెం. 8897507674. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, మూసాపేట్ సర్కిల్-53.

DIPR R.O. No. : 5650-PP/CL/ADVT/2026-27, Date: 07-07-2026

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
"ELECTRICITY SAVED IS ELECTRICITY PRODUCED"
**టెండర్ నోటీసు నెం : 03/26-27**

**(A)Spec.T-13 :** ఏప్రిల్ -2026 నుండి మార్చి-2027వరకు SCADA సర్కిల్ ఆఫీస్ భవనంలో అందుబాటులో ఉన్న వివిధ విద్యుత్ పరికరాల నిర్వహణ కోసం. **(B) Spec.T-14 (SCలకు రిజర్వ్ చేయబడింది) :** ఏప్రిల్ 2026 నుంచి మార్చి 2027వరకు SCADA సర్కిల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఎయిర్ కండీషనర్ల నాన్ కాంప్రహెన్సివ్ యాన్యువల్ మెయింటెనెన్స్. **(C) Spec.T-15 :** SCADA-DMS డివిజన్‌లోని SCADA నార్త్ SD పరిధిలోగల బంజారాహిల్స్ సర్కిల్‌లోని వివిధ 33/11 KV సబ్ స్టేషన్ల (29సంఖ్య) వద్ద SCADA-DMS పరికరాల నిర్వహణ. **(D)Spec.T-16 (STలకు రిజర్వ్ చేయబడింది) :** SCADA-DMS డివిజన్‌లోని SCADA నార్త్ SD యొక్క సికింద్రాబాద్ సర్కిల్‌లో ఉన్న వివిధ 33/11 KV సబ్ స్టేషన్ల (27 సంఖ్య) వద్ద పరికరాల నిర్వహణ. **(E) Spec. T-17 :** SCADA-DMS డివిజన్‌లోని SCADA సౌత్ SD పరిధిలోగల వివిధ 33/KV సబ్ స్టేషన్ల (28 సంఖ్య) వద్ద పరికరాల నిర్వహణ. **(F) Spec. T-18 :** SCADA-DMS డివిజన్‌లోని SCADA సెంట్రల్ సర్కిల్‌లో వివిధ 33/11 KV సబ్ స్టేషన్ల (27 సంఖ్య) వద్ద SCADA-DMS పరికరాల నిర్వహణ. **(G) Spec.T-19 :** SCADA-DMS డివిజన్‌లోని RR-II SCADA–DMS SDలో హబ్సిగూడ సర్కిల్‌లో 33/11 KV సబ్‌స్టేషన్ల (30 సంఖ్య)లో SCADA -DMS పరికరాల నిర్వహణ (మరిన్ని వివరాల కోసం దయచేసి website https : // tgsouthernpower.org) : ఫోన్ : 040–23431333/1112/1125ను సంప్రదించగలరు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్/SCADA.

DIPR R.O. No. : 5699-PP/CL/ADVT/2026-27 Date: 07-07-2026

# అర్హులైన వారికి క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు

ఎంపి పోరిక బలరామ్ నాయక్



ప్రజాపక్షం/మహబూబాబాద్ : అభివృద్ధి సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందించాలని, జిల్లా అభివృద్ధిలో అధికారులు,ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని దిశ కమిటీ చైర్మన్ మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాంనాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో దిశ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె.అనిల్ కుమార్,(ఇంచార్జ్) స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, దిశ కమిటీ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు,జిల్లాలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందించడం కోసం అధికారులు పనిచేయాలని సూచించారు. వ్యవసాయం, హౌసింగ్, వైద్య ఆరోగ్య, సంక్షేమం, స్టేట్, నేషనల్ హైవే, డీఆర్డిఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సివిల్ సప్లై, ఎంపీ, డి.ఎం. ఎఫ్.టి ల్యాండ్స్ మార్కెటింగ్, విద్యా శాఖ, పశు వైద్య, పశుసంవర్ధక, సెరికల్చర్, హార్టికల్చర్, ఉపాధి కల్పనా, పంచాయతీ, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, బిసి, సంక్షేమ శాఖలు, మైన్స్ అండ్ జియోలజీ, కార్మిక, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పరిశ్రమలు, ప్రీ మెట్రిక్/ పోస్ట్ మెట్రిక్, ఎం.సి.ఎం, ఉపకార వేతనాలు, యూత్,స్పోర్ట్స్, వాతావరణ, బిఎస్ఎన్ఎల్, మత్స్య శాఖ, రెడ్కో, పోస్టల్, బ్యాంక్స్, పురపాలక సంఘాలు (మున్సిపల్) మహబూబాబాద్, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు, కేసముద్రం, రోడ్లు, భవనాలు రహదారి, గ్రంథాలయం, జిల్లా ప్రధాన హాస్పిటల్, కామన్ సర్వీస్ సెంటర్, తదితర (90) అంశాలపై సుదీర్ఘ సమయం సమావేశం జరిగింది.దిశా కమిటీ చైర్మన్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూమహబూబాబాద్ మున్సిపల్ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే నిర్వహించబడుతున్న అంతర్గత పట్టణ అభివృద్ధి పనులను వేగం పెంచాలని సూచించారు.యూరియా కొరత లేకుండా, బుకింగ్ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ప్రతీ కేంద్రం వద్ద ఒక వాలెంటీర్ ను నియామకం చేస్తున్నామని, గడ్డి మందు వాడకం వలన వ్యాధులు వస్తున్నాయని, అలాగే (ప్యారకర్పస్ గడ్డి మందు) ను బ్యాన్ చేయడం జరిగిందన్నారు.జిల్లాలో అర్హులైన అధికారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించాలని, మ ంజూరు అయిన ఇండ్ల విషయంలో అధికారులు వేగ ంగా పూర్తి చేయాలి రైల్వే లైన్లో వెంబడి అవసరం ఉన్నచోట అండర్ పాసులు, ఆర్వోబిలు నిర్మాణం కోసం అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తెలియపరచాలన్నా. కేంద్రం నుండి వచ్చే నిధుల సమీకరణ కోసం ముఖ్యమంత్రి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని ముందుకు సాగుతుందని జిల్లా అభివృద్ధి కోసం అధికారులు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు.ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల కు చేరవేస్తూ వాటిపై అవగాహన కల్పించడం కోసం అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు,జాతీయ గ్రా మీణ ఉపాధి హామీ కొత్త చట్టం ప్రకారం జిల్లాలో షె డ్యూల్ ప్రకారం పథకాలను అమలు చేయాలని, ఇరిగేషన్ పరిధిలో ఉన్నటువంటి పెండింగ్ పనులను మైనర్ రిపేరు పనులను త్వరగా పూర్తి చేయాలని వర్షాకాలం నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు, జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేయడం జరుగుతుందని, యూరియా ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నానో యూరియా వాడ కం పై స్వయం సహాయక బృందాల చేత డ్రోన్ ఏర్పాట్లు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారుకిషన్ రాజపుత్, బాబురావు,ఎం.గీతరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్లు మహబూబాబాద్ గుగులోతు జ్యోతి, డోర్నకల్ రాజకుమారి, కేసముద్రం బానోతు సునీత, మరిపెడ ప్రగతీ రెడ్డి, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరాలుగా తీర్చిదిద్దాలనేదే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ప్రజాపక్షం/ఖానాపురం : మహిళలను కోటీశ్వరాలుగా తీర్చిదిద్దాలనేదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అ న్నారు. ఖానాపురం మండలం రాగంపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులు 10 లక్షలతో మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ, 12 లక్షలతో అంగన్వాడీ భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ ఎలగందుల రాజు ఆద్వర్యంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు.మహిళా సాధికారతే సమాజ అభివృద్ధికి బలమైన పునాది అనే నమ్మకంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి, సమాజానికి అండగా నిలవాలనే సంకల్పంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఉపాధి కల్పన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, సూక్ష్మ వ్యాపారాలకు ప్రోత్సాహం వంటి చర్యల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.మహిళలు, రైతులు, యువత, చిన్నారులు, వృద్ధులు సహా ప్రతి వర్గం సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

బల్దియా కమిషనర్ టి. వెంకన్న



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: గ్రేటర్ వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి వెంకన్న ఆదేశించారు. మంగళవారం వివిధ విభాగాల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పాల్గొని నగరాభివృద్ధి, పారిశుధ్యం, మౌళిక సదుపాయాల నిర్వహణ, ప్రజాసేవల మెరుగుదలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల గోడలపై అనధికారికంగా అతికించిన పోస్టర్లు, ప్రకటనలను వెంటనే తొలగించాలని, అలాగే అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రకటన ఫలకాలను ప్రత్యేక చర్యల ద్వారా తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గ్రేటర్ నగరాల తరహాలో సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు ప్రతి విభాగం బాధ్యతాయుతంగా పనిచేయాలని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి పట్టణ ప్రణాళిక అధికారి రవీందర్ రాడేకర్, జిల్లా అటవీ అధికారి శంకర్ లింగం, అకౌంట్స్ అధికారి శివలింగం, ఉప కమిషనర్ ప్రసన్న రాణి, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేష్, ఉద్యానవన అధికారి లక్ష్మారెడ్డి, కార్యనిర్వహక ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌డిఎఫ్ నిధుల మంజూరు పత్రాలు సర్పంచ్‌లకు అందజేత

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని రాజకీయాలకు అతీతంగా అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ధర్మసాగర్ మండలంలోని సాయిపేట, క్యాతంపల్లి, తాటికాయల, నర్సింగారావుపల్లి, ఎల్కుర్తి, కరుణాపురం గ్రామాలలో అభివృద్ధి పనులకు మంజూరు అయిన ఎస్‌డిఎఫ్ నిధుల మంజూరు పత్రాలను ఆయా గ్రామ సర్పంచులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు. సాయిపేట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సిసి డ్రైన్ ల నిర్మాణానికి 20లక్షలు, తాటికాయల గ్రామంలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడ నిర్మాణానికి 5లక్షలు, ఎల్కుర్తి గ్రామం ఏమ్మన్నగూడెంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి 10లక్షలు, క్యాతంపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనానికి, త్రాగునీటి సమస్య పరిష్కానికి 6లక్షల 75వేలు, కరుణాపురం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి 4లక్షల 50వేలు, నర్సింగరావుపల్లి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం, ప్రాథమిక పాఠశాలలో మారమ్మత్తులకు 15 లక్షలు మొత్తం 61లక్షల 24వేల రూపాయల విలువగల అభివృద్ధి పనులకు మంజూరు పత్రాలను ఆయా గ్రామాల సర్పంచులకు అందజేశారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.ధర్మసాగర్ మండల పార్టీ అధ్యక్షుడు పెసరు రమేష్, ఆయా సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ

కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

ప్రజాపక్షం/కాజీపేట : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయ్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు.మంగళవారం కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా కలెక్టర్, వార్డుల వారీగా ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలు, కుటుంబ సభ్యుల వివరాల నమోదు, నింపిన ఫారాల సేకరణ, డిజిటలీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఓటర్ల వివరాల నమోదు సమయంలో పూర్తి ఖచ్చితత్వం పాటించాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు.అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలన జరిపి ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

## 'ఆల్బెండజోల్' మాత్రలు తప్పనిసరి

కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి : ఈ నెల 13న నిర్వహించే నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యం లోడివార్మింగ్ డే ముందస్తు ఏర్పాట్లపై విద్యా, వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1 నుండి 19 ఏళ్ల వయస్సు గల 70,700 మంది పిల్లలను ఈ కార్యక్రమం కోసం గుర్తించడం జరిగిందని తెలిపారు. విద్యా, వైద్య, మున్సిపల్, పంచాయతీ రాజ్ , అంగన్‌వాడీ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, 119 సంవత్సరాలున్న ఏ ఒక్కరు మిగిలిపోకుండా వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లల్లో నట్టల నివారణ ద్వారా రక్తహీనత తగ్గి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని, ఈ కార్యక్రమంపై తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మాత్రలు తీసుకోవడం వల్ల ఎదుగుదల బావుంటుందని, అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్ వాడి కేంద్రాల్లో అవగహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంపై పంచాయతీలు, మున్సిపాలిటీలో టామ్ టామ్ ద్వారా విస్తృతంగా అవగహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

# అర్హులైన ఓటర్ల హక్కులను కాలరాయొద్దు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి
తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



ప్రజాపక్షం, తొర్రూరు : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా మారకూడదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తొర్రూరు పట్టణంలో జరుగుతున్న మూడు రోజుల రాజకీయ శిక్షణ శిబిరాల ముగింపు సమావేశంలో శ్రీనివాసరావు పాల్గొనగా నల్లు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన శిక్షణ తరగతులు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, సహాయ కార్యదర్శి బి.అజయ్ సారధిరెడ్డి పాల్గొన్నారు.కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా మారకూడదని, 2002నాటి ఓటర్ల జాబితాలను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్లు, ముఖ్యంగా అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారు, వలస కార్మికులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. సాంకేతిక లోపాలు, వయస్సు తారతమ్యాల నెపంతో సామాన్యుల ఓట్లను తొలగించే కుట్రలను మేము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రతీ పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఈసీపై ఉందన్నారు. సర్ సర్వే నిర్వహణ తీరుపై ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొందన్నారు. బూత్ లెవల్ అధికారులు అడుగుతున్న పత్రాలు, నింధనలపై స్పష్టత లేదన్నారు. అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా విపక్షాలకు మద్దతుగా నిలిచే ప్రాంతాల్లో ఓట్లను భారీగా తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల ధృవీకరణ కోసం ఆధార్ కారుడ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు వంటి ఇతర గుర్తింపు పత్రాలను కూడా అనుమతించాలన్నారు. దేశ రాజకీయ పరిస్థితులు మార్చేందుకే 'సర్'ను ప్రవేశపెట్టారని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ద్వారా ప్రజలకు లేకుండా చేసేందుకు జరుగుతున్న కుట్రను అడ్డుకొని ప్రజాస్వామ్యాన్ని కాపడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. హక్కును రక్షించుకునేందుకు ఎస్ఐఆర్ పట్ల వార్డు, గ్రామ స్థాయి నుంచి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన ఉందన్నారు.

### దేశంలో కమ్యూనిజానిదే భవిష్యత్తు

ఈ శిక్షణ తరగతుల ముగింపులో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, సీపీఐ మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయసారధిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, నేతలు ఓమ బిక్షపతి, బందు మహేందర్, కిరణ్, లక్ష్మణ్, కుమార్, నవీన్,వెంకన్న,సాంబలక్ష్మి , పాండురంగాచారి, వెంకన్న, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## అవినీతి గురించి మాట్లాడే నైతికత బిఆర్ఎస్‌కు లేదు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ : కూడా భూముల వేలంలో అవినీతి జరిగిందంటూ మాజీ ఎమ్మెల్యే, మాజీ కుడా చైర్మన్ ఈ రోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.వరంగల్‌లో మీడియా ముందుకు వచ్చే ధైర్యం లేక హైదరాబాద్‌లో దాక్కొని ప్రెస్‌మీట్ పెట్టడం మాజీ ఎమ్మెల్యే దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. నిజంగా ఆరోపణల్లో నిజం ఉంటే హనుమకొండలో ప్రజల మధ్య నిలబడి మాట్లాడాలని, ప్రజలను వదిలేసి హైదరాబాద్‌లో రాజకీయ నాటకాలు ఆడడం హాస్యాస్పదమని విమర్శించారు.కూడా భూముల వేలం పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్వహించామని, వేలంలో పాల్గొనే అవకాశం అందరికీ కల్పించామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వేలంలో పాల్గొనకుండా ఇప్పుడు అవినీతి జరిగిందని అబద్ధాలు ప్రచారం చేయడం రాజకీయంగా మనుగడ కోసం చేస్తున్న చవకబారు ప్రయత్నమని అన్నారు.హనుమాన్ టెంపుల్ సమీపంలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మిస్తున్నామని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, అక్కడ ప్రభుత్వం ఆధ్వర్యంలో శిల్పారామం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ ఎ స్ పాలనలో వరంగల్‌ను భూ కబ్జాలు, అక్రమా లు, దో పిడీలు, గుండాయిజంతో అతలాకుత లం చేసిన నాయకులు ఇప్పుడు నీతి, నిజాయితీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల ఆస్తులను దోచుకున్న వారు ఇప్పుడు అవినీతి గురించి ఉపన్యాసాలు ఇవ్వడం ప్రజలు చూస్తున్నా రని విమర్శించారు.ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజలే తీర్పు చెబుతారు. మీ పదేళ్ల పాలనకు, మా మూడేళ్ల పాలనకు మధ్య తేడా ఏమిటో వరంగల్ ప్రజలకు స్పష్టంగా తెలుసు. అబద్ధాలతో కాదు అభివృద్ధితోనే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటాం అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటును కాపాడాలి

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు కాపాడవలసిన బాధ్యతను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్బులో ఎస్ఐఆర్ సమస్యలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ధనవంతులు ఓటు హక్కును ఉపయోగిస్తారని కేవలం పేద వర్గాలు మాత్రమే ప్రభుత్వాల తలరాతలు నిర్ణయిస్తారని అలాంటి ఓట్లు జాబితా నుండి గల్లంతు కాకూడదని అన్నారు. ఓటరు చైతన్యం లేకపోవడం వల్ల జరిగే అనర్థాలు అవకతవకలు చోటు చేసుకుంటాయని పౌర సమాజం జాగ్రత్తగా సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థలను రాజ్యాంగ హక్కులను కాపాడడానికి అన్ని పౌర సంఘాలు చైతన్యంతో నిబద్ధతతో కృషిచేయడాన్ని విస్మరించరాదని విశ్రాంత అధ్యాపకుల సంఘం నాయకులు వీరమల్ల బాబురావు అన్నారు. బోగస్ ఓట్ల తొలగింపు ఒకే వ్యక్తికి రెండు లేదా మూడు ప్రదేశాలలో ఉన్న ఓట్ల తొలగింపు లాంటివి చేసినప్పటికీ వాస్తవిక ఓటర్లకు అన్యాయం జరగకూడదని ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడకూడదని అందులో పౌర సమాజమే ప్రముఖ పాత్ర పోషించాల్సిన బాధ్యత ఉందని శాంతి సంఘం నాయకులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్ అన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

ప్రజాపక్షం/జనగామ : గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు, కార్యదర్శుల పాత్ర కీలకమని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అన్నారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై రాష్ట్ర పం చాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వయించారు.గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకొని రూపొందించాలన్నారు. ఆయా గ్రామాల అవసరాలకు స్వయంగా గుర్తించి దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని, గ్రామాల్లో ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనం కోసం అనే విషయం మరిచిపోవద్దు అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేయరాని, నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారితనం పాటించాలన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రతి సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శికి అవగాహన ఉండాలని, అవసరమైతే వారికి శిక్షణ ఇవ్వాలన్నారు.

# ల్యాండ్ పూలింగ్‌కు 30 ఎకరాల భూమి అప్పగింత

'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్: కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(కుడా) ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్ పి ఎస్) ప్రక్రియలో భాగంగా వరంగల్, హనుమకొండ నగరాల పరిధిలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హనుమకొండ వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్స్ పరిసర ప్రాంతాల్లోని భూములను అభివృద్ధి చేసేందుకు భూ యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. మంగళవారం వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్స్ భూయజమానుల కమిటీ సభ్యులు, ప్రతినిధులైన బూర విద్యాసాగర్, ఎం. విజయ్ కుమార్, డి.స్వరాజ్యలక్ష్మి , బూర అశోక్ కుమార్, బల్లెం వెంకటయ్య, రాజేష్, తిరుపతి రెడ్డిలు సంయుక్తంగా కుడా కార్యాలయంలో చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిని, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అజిత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ క్రమంలో వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్స్ పరిధిలోని సుమారు 30 ఎకరాల విలువైన భూమిని ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్ పిఎస్) నిబంధనల ప్రకారం.. కుడా ఆధ్వర్యంలో లేఅవుట్ అభివృద్ధి చేయడానికి యజమానులు సంపూర్ణ అంగీకారం తెలిపారు. ఇందుకు సంబంధించిన అధికారిక అప్లికేషన్లు, భూమి హక్కుల పత్రాలు, అవసరమైన అన్ని డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలను అధికారికంగా సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. నగర సుందరీకరణ, క్రమబద్ధమైన పట్టణాభివృద్ధికి ల్యాండ్ పూలింగ్ ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు గాను, రాబోయే 4 రోజుల్లో ఒక ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.కుడా వేలంలో అవినీతి జరిగితే ఆ భూములు బీఆర్ఎస్ నాయకులు కొనుక్కోవాలి అని అన్నారు. బీఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం కోసం మొదట ఆ భూమిలోనే భూమి పూజ చేసి అక్కడ ఉండలేమని గ్రహించి విలువైన పార్క్ స్థలాన్ని కబ్జా చేసిన బీఆర్ఎస్ నాయకులు దొంగే దొంగ అనే విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు.

## కాళేశ్వరానికి మచ్చపడితే భావితరాల భవిష్యత్ ఖరాబే

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



ప్రజాపక్షం/భూపాలపల్లి : దేవుళ్లను పూజించే సామాజిక వర్గంలో జన్మించిన దుద్దిళ్ల దంపతులు దక్షణకాశీగా పేరుగాంచిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని అపవిత్రం చేస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని భీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండు రోజుల క్రితం కాటారం మండలం ధన్వాడ గ్రామంలో జరిగిన ఎల్లమ్మ గుడి ప్రారంభోత్సవం ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీదర్ బాబు చీరలు పంపిణీ చేశారని, అవి 2025 పుష్కరాలకుసంబంధించినవని, అవి ఇక్కడ ఎలా పంచారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వర ముక్తీశ్వర ఆలయాన్ని పూర్తిగా అవినీతిమయం చేసిన శైలజారామయ్యర్ ఈ సమాజానికి జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తన భర్త రాజకీయంలో వారి అవసరాల కోసం కాళేశ్వర ఆలయాన్ని వదిలిపెట్టడం లేదని ఇప్పటికే చెప్పామని ఆయన గుర్తు చేశారు. శైలజా రామయ్యర్ వారితో పాటు వారి కుటుంబం ఎక్కడపడితే అక్కడ దోచుకుతింటాండ్లని వట్టిగనే చెప్తలేమని, ధన్వాడలో స్వయంగా శైలజారామయ్యార్ భర్త ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ చీరలు పంపిణీ చేసినట్లు అన్ని ఆధారాలు ఉన్నాయని మీడియా ముందు చూపించారు. 2025 పుష్కరాల్లో ఆలయం నుంచి డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసిన చీరలు, ప్రసాదం 50వేలు, వచ్చే పుష్కరాల్లో లక్ష కిట్లను పక్కకు పెట్టి వచ్చే ఎన్నికలకు వాడుకునే ఆలోచన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దొంగతనంగా తీసుకువచ్చిన చీరలు అందించి ఎల్లమ్మ గుడిని కూడా అపవిత్రం చేశారని ఆయన వాపోయారు. తాము ఆలయానికి సంబంధించిన డబ్బులతో ఏమేమి ఖర్చు చేశారని ఇన్ఫర్మేషన్ యాక్ట్‌లో తానే స్వయంగా అడిగితే సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఏమీ చెప్పవద్దని సమాధానం ఇచ్చారని అన్నారు. అయితే ఆలయానికి సంబంధించిన భూములు, డబ్బులు, నగలు, బంగారంలాంటి వివరాలు ఇవ్వవద్దని సుప్రీంకోర్టు తీర్పు ఉందే కానీ ఖర్చులను చెప్పవద్దని ఎక్కడా లేదని ఆయన వివరించారు. సుప్రీంకోర్టు తీర్పును అడ్డుపెట్టుకుని దుద్దిళ్ల కుటుంబం అవినీతి బయటపడకుండా ప్రతి పండుగకు కోట్లు దోచుకుంటున్నారని ఆయన అన్నారు.

## ప్రభుత్వ భూమిలో.. అక్రమ భవనాలు నిర్మించొద్దు



ప్రజాపక్షం/మంగపేట : ములుగు జిల్లా ఏజెన్సీ ఏరియా మంగపేట మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని తహశీల్దార్ తోట రవీందర్ ను కలిసి మెమోరాండం ఇచ్చిన ఆదివాసి ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ మంగపేట తాహసిల్దార్ కార్యాలయం చుట్టూ పక్కల గిరిజన ప్రాంతంలో గిరిజన చట్టాలు 1/59 1/70 ఎల్టిఆర్ పెసా చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని గతములో ఎమ్మార్వో కార్యాలయంలో పనిచేసిన జూనియర్ అసిస్టెంట్లకు విఆర్ఓ లకు అటెండర్ వాచ్మెన్ లకు అప్పటి తహసిల్దార్ సర్వేనెంబర్ 107/1 లో ఇంటి నిర్మాణం కొరకు ఇచ్చినారు అంటూ చెప్తున్నారు ఒక్క వెళ ఇస్తె సర్వే నెం 107/1 ఉండాలి కాని ఒక ప్రభుత్వ ఉద్యోగి ఎండి మున్వర్ అక్రమంగా గిరిజన చట్టాలకు విరుద్ధంగా ఈదులకుంట సర్వే నెంబర్ 20 చెరువు శిఖములో భవన నిర్మాణాలు ఎలా కడతారు ఇట్టి ప్రభుత్వ భూమిని నిరుపేదలైన ఆదివాసులకు ఇంటి స్థలాలకి ఇవ్వాలని తహసిల్దార్ తోట రవీందర్ ని కోరారు.

# మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తెలంగాణ

## నేరస్తుల కదలికలపై నిఘా
## సాంకేతికత వినియోగంలో ముందంజ
## ఖమ్మం పోలీసుల పనితీరు భేష్
### డిజిపి సి.వి. ఆనంద్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చి దిద్దటమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సి.వి. ఆనంద్ అన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి తెలంగాణకు తరలివస్తున్న మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తుపదార్థాలను కట్టడి చేసేందుకు గత మూడు రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించగా మంగళవారం ఖమ్మం కమిషనరేట్‌ను సందర్శించి జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణా, సైబర్‌నేరాల దర్యాప్తులో ఖమ్మం జిల్లా పోలీసుల పనితీరు ప్రశంసనీయమని కితాబునిచ్చారు. తెలంగాణలో పోలీస్‌ను బలపరిచి కచ్చితత్వంతో పనిచేసేవిధంగా వారికి తగిన సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రధానంగా ప్రజలకు పోలీసుశాఖ నుంచి ఏది ఆశిస్తారో ఆదిశగా పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ముఖ్యంగా బేసిక్ పోలీసింగ్ పాటించాలని సీనియర్ అధికారులు తరచూ స్థానిక పోలీస్ స్టేషన్లను సందర్శిస్తూ వారి పరిధిలోని గ్రామాలు, పట్టణాలను విజిట్ చేయడంతో పాటు సిబ్బందితో విజిటింగ్ రికార్డులో నమోదు చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఒలు మూడు గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు తప్పనిసరిగా రాష్ట్రవ్యాప్తంగా అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. నేరనియంత్రణ, దర్యాప్తులో భాగంగా నమోదైన కేసులను ఛేదించడంతో పాటు నేరస్తులను ఆరెస్ట్ చేయడం నుంచి చార్జ్‌షీట్, కోర్టులో నిందితులకు శిక్షపడేలా న్యాయమూర్తులతో సత్సంబంధాలు ఏర్పారుచుకుని, సరైన సాక్ష్యాధారాలు సమర్పించాలని సూచించారు. ఆకస్మిక తనిఖీలు, పగలు, రాత్రిగస్తీ వంటి అంశాల్లో ఖమ్మం పోలీసులు ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో తెలంగాణ పోలీసులు ముందంజలో ఉన్నారన్నారు. సిసిటిఎన్ఎస్ పి టూ, టిజికాప్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఏవిధంగా పోలీసింగ్ అంశాల్లో వినియోగించుకోవచ్చు అనేదానిపై జిల్లా కేంద్రంలో ఒక టీమ్ ఏర్పాటు చేసి అందరికి సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఖమ్మం జిల్లాలో సమర్థవంతంగా జరుగుతోందని, మాదక ద్రవ్యాలపైన ప్రత్యేక దృష్టిసారించామన్నారు. నార్కోటిక్స్ వలన రాష్ట్రానికే కాక దేశానికి పెద్ద ముప్పన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భవిష్యతు తరాలపై పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి విక్రయదారుల కన్న మావోయిస్టులే మేలన్నారు. ఎందుకంటే గంజాయి విక్రయదారులు ప్రతి ఇంట్లో పిల్లలను చాక్లెట్లు వంటి రూపాల్లో గంజాయికి బానిసలను చేస్తున్నారన్నారు. దీనిని కట్టడి చేసేందుకు పోలీసుశాఖకు ప్రజలు, మీడియా, సోషల్‌మీడియా సహకరించి దీనిపై యుద్ధం చేయవలసిన అవసరం ఉందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో నార్కోటిక్స్, మాదకద్రవ్యాలకు అలవాటు పడి చివరికి పనిచేసేవారు కరువైన పరిస్థితి నెలకొందన్నారు. ఆ తరహా పరిస్థితులు మన రాష్ట్రంలో రాకుండా ఉండాలని చర్యలు తీససుకుంటున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా చుట్టుపక్కల ఎపి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం నుంచి గంజాయి సాగు చేసేవారు రవాణా చేస్తూ విక్రయాలు సాగిస్తున్నారన్నారు. గంజాయి రవాణాకు ఇది ప్రవేశ ప్రాంతంగా మారిందన్నారు.

అటువంటి రాష్ట్ర స రిహద్దు జిల్లాలైన అదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, భూపాలపల్లిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎంట్రిపాయింట్లను కట్టుదిట్టం చేసి గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం మోపి వారిని ఆరెస్ట్ చేయడంతో పాటు వారి ఆస్తులను జప్తు చేస్తూ, పిడి యాక్ట్ నమోదుచేస్తే తప్పకుండా గంజాయి రవాణా, విక్రయా లు కట్టడిచేయవచ్చని అన్నారు. ఆదిశగా ఆయా జిల్లాల పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ విషయంలో ఖమ్మం పోలీసుల పనితీరు బేష్ అని డిజిపి ప్రశంసించారు. ఖమ్మం జిల్లాలో దొంగతనాలు, దోపిడీ ద్వారా దాదాపు రూ.11 కోట్లు పోతే సైబర్ క్రైమ్‌ల ద్వా రా డిజిటల్ అరెస్టలు, ప్రలోభాలతో రూ.42 కోట్ల విలువ గల ఆస్తులు, బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బు పోగొట్టుకున్నారని అన్నారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలు ఉన్నారన్నారు. ప్రజలను సైబర్ నేరస్తుల నుంచి కాపాడేందు కు ప్రత్యేకంగా సైబర్‌క్రైమ్ సెల్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నట్లు డిజిపి తెలిపారు. ఈ సమావేశంలో ఆయన వెం ట ఐజి చంద్రశేఖర్‌రెడ్డి, ఈగల్ ఎస్‌పి గిరిధర్, ఖమ్మం సిపి సునిల్‌దత్, ఎసిపి వసుంధర ఉన్నారు.

## దంతెనం గ్రామంలో భారీ చోరీ

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం దంతెనం గ్రామంలో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రిటైర్డ్ రైతు సహకార సంఘం సిఇఒ ఏసుదాసు కుటుంబ సభ్యులతో కలిసి జూన్ 14న హైదరాబాద్ వెళ్లగా, సోమవారం తిరిగి వచ్చి ఇంట్లో సామాన్లు, బీరువాలు చిందరవందరంగా ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లో ఉంచిన నగదు, బంగారం కనిపించకపోవడంతో దుమ్ముగూడెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలి: ఐటిడిఎ పిఒ రాహుల్



**ప్రజాపక్షం/దుమ్ము- గూడెం:** ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెనూ ప్రకారం వేడి, నాణ్యమైన భోజనం అందించాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ సూచించారు. మంగళవారం గౌరారం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన తరగతి గదులు, డార్మిటరీ, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. విద్యార్థినుల గణితం, ఆంగ్ల ప్రతిభను అభినందిస్తూ, పదో తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికబద్ధంగా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూ చించారు. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోసం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో సపోటా మొక్క నాటి, పోషకాహార భోజనాన్ని పరిశీలించి పరిశుభ్రత, ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమీప జీపీఎస్ పా ఠశాల విద్యార్థులను ఏజీహెచ్ఎస్ గౌరారం పాఠశాలలో విలీనం చేస్తే మెరుగైన విద్య అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం మోతిర్, వీరస్వామి, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో రూ.367.29 కోట్లు జమ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైతు భరోసా పథకానికి సంబంధించి ఎనిమిది ఎకరాల వరకు ఉన్న రైతులకు మంగళవారం నిధులు జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 333743 మంది రైతులకు గాను రూ. 367.29 కోట్లు నిధులు జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలో 18,174 మంది రైతులకు రూ.20.87 కోట్లు, సత్తుపల్లి నియోజకవర్గంలో 83791 మంది రైతులకు రూ.91.47 కోట్లు, పాలేరు 78193 మంది రైతులకు రూ. 80.36 కోట్లు, మధిర నియోజకవర్గంలో 87964 మంది రైతులకు రూ. 95.25 కోట్లు, వైరా నియోజకవర్గంలో 64430 మంది రైతులకు రూ. 78.37 కోట్ల నిధులు జమ చేసినట్లు ఆయన తెలిపారు.

## 'సర్' ప్రక్రియ సమర్థవంతంగా అమలు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సర్' ప్రక్రియ భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. బిఎల్‌వి, బిఎల్‌ఒలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా, ఫారాలు పూర్తి చేయడంలో తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. ఈ మేరకు నాయకులు, అధికారులు సహాయ సహకారాలు అందించి ఓటరు వివరాలను నమోదు చేయాలని సూచించారు.

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన ఆచరణలో కనిపించడం లేదని టియుసిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ యాకుబ్ షావలి, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఇల్లందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ, అటవీ శాఖ, ప్రభుత్వ ఆసుపత్రులు, మహిళా శిశు సంక్షేమ శాఖ తదితర విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇప్పటికీ సకాలంలో జీతాలు అందడం లేదన్నారు. తక్కువ వేతనాలతో పని చేస్తున్న కార్మికులు జీతాల ఆలస్యంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి, ప్రతి నెల 1వ తేదీన కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాయం వెంకన్న, యూనియన్ నాయకులు రాజేష్, సంపత్, రవిరెడ్డి, అక్బర్, మహేష్, రాజమ్మ, స్వప్న పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేద విద్యార్థులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో 'సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్' ఫౌండర్ కొనకళ్ల సుధారాణి మంగళవారం సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 153 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఔషధ మొక్కలు నాటి, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదని, విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆమె అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లాల్ అహ్మద్, ఉపాధ్యాయులు శేషు కుమార్, నరసింహారావు, లక్ష్మి, లావణ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వసతుల కల్పన

### అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 58వ డివిజన్‌లో కోటి రూపాయలతో నిర్మించనున్న సిసి డ్రైన్ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నగరాన్ని ఆహ్లాదకరంగా, పరిశుభ్రత, పచ్చదనంతో ఉండేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో పది కాలాల పాటు మన్నేలా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు నూతి సత్యనారాయణ గౌడ్, దొబ్బల సౌజన్య, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో వార్ రూమ్ ప్రారంభం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యాలయంలో వార్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో వార్ రూమ్ ద్వారా బిఎల్‌ఏలకు సూచనలు, సలహాలు అందిస్తామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఓటర్లకు బూత్ లెవల్ ఏజెంట్లు నిత్యం అందుబాటులో ఉంటూ సహాయ సహకరాలు అందించాలన్నారు. అర్హులైన ప్రతి ఓటు జాబితాలో ఉండేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, తూములూరి లక్ష్మి నర్సింహారావు, కిలారు అనిల్ కుమార్, కొట్టే రాజశేఖర్, దామా స్వరూప, వేల్పుల మురళీ, భవాని, ప్రతిభారెడ్డి, నీలవేణి, పద్మ, పి. రాజుగౌడ్, కుక్కల రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే పాయం

### తెలంగాణ శాసనసభ కీలక బాధ్యతలు అప్పగింత
### గిరిజన అభ్యున్నతే ధ్యేయమని పాయం వెల్లడి



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ శాసనసభ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ శాసనసభ అసెంబ్లీ మరియు రిజిస్టర్డ్ షెడ్యూల్డ్ తెగల ట్రైబల్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా పాయం వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ శాసనసభ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలు, గిరిజనుల సమస్యలపై సమగ్ర అధ్యయనం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రభుత్వానికి అవసరమైన సూచనలు చేయడం వంటి కీలక బాధ్యతలను ఈ కమిటీ నిర్వహించనుంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. గిరిజనులకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరేలా క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు నిర్వహించి అధికారులతో సమీక్ష సమావేశాలు చేపడతామని వెల్లడించారు. అలాగే కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించి గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని చెప్పారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, ప్రజల సమస్యల పరిష్కారంలో కమిటీ కీలక పాత్ర పోషిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. పాయం వెంకటేశ్వర్లుకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడంపై గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

## మిషన్ భగీరథ సిబ్బంది వివరాలివ్వండి



**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్ వద్ద మిషన్ భగీరథ పంపు హౌస్‌ను మంగళశారం ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ పంప్ సెట్ల పనితీరు నీటి పరిశుభ్రత గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల వివరాలను, వారి ఆధార్‌కార్డులను తనకు అందజేయాలని ఆదేశించారు. విధులకు ఎంతమంది హాజరవుతున్నారు. ఎవరెవరు విధి నిర్వహణ చేస్తున్నారు అనే ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలపాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం 'మిస్ట్ బస్టాండ్లు': డిప్యూటీ కమిషనర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం నగరంలో మిస్ట్ బస్టాండ్లు ఏర్పాటు చేసినట్లు ఖమ్మం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిస్ట్ బస్టాండ్లను డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత నుంచి ప్రయాణికులకు ఉపశమనం కల్పిస్తూ బస్సుల కోసం వేచి ఉండే సమయంలో చల్లదనాన్ని అందించేలా ఈ మిస్ట్ బస్టాండ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో పర్యావరణహిత నిర్మాణ శైలిలో వీటిని రూపొందించినట్లు తెలిపారు. పచ్చదనంతో పాటు మిస్ట్ స్ప్రే వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ధరణి, ఏఈ యాకూబ్ వలీ, ప్రయాణికులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు నిధులు, విధులు తక్షణమే బదిలీ

### పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశ వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు రాజ్యాంగబద్ధంగా ఇవ్వాల్సిన నిధులు, విధులు, అధికారాలు, సిబ్బందిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బదిలీ చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు వైవిబి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం కెవిఎల్‌సి క్లబ్‌లో పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ కమిటీ సమావేశాలు జాతీయ అధ్యక్షుడు వైవిబి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సుమారు 2.60 లక్షల గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు, జిల్లా పరిషత్‌లకు, మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు చట్టబద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులు, విధులు, అధికారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బదిలీ చేయాలని కోరారు. అధికార వికేంద్రీకరణ, స్థానిక స్వపరిపాలన, స్వయం పోషకత్వాలను స్థానిక సంస్థలకు బదిలీ చేయకపోవడం వల్ల పంచాయతీరాజ్ సంస్థలు నిర్వీర్యమైపోతున్నాయని తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. గ్రామీణ ప్రజలకు కావాల్సిన మౌలిక సౌకర్యాలు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్, ఉపాధి వంటివి కొరవడడంతో ప్రజలు పట్టణాలకు వలసపోతున్నారన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, జిల్లా పరిషత్ చైర్మన్, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు, చైర్మన్లకు, మేయర్లకు గౌరవ వేతనాలను పెంచాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశాయి. ఈ సమావేశంలో తెలంగాణ, ఎపి రాష్ట్రాల పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శులు బద్దెపల్లి సిద్ధార్థ, బీరు ప్రతాపరెడ్డి, తెలంగాణ ఛాంబర్ ఉపాధ్యక్షుడు శశికళ యాదవ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, పి. అశోక్‌రావు, శ్రీశైలయాదవ్, వెంకన్న యాదవ్, జెడ్‌పిటిసిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శులు నారాయణరావు, సామినేని హరిప్రసాద్, వెంకట్, శంకర్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణ నాయుడు, వై. వినోదరాజు, వానపల్లి ముత్యాలరావు, కొత్తపు మునిరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లు కొండయ్య, సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్, ఇరు రాష్ట్రాల కమిటీ సభ్యులు, జాతీయ సభ్యులు పాల్గొన్నారు.

## వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

### ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్
### పిస్తా హౌజ్‌లో తనిఖీలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు ఫుడ్ సేఫ్టీ శాఖ ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఇంచార్జి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఇ. శరత్ తెలిపారు. ఖమ్మం నగరంలోని పిస్తా హౌజ్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనంతరం తమ కుమార్తె అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఓ వినియోగదారుడు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సంబంధిత రెస్టారెంట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, వంటశాల నిర్వహణ, ఆహార భద్రత ప్రమాణాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా రెండు ఆహార పదార్థాల చట్టబద్ధ నమూనాలను సేకరించి విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్ మాట్లాడుతూ ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం వాటి ఫలితాల ఆధారంగా ఆహార భద్రత ప్రమాణాల చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఇతర ఆహార సంస్థలపై ఫుడ్ సేఫ్టీ శాఖ నిరంతర తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. ఆహార వ్యాపార నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి విక్రయించాలని నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలన్నారు. నాసిరకం లేదా కలుషితమైన, గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యం

### వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన
### కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని ప్రతి ఇంటర్మీడియట్ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఇంటర్మీడియట్ విద్యాశాఖ పనితీరు, విద్యా ఫలితాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి పనులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరపు ఫలితాల విశ్లేషణ, వచ్చే విద్యా సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న సివిల్ పనుల పురోగతిపై ప్రైవేట్ జూనియర్ కళాశాలల అనుమతులపై సమీక్షించగా మెరుగుదల పరీక్షల అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచిందని కలెక్టర్‌కు సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించని విద్యార్థులపై సమగ్ర విశ్లేషణ చేపట్టి కారణాలను గుర్తించాలని ముఖ్యంగా ఏ సబ్జెక్టుల్లో వెనకబడి ఉంటున్నారో గుర్తించి ఆ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్‌ను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు, ఇంజనీరింగ్ అధికారులు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి



ప్రజాపక్షం/ముత్తారం: ఉదయం ఎప్పటిలాగే కుటుంబ సభ్యులకు చెప్పి పొలం పనుల కోసం వెళ్లిన రైతు సాయంత్రానికి తిరిగి వస్తాడని ఎదురుచూసిన కుటుంబానికి.. ఆయన శవమై చేరడంతో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి సమీపంలో మంగళవారం జరిగిన ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ప్రమాదం జరిగిందిలా..స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా ముత్తారం మండలం ముత్తారం గ్రామానికి చెందిన రైతు మారం వెంకట్ రెడ్డి (45) మంగళవారం ఉదయం తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు.పొలంలో మోటార్ నిర్వహణ కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేయడానికి ప్రయత్నించాడు. అయితే విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిందని భావించి కిందకు దిగే సమయంలో, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కరెంట్ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వెంకట్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.దిక్కుతోచని స్థితిలో కుటుంబం వ్యవసాయమే జీవనాధారంగా కుటుంబాన్ని పోషిస్తున్న వెంకట్ రెడ్డి అకాల మరణంతో భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో మిగిలారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన వ్యక్తి ఇలా హఠాత్తుగా దూరమవడంతో బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. వెంకట్ రెడ్డి మరణంతో ముత్తారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.భద్రతా ప్రమాణాలు పాటించాలి: గ్రామస్థుల డిమాండ్రైతులు విద్యుత్ పరికరాల వద్ద పని చేసే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండేలా అధికారులు అవగాహన కల్పించాలని, వ్యవసాయ విద్యుత్ వ్యవస్థల్లో భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## అభివృద్ధి పనులకు సుడా చైర్మన్, మేయర్ శంకుస్థాపన



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్: నగరంలోని 25 వ డివిజన్ బుట్టిరాజరాం కాలనీలో సుడా నిధులు రూ 20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లు శంకుస్థాపన చేశారు.స్థానిక కార్పొరేటర్ గంట శ్రీనివాస్ ప్రతిపాదనల మేరకు సుడా నిధులతో డ్రైనేజీ పనులు చేపట్టామని సుడా ఛైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇంకా వివిధ రకాల నిధులు ద్వారా అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తామని అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంట కల్యాణి, దండి రవీందర్,శ్రీనివాస్ రెడ్డి, జగన్, రాజారాం,మొగిలి,రాసూరి శ్రీను, అగ్గడి వరుణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ప్రాయోజకత్వంలో, 'నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్' ఆధ్వర్యంలో జిల్లా నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం అభ్యర్థులకు ఉపాధి మార్గదర్శకత్వం, ప్లేస్‌మెంట్ సహాయం కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. సినిమా టెక్నాలజీ & సాఫ్ట్‌వేర్ కోర్సులు మూడు నెలల వ్యవధిలోనిర్వహించబడతాయని, ఎస్ఎస్‌సీ, అంతకంటేపై విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ కోర్సుల్లో సినిమాటోగ్రఫీ మాస్టరీ, సౌండ్ రికార్డింగ్, వీడియో ఎడిటింగ్, డిజిటల్ డిజైన్ & సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, డబ్బింగ్ & వాయిస్ ఓవర్ నైపుణ్యాల్లో శిక్షణ అందించనున్నట్లు వివరించారు. అదేవిధంగా కన్స్ట్రక్షన్ ట్రేడ్స్ కింద కన్స్ట్రక్షన్ సేఫ్టీ (6 నెలలు), కన్స్ట్రక్షన్ ఎలక్ట్రిషియన్ (90 రోజులు), సర్వేయర్ (90 రోజులు), సూపర్వైజర్ (స్ట్రక్చర్) (90 రోజులు), ఎం.ఈ.పీ. (మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్) (45 రోజులు), స్కాఫోల్డింగ్ స్కిల్ ప్రోగ్రామ్ (90 రోజులు) వంటి కోర్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కోర్సుకు నిర్దేశించిన విద్యార్హతల ప్రకారం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలకు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీట్లు పరిమితంగా ఉన్నందున అర్హులైన అభ్యర్థులు ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలు, నమోదు కోసం 99633 13318, 90002 94176 నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జోనల్ స్థాయి 'పోలీస్ డ్యూటీ మీట్' ప్రారంభం: సిపి గౌష్ ఆలం




ప్రజాపక్షం/కరీంనగర్: తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 3వ జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్–2026 జూలై 7, 8 తేదీల్లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహిస్తున్నట్లు సీపీ గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్‌లో జోన్–3 పరిధిలోని కరీంనగర్, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన మొత్తం 91 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. యూనిట్ వారీగా కరీంనగర్ నుంచి 24 మంది, సిద్ధిపేట నుంచి 19 మంది, రాజన్న సిరిసిల్ల నుంచి 21 మంది, కామారెడ్డి నుంచి 13 మంది, మెదక్ నుంచి 14 మంది హాజరవుతున్నారని తెలిపారు. ఈ డ్యూటీ మీట్ పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సమర్థవంతమైన సేవల అందింపులో మరింత నైపుణ్యం సాధించేందుకు వేదికగా నిలవనుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా శాస్త్రీయ దర్యాప్తు, యాంటీ సబోటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ పోటీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ అంశాల్లో పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని మల్టీ జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారని సీపీ తెలిపారు. బంగారు పతక విజేతలకు రూ.3 లక్షలు, మూడు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, వెండి పతక విజేతలకు రూ.2 లక్షలు, రెండు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, కాంస్య పతక విజేతలకు రూ.1 లక్ష, ఒక అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్ అందజేయబడతాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వెంకటస్వామి, ఇతర జిల్లాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందించాలి



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాల/పెగడపల్లి: అంగన్ వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం బుగ్గారం మండలం యశ్వంత్ రావు పేట గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ. 12 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్ వాడీ కేంద్రాన్ని మంత్రి అడ్లూరి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించడంతో పాటు ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. బాలింతల విషయంలో సైతం ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుందని మంత్రి వివరించారు. అంగన్వాడి సేవలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని మంత్రి పేర్కొన్నారు.అనంతరం యశ్వంతరావు పేట గ్రామానికి చెందిన షేక్ సమిత్ తమ్ముడు షేక్ సమీర్ వివాహము ఈనెల 6వ తేదిన జరుగగా మంగళవారం మంత్రి లక్ష్మణ్ కుమార్ సమీర్ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి వెంట గ్రామ సర్పంచ్ ఉరుమట్ల లక్ష్మీ బుచ్చయ్య,మాజీ జెడ్పిటీసీ బాధినేని రాజేందర్, బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**తండాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం**

నియోజకవర్గంలోని ప్రతి గిరిజన తండా, గూడెంలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బంజారాల సాంప్రదాయ సీత్ల పండుగ వేడుకల్లో భాగంగా మంగళవారం పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి, ఏడుమోటలపల్లి, రాజారాంపల్లి తండాల్లో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా తాండాలలో గిరిజనులతో కలిసి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మంత్రి అడ్లూరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు. అందులో భాగంగానే పెగడపల్లి మండలంలోని పలు తండాలను కలుపుతూ రూ.68 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. మద్దులపల్లి గ్రామంలో గిరిజన భవన నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు కేటాయించామని, భవన నిర్మాణానికి వీలుగా రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని వెంటనే కేటాయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి తండాను మోడల్ తండాగా తీర్చిదిద్దేందుకు నిధుల కొరత లేకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ నిజామొద్దీన్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి, సర్పంచులు వెల్మ బలరాం రెడ్డి, ఇస్లావత్ రమేష్ నాయక్, మేక శ్రీవాణి సుధాకర్ రెడ్డి, జీల రాకేష్, శ్రీనివాస్, మల్లారెడ్డి, సురేష్, శ్రీనివాస్, రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూములకు సర్వే, ఫెన్సింగ్ చేపట్టాలి: కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట/కొండపాక: ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడేందుకు సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి, ఫన్సింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కొండపాక, చిన్నకోడూరు, కొమురవెల్లి మండలాల్లో ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన కలెక్టర్, జిల్లాలోని అన్ని ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని సూచించారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములపై పూర్తి వివరాలు సేకరించి, అక్రమ కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు భూముల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## సింగరేణిలో రక్షణ, ఉత్పత్తి పరికరాలను సమకూర్చాలి

ఎఐటియుసి డిమాండ్



ప్రజాపక్షం/పెద్దపల్లి: సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి డిమాండ్ చేసింది.యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే సంస్థ బకాయిలు వసూలు కాక, కార్మికుల రక్షణ పరికరాల కొరత తీవ్రమైందని ఆరోపించింది. సంవత్సరం కాలంగా ఉత్పత్తి రక్షణకు సంబంధించిన పరికరాలు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, మంగళవారం ఆర్జీ వన్ ఏరియాలోని గనులు, ఓసిపి 5,వివిధ డిపార్ట్మెంట్స్ అధికారులకు ఏఐటియుసి ,ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు పాల్గొని మాట్లాడుతూ, డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు, చెమ్మసులు, డాగ్ నైల్స్, గిరిమిట్లు, టెక్నీషియన్ల టూల్స్, ట్యూబ్ లైట్లు వంటి ఉత్పత్తి సామగ్రి, బూట్లు, సాక్స్, గ్లౌజులు, హెల్మెట్లు, క్యాప్ లాంప్లు, జి.ఐ క్యానిస్టర్లు, బెల్ట్ క్యానిస్టర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, షాట్ ఫైరర్ కేబుల్ వంటి అత్యవసర భద్రతా పరికరాలు అందుబాటులో లేవని తెలిపారు. విడిభాగాలు,పని ముట్లు లేకపోవడం వల్ల ఉత్పత్తి లక్ష్యాలు సాధించడం కష్టమవుతోందని, పాతబడిన యంత్రాలతో పనిచేయడం వల్ల ఆపరేటర్లు నడుము నొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ, సేఫ్టీ ట్రైపారెట్ సమావేశాల్లో పలుమార్లు ప్రస్తావించినా ఫలితం లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధిని పట్టించుకోకుండా సంస్థను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే కార్మికులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. యాజమాన్యం తక్షణమే స్పందించి ఉత్పత్తి భద్రతా పరికరాలు సమకూర్చి, కొత్త యంత్రాలు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మాదన మహేష్,సంకె అశోక్,బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, సిద్దమల్ల రాజు,ఎం. చక్రపాణి, దొంత సాయన్న, చెప్యాల భాస్కర్,పిట్ కార్యదర్శులు మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి, బండి మల్లేష్,గొడిశెల నరేశ్,చంద తిరుపతి, పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ దొంగ అరెస్ట్

రూ.7 లక్షల విలువైన బంగారం, వాహనం స్వాధీనం



ప్రజాపక్షం/కొండపాక: వరుస చైన్ స్నాచింగ్, దొంగతనాల కేసుల్లో నిందితుడైన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఎల్లంపేటకు చెందిన కుంచం రాజు ను సిద్ధిపేట త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.7 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఒక మోటార్‌సైకిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ ఎం. రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, దుద్దెడ టోల్‌గేట్ సమీపంలో మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లిన కేసుతో పాటు ముస్తాబాద్, జనగామ ప్రాంతాల్లో జరిగిన కేసుల్లోనూ నిందితుడి ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలింది. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో అతడిని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించి సిద్ధిపేట జైలుకు తరలించింది. కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ అభినందించారు. ఇళ్లు, దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

## కరీంనగర్‌లో కదలని ఎలక్ట్రిక్ బస్సులు

వరుస ఘటనలతో నిలిపి వేసిన అధికారులు

పరిశీలిస్తున్న జెబిఎం నిపుణులు

ప్రయాణికులకు ప్రత్యామ్నాయ బస్సులను ఏర్పాటు చేసిన అధికారులు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లాలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులకు జరుగుతున్న వరుస ఘటనలతో అధికారులు ఆ బస్సులను నిలిపి వేశారు. దీంతో ఎలక్ట్రిక్ బస్సులు వరుసగా 7వ రోజు డిపోకే పరిమితమయ్యాయి. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటం, బ్యాటరీల్లో మంటలు లేస్తుండటంతో ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది. కరీంనగర్ టూ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు గత నెల 21న కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళుతుండగా అల్గునూర్ సమీపంలో బ్యాటరీలో మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. అనంతరం ఈనెల 1న కరీంనగర్ డిపోలో మరో బస్సు బ్యాటరీలో మంటలు చెలరేగి పాక్షికంగా దగ్ధమైంది. మరి కొన్ని బస్సులు పదేపదే రోడ్లపై నిలిచి పోవడం.. తరుచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో ఆర్టీసి అధికారులు ఎలక్ట్రిక్ బస్సులను నిలిపివేశారు. కరీంనగర్ టూ డిపోలోని ప్రతి ఎలక్ట్రిక్ బస్సును జేబీఎం సంస్థ నిపుణులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆన్లైన్ ద్వారా బ్యాటరీల పనితీరును పరిశీలిస్తూ, ప్రమాదాలకు అసలు కారణాలను విశ్లేషిస్తున్నారు. సాంకేతికంగా ఎలాంటి సమస్యలు లేవని వంద శాతం నిర్ధారించుకున్న తర్వాతే బస్సులను రోడ్డెక్కించాలని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో కరీంనగర్ టూ డిపోలో 104 ఎలక్ట్రిక్ బస్సులు ఉండగా.. ఇందులో ఎక్స్ ప్రెస్ 50, సూపర్ లగ్జరీలు 40, డీలక్స్‌లు 10, అదనంగా 4 బస్సులున్నాయి. జిల్లాలోని కరీంనగర్ టూ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సులు ప్రధానంగా గోదావరిఖని, మంచిర్యాల వయా లక్షెట్టిపేట, మంథని, హైదరాబాద్ రూట్లలో నడుస్తున్నాయి. ప్రస్తుతం వీటి స్థానంలో ప్రత్యామ్నాయంగా ఇతర బస్సులను సర్దుబాటు చేసి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు కరీంనగర్ టూ డిపో మేనేజర్ ఎం. శ్రీనివాస్ 'ప్రజాపక్షం' కు తెలిపారు. ఆర్టీసి అధికారులు, జేబిఎం ప్రతినిధులతో సోమవారం వర్చువల్ గా జరిగిన హైలెవల్ మీటింగ్‌లో తాజా పరిస్థితిపై చర్చించినట్లు సమాచారం. రాబోయే రెండు మూడు రోజుల్లో బస్సులు రోడ్డెక్కించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది.

## గనుల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

అర్జీ-3 ఏరియాలోని అన్ని గనుల అధికారులకు వినతిపత్రాలు



ప్రజాపక్షం/రామగిరి: అర్జీ 3 ఏరియా లో అన్ని గనులు ఓసిపి 1 ఓసిపి 2, ఎల్ పి, సిహెచ్ పికి ముఖ్యఅతిథిగా హాజరై గేటు మీటింగ్లలో సభను ఉద్దేశించి మాట్లాడిన ఏఐటీయుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి. రావు , సెంట్రల్ సెక్రెటరీ జూపాక రామచందర్ , వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి , బ్రాంచ్ సెక్రెటరీ ఎమ్మార్ఫీరెడ్డి ,అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ డిటి రావు హాజరై మాట్లాడుతూ సింగరేణిలో రాజకీయ జోక్యం వల్ల కంపెనీకి రావలసిన 52 వేల కోట్ల రూపాయలు గవర్నమెంట్ చెల్లించకపోవడంతో కంపెనీ అగోమయ పరిస్థితిలో అటు జీతాలు, ఇటు పనిముట్లు, స్పేర్ పార్ట్స్, తేప్పించకుండా కార్మికులను సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది గనుల మీద కనీస వసతులు కూడా కార్మికులకు కల్పించలేని స్థితిలో సింగరేణి యాజమాన్యం ఉంది. గనుల మీద ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సేఫ్టీ మైండ్స్ జీఎం కమిటీలలో ఒప్పుకున్న మినిట్స్‌లో వెంటనే అమలు పరచాలని కోరుతూ వినతి పత్రాలు ఇచ్చారుటెక్నీషియన్లకు సంబంధించిన పనిముట్లను వెంటనే తెప్పించాలి షావెల్స్, డోజర్స్, గ్రేడర్స్ దంపర్స్ కు సంబంధించిన స్పేర్ పార్ట్స్ వెంటనే తెప్పించాలి గనులలో రక్షణకు సంబంధించిన పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్యుమెంట్స్ వెంటనే తెప్పించాలి కార్మికులకు సంబంధించిన కనీస వసతులు వెంటనే కల్పించాలి సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ, జీఎం కమిటీలలో ఒప్పుకున్నమినిట్స్ ను వెంటనే అమలుపరచాలిఈ కార్యక్రమంలో పాల్గొన్నఅర్జీ 3 ఏరియా ఆఫీస్ బేరర్స్ అన్ని గనుల పిట్ కార్యదర్శులు, ఈ.గంగాధర్ గారు, ఎమ్.సురేష్ , జి. శ్రీనివాస్ , నాన్ ఆపరేషన్ ఫిట్ సెక్రెటరీలూ రమేష్ , పోచయ్య అసిస్టెంట్ పిట్ కార్యదర్శులు,జియం కమిటీ సభ్యులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్, సేఫ్టీ వర్క్ కమిటీ మెంబర్స్, క్యాంటీన్ టెంపుల్ కమిటీ మెంబర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి

ఎఐటియుసి యూనియన్ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజరత్నం



ప్రజాపక్షం/రామగిరి : అర్జీ 3 ఏరియాలో మంగళవారం సింగరేణి అధికారులు తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంగా వీరికి సంఘీభావం తెలిపి మాట్లాడిన ఏఐటీయుసి కేంద్ర కార్యదర్శి కందుకూరి. రాజారత్నం యాజమాన్యం కానీ రాష్ట్ర ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం శోచనయంగా భావిస్తా ఉన్నాము. ఇప్పటికైనా వారు చేస్తున్నటువంటి రిలే నిరహారదిక్షలు జయప్రదం కావాలని అదేవిధంగా వారికి రావాల్సిన పిఆర్సి ని వెంటనే అమలు చేయాలని యాజమాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉన్నాం. ఒకవేళ పిఆరిసి కనుక తొందరగా అమలు చేయకపోతే కార్మిక సంఘాలు అధికారుల సంఘం కలసి పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని దీనికి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని యాజమాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉన్నము. నిరాహారాదీక్ష శిబిరాన్ని సందర్శించిరు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ ఏఐటీయూసీ యూనియన్ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజరత్నం మాట్లాడారు.

## మహిళా పోలీసుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చొరవ

మహిళా పోలీసులకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్: ఎస్పి



ప్రజాపక్షం/జగిత్యాల: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, అధికారుల ఆరోగ్య పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబానికి, సమాజానికి, పోలీసు శాఖకు మరింత సమర్థవంతంగా సేవలందించగలరన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు అధికారులకు సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించి, వ్యాధి నివారణ లక్ష్యంగా జగిత్యాల పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా మహిళా పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, మహిళా పోలీసు సిబ్బంది కుటుంబ బాధ్యతలతో పాటు విధి నిర్వహణలోనూ విశేష సేవలందిస్తున్నారని అన్నారు. అలాంటి మహిళా సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరన్నారు. మహిళా పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈఅవగాహన, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లలో ఒకటని, అయితే సరైన సమయంలో హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధిని చాలావరకు నివారించవచ్చని తెలిపారు. మహిళలు ఆరోగ్యానికి సంబంధించిన ఎలాంటి సమస్యనైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. పోలీసు శాఖలో సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు, ఉచిత ఆరోగ్య శిబిరాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. అనంతరం అర్హులైన మహిళా పోలీసు సిబ్బందికి సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ అందజేశారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు గుడూరి హేమంత్, శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి సుధీర్ కుమార్, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ఎస్ఐలు గీత, సుప్రియ వైద్య సిబ్బంది, మహిళా పోలీసు అధికారులు, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## మామిడి సాగుపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు

ప్రజాపక్షం/రాయికల్ : గత నాలుగేళ్లుగా మామిడి దిగుబడులు తగ్గడంతో రైతులు తోటలను తొలగించే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మామిడి సాగుపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి కట్ట లత పాల్గొని మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడులు గణనీయంగా పెంచుకోవచ్చని రైతులకు సూచించారు.పంట కోత పూర్తయిన 15 రోజుల తర్వాత నుంచి జూలై నెలాఖరు వరకు కొమ్మల కత్తిరింపులు చేపట్టాలని, తోట మధ్యలో నిలబడినప్పుడు సూర్యరశ్మి 50 శాతం మేర నేలపై పడేలా చెట్లను తీర్చిదిద్దాలని తెలిపారు. కత్తులు, గొడ్డళ్లు కాకుండా రంపంతోనే కత్తిరింపులు చేయాలని, అనంతరం కత్తిరించిన భాగాలపై బోర్డో పేస్ట్ పూయాలని సూచించారు.కాండం పురుగుల నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. క్లోరోపైరిఫాస్ కలిపి కాండంపై పిచికారీ చేయాలని తెలిపారు. బిందు సేద్యం ద్వారా నీటి యాజమాన్యం చేపట్టాలని, ప్రతి చెట్టుకు ఒకటి లేదా రెండు డ్రిప్ లైన్లను చెట్టు నుంచి ఐదు అడుగుల దూరంలో ఏర్పాటు చేసి అవసరమైన మేర నీటిని అందించాలని రైతులకు సూచించారు.మామిడి తోటల సంరక్షణ, శాస్త్రీయ సాగు విధానాలు, దిగుబడుల పెంపునకు అనుసరించాల్సిన మెళకువలపై అధికారులు రైతులకు వివరించగా, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# వయనాడ్‌లో కొండచరియల బీభత్సం

**ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు, మరో ఏడుగురు గల్లంతు**







**వయనాడ్ / న్యూఢిల్లీ :** కేరళలోని వయనాడ్‌లో మరోసారి కొండచరియలు బీభత్సం సృష్టించాయి. కోజికోడ్, వయనాడ్ జిల్లాలను కలిపే సొరంగ మార్గ ప్రాజెక్టు పనులు జరుగుతున్న కల్లాడిలోని మీనాక్షి వంతెన సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. మరో ఏడుగురు గల్లంతయ్యారు. దీనిని 'మానవ తప్పిదం వల్ల జరిగిన విపత్తు'గా ఓ రాష్ట్ర మంత్రి అభివర్ణించారు. తాజాగా ప్రమాదం జరిగిన స్థలం మెప్పాడి పంచాయతీ పరిధిలోకి వస్తుంది. అయితే ఇదే ప్రాంతంలో 2024లో కూడా విషాదకరమైన కొండచరియల విపత్తు సంభవించింది. కాగా, మీనాక్షి వంతెన వద్ద పేరుకుపోయిన మట్టి కుప్ప వర్షం కారణంగా అకస్మాత్తుగా కూలిపోవడం, తద్వారా చెట్లు పడిపోవడం, నిర్మాణ స్థలంలో ఏర్పాటు చేసిన లోహపు, వస్త్రపు బారికేడ్లు కొట్టుకుపోవడం ఒక వీడియోలో కనిపించింది. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (కెఎస్‌డిఎంఎ) అధికారులతో వారి కార్యాలయంలో పరిస్థితిని ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో పేరుకుపోయిన భారీ మొత్తంలో మట్టిని తొలగించాల్సిందిగా ప్రజా పనుల శాఖ మంత్రి పి.కె. బషీర్, జిల్లా కలెక్టర్ కాంట్రాక్టర్లకు చాలా కాలం క్రితమే సూచించారని చెప్పారు. అయితే, కాంట్రాక్టర్లు ఆ ఆదేశాలను పాటించలేదు అని అన్నారు. ఇది దురదృష్టకరమైన సంఘటన అని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సరైన వాతావరణ హెచ్చరిక జారీ చేయకపోవడం వల్ల ఈ విపత్తు జరగలేదని, అధికారులు సూచించినట్లుగా మట్టి కుప్పను సకాలంలో తొలగించకపోవడం వల్లే ఇది సంభవించిందని సతీశన్ చెప్పారు. ఘటనకు ముందు ఆ ప్రాంతంలో భారీ వర్షం కురిసిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం వర్షం తీవ్రత తగ్గినప్పటికీ, సహాయక సిబ్బందికి ఇబ్బందులు కలిగిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కల్లాడి సొరంగ మార్గ ప్రాజెక్టు స్థలంలో జరిగిన ఈ ఘటన సహజంగా సంభవించిన కొండచరియల విపత్తు కాదని, తవ్వకాల ద్వారా వెలికితీసిన మట్టిని శాస్త్రీయ పద్ధతిలో కాకుండా పారవేయడం వల్ల జరిగిన 'మానవ తప్పిదపు' విపత్తు అని వ్యవసాయ శాఖ మంత్రి టి. సిద్ధిక్ అన్నారు. ఇదిలా ఉండగా, మంగళవారం వయనాడ్ భారీ వర్షాల కారణంగా భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెండ్ అలర్ట్ జారీ చేసింది. మానంతవాడి, వైతిరి ప్రాంతాలలో అత్యంత భారీ వర్షపాతం నమోదైంది. వైతిరిలో 123 మి.మీ, మానంతవాడిలో 64 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉండగా, వయనాడ్‌లోని మెప్పాడి పంచాయతీ పరిధిలో ఉన్న ముండక్కై–చూరల్మల ప్రాంతంలో 2024లో సంభవించిన ఘోరమైన కొండచరియ విపత్తులో సుమారు 250 మంది మరణించారు. ప్రాణాలతో బయటపడినవారు ఇప్పటికీ ఆ ప్రకృతి వైపరీత్యాన్ని బాధతో గుర్తుచేసుకుంటున్నారు. ఆ కొండచరియ విపత్తు కూడా జులై నెలలోనే సంభవించింది.

**వయనాడ్‌లో విపత్తు తీవ్ర విచారకరం**

కేరళలోని వయనాడ్‌లో కొండచరియల విరిగిపడే ఘటనకు సంబంధించిన వార్త తీవ్ర ఆవేదన కలిగిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. ఇంకా చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రభుత్వం సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేయాలని ఆయన కోరారు. ఈ క్లిష్ట సమయంలో సహాయం అందించాలని కాంగ్రెస్, యుడిఎఫ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'గతంలో కూడా క్లిష్ట పరిస్థితులను వయనాడ్ అద్భుతమైన ధైర్యంతో ఎదుర్కొంది. ఈ విషాద సమయంలో బాధితులైన ప్రతి కుటుంబానికి అండగా నిలబడతాము' అని అన్నారు. కొండచరియల ఘటనలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. పరిపాలనా యంత్రాంగం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూనే, సాధ్యమైనంత సహాయం అందించాలని ఆమె యుడిఎఫ్ కార్యకర్తలు, నేతలు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సమయంలో, సహాయక, రక్షణ చర్యలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలన్నారు.

## అహ్మదాబాద్ వరుస పేలుళ్ల కేసు...
# 38 మందికి మరణశిక్ష

- 11 మందికి జీవిత ఖైదు
- గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన ఉన్నత న్యాయస్థానం



**అహ్మదాబాద్ :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గతంలో జరిగిన వరుస పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఉగ్రవాద సంస్థ అయిన 'ఇండియన్ ముజాహిదీన్' (ఐఎం)కు చెందిన 38 మందికి మరణశిక్ష విధించింది. మరో 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో దోషులకు మరణశిక్ష విధించడం ఏ కోర్టు చరిత్రలోనైనా ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ దోషులలో నిషేధిత సంస్థ 'స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా' (సిమి) మాజీ నాయకుడు సఫ్దర్ నాగౌరీ, అతని అనుచరులు ఉన్నారు. వరుస పేలుళ్లలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తులు ఎ.వై. కోగ్జే, సమీర్ దవేలతో కూడిన డివిజన్ బెంచ్, దిగువ కోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లను కొట్టివేసింది. అలాగే, ఈ కేసులో ఇండియన్ ముజాహిదీన్ సభ్యులకు విధించిన శిక్షలను ఖరారు చేస్తూ ఇచ్చిన తీర్పును సమర్థించింది. 2008 జులై 26న, అహ్మదాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 70 నిమిషాల వ్యవధిలో 21 బాంబు పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 56 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు. ఇతర ప్రాంతాల నుండి పేలుడు బాధితులను చికిత్స కోసం తరలిస్తున్న సమయంలో నగరంలోని ఆసుపత్రుల వద్ద కూడా పేలుళ్లు జరిగాయి. ఇలాంటి దాడుల్లో వైద్య సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి. ఈ కేసులో 78 మందిని ప్రత్యేక కోర్టు విచారించగా, ఫిబ్రవరి 2022లో వారిలో 49 మందిని దోషులుగా నిర్ధారించింది. అహ్మదాబాద్‌లో జరిగిన 21 పేలుళ్లకు సంబంధించి నమోదైన 20 ఎఫ్ఐఆర్‌లు, సూరత్ నగరంలో (అక్కడ ఉగ్రవాదులు బాంబులు అమర్చినప్పటికీ అవి పేలలేదు) నమోదైన 15 ఎఫ్ఐఆర్‌లు తదితర మొత్తం 35 వేర్వేరు పోలీసు కేసులను విలీనం చేసి ఈ విచారణను నిర్వహించారు. ఫిబ్రవరి 2022లో ప్రత్యేక కోర్టు 38 మంది ఐఎం సభ్యులకు మరణశిక్ష, మరో 11 మందికి జీవిత ఖైదు విధించింది. దోషులుగా తేలిన వారిలో సిమి మాజీ నాయకుడు సఫ్దర్ నాగౌరీతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, కేరళ, ఉత్తరప్రదేశ్‌తో సహా 11 రాష్ట్రాలకు చెందిన అతని అనుచరులు ఉన్నారు. దిగువ కోర్టు దోషులుగా నిర్ధారించిన వారందరూ ఆ తీర్పును హైకోర్టులో సవాలు చేశారు. దోషులకు విధించిన శిక్షలను ఖరారు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ సమయంలో దోషులకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాధారాలన్నింటినీ ప్రభుత్వం హైకోర్టు ముందు ఉంచిందని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ తెలిపారు. హైకోర్టు ఈ కేసును ఏడాదిన్నరకు పైగా సమగ్రంగా విచారించిందని, ఈ ఏడాది ఫిబ్రవరి నుండి రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిపిందని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు, గాయపడిన వారికి రూ. 5 లక్షల చొప్పున పరిహారాన్ని 2027 మార్చి 30 లోపు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించిందని పటేల్ చెప్పారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో దోషులకు ఏ కోర్టు అయినా మరణశిక్ష విధించడం ఇదే మొదటిసారి. 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో, 1998 జనవరిలో తమిళనాడులోని టాడా కోర్టు మొత్తం 26 మంది దోషులకు మరణశిక్ష విధించింది.

# సిజెపి 'ఎక్స్' హ్యాండిల్‌ను పునరుద్ధరించాలి

- ఢిల్లీ హైకోర్టు ఆదేశం
- జంతర్‌మంతర్ సందర్శించిన ఎస్‌కెఎం నేతల
- సిజెపి నిరసన, సోనమ్ వాంగ్‌చుక్ నిరాహారదీక్షకు మద్దతు



**న్యూఢిల్లీ :** మే నెలలో నిలిపివేసిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) అసలైన 'ఎక్స్' హ్యాండిల్‌ను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 21న జరగాల్సిన నీట్ పునఃపరీక్ష ఇప్పటికే ముగిసిపోయినందున, నిరోధక ఉత్తర్వును ఉపసంహరించుకున్నట్లు కేంద్రం కోర్టుకు తెలియజేయడంతో జస్టిస్ స్వరనా కాంత శర్మ ఈ ఉత్తర్వును జారీ చేశారు. ఈ ఉత్తర్వుపై స్పందిస్తూ, దీప్కే దీనిని సిజెపికి, ఉద్యమానికి, భావ ప్రకటనా స్వేచ్ఛకు, డిజిటల్ హక్కులకు ఒక పెద్ద విజయంగా అభివర్ణించారు. తాము ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ యువత గొంతును వినిపిస్తూనే ఉంటామని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో, ఈ ఉత్తర్వును సాధించడంలో తమ సంస్థకు సహాయపడినందుకు సీనియర్ న్యాయవాది అఖిల్ సిబల్, న్యాయవాది బృందా గ్రోవర్, న్యాయవాది నకుల్ గాంధీలకు దీప్కే ధన్యవాదాలు తెలిపారు. మే 21న భారతదేశంలో సిజెపి అసలైన ఎక్స్ హ్యాండిల్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత, ఈ బృందం నిరోధక ఉత్తర్వుకు వ్యతిరేకంగా చట్టపరమైన పరిష్కారాలను కోరుతూనే, ఒక కొత్త ఎక్స్ హ్యాండిల్ ద్వారా తమ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించింది. ఇదిలా ఉండగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, పరీక్షలలో అవకతవకలపై ప్రభుత్వ జవాబుదారీతనం కోరుతూ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన నిరసన మంగళవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 10 రోజులు పూర్తయ్యాయి. కాగా, సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో ఎక్స్‌లో స్పందిస్తూ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించినప్పటి నుండి 6 కిలోలకుపైగా బరువు తగ్గారని, రక్తపోటు కూడా చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఎప్పుడు మేల్కొంటుంది? అని దీప్కే ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ప్రతినిధి బృందం ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు జంతర్ మంతర్ వద్ద నిరసన స్థలాన్ని సందర్శించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) రద్దు, ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, పరీక్షలలో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు వంటి నిరసనకారుల డిమాండ్లకు రైతు సంఘం తమ మద్దతును పునరుద్ఘాటించింది. ఈ ప్రతినిధి బృందంలో హన్నన్ మొల్లా, పి. కృష్ణప్రసాద్ తదితరులతో సహా పలు ఎస్‌కెఎం అనుబంధ సంస్థల నాయకులు ఉన్నారు.

# చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇకపై ట్రస్ట్ సభ్యులు కారు

**శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రకటన**



**అయోధ్య :** శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మంగళవారం కీలక ప్రకటన చేసింది. మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా ఇకపై ట్రస్ట్ సభ్యులు కారని స్పష్టం చేసింది. ఈ ప్రకటనతో వారి హోదాకు సంబంధించి నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. సోమవారం జరిగిన సమావేశంలో చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామాలను ఆమోదించిన తర్వాత వారు ట్రస్ట్ సభ్యత్వం నుండి తప్పుకున్నారు అని ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి పిటిఐకి తెలిపారు. చంపత్ రాయ్ స్థానంలో రిటైర్డ్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి కృష్ణ మోహన్‌ను శాశ్వత ప్రాతిపదికన నియమించాలా వద్దా అనే విషయంపై 22న జరగబోయే తదుపరి సమావేశంలో ట్రస్ట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి కృష్ణ మోహన్‌ను ట్రస్ట్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. అయితే భవిష్యత్తులో ఈ నియామకాన్ని శాశ్వతం చేయాలని ట్రస్ట్ నిర్ణయించవచ్చు అని గిరి పిటిఐకి చెప్పారు. ఈనెల 22న జరిగే సమావేశంలో కృష్ణ మోహన్ నియామకం, ఖాళీగా ఉన్న పదవులకు తగిన వారిని ఎంపిక చేయడంపై ట్రస్ట్ సభ్యులు చర్చించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా కేవలం తమ పదవుల నుండి మాత్రమే తప్పుకున్నారని, ట్రస్టీలుగా కొనసాగుతున్నారని వస్తున్న వాదనలను తోసిపుచ్చుతూ, సోమవారం జరిగిన సమావేశంలో రాజీనామాలు ఆమోదించబడిన వెంటనే వారు ట్రస్ట్ సభ్యత్వం నుండి వైదొలిగారని ఆయన స్పష్టం చేశారు. రాయ్, మిశ్రాల రాజీనామాల నేపథ్యంలో, ట్రస్ట్ ప్రత్యేక ఆహ్వానితుల జాబితా నుండి గోపాల్ నాగ (గోపాల్ రావు అని కూడా పిలుస్తారు)ను తొలగించాలని నిర్ణయించినట్లు కూడా గిరి పిటిఐకి ధృవీకరించారు.

చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల రాజీనామాకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, సీనియర్ ట్రస్టీ కె. పరాశరన్ సూచించినట్లుగా ట్రస్ట్ రాజ్యాంగం ప్రకారం రాజీనామా సమర్పించిన వెంటనే అమల్లోకి వస్తుందని, కాబట్టి దానిని ఆమోదించడం తప్ప ట్రస్ట్‌కు వేరే మార్గం లేదని గిరి వివరించారు. దీనివల్ల ఈ విషయంలో ట్రస్ట్‌కు ఎటువంటి విచక్షణాధికారం లేదని ఆయన పేర్కొన్నారు. ట్రస్ట్ నిర్ణయానికి సాధువుల సమాజం కట్టుబడి ఉందని, ట్రస్ట్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని స్వాగతిస్తామని జగద్గురు పరమహంస ఆచార్య పిటిఐకి తెలిపారు. ఆధారాలు లేకుండా చేసిన ఆరోపణలను ఆయన విమర్శించారు. అలాగే రామమందిర అంశంపై ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

## రామమందిర విరాళాల చోరీ కేసులో...
# దోషులను కాపాడే యత్నం

- బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌పై మండిపడ్డ కాంగ్రెస్
- విరాళాలకు సంబంధించి పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామ మందిర విరాళాల చోరీ వ్యవహారంలో అసలు దోషులను కాపాడేందుకు బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు యత్నిస్తున్నాయని పేర్కొంది. అలాగే, విరాళాలకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని, ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ తన మౌనాన్ని వీడాలని డిమాండ్ చేసింది. అయోధ్యలోని శ్రీరామ మందిరంలో విరాళాల చోరీ వ్యవహారం దేశంలోని కోట్లాది మంది ప్రజల నమ్మకానికి జరిగిన తీవ్రమైన ద్రోహం అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'కేవలం రాజీనామాలు, పరిమిత చర్యల ద్వారా ఈ మొత్తం వ్యవహారాన్ని కప్పిపుచ్చి, అసలు దోషులను, పెద్ద వ్యక్తులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని దేశ ప్రజలు భావిస్తున్నారు' అని రమేష్ ఎక్స్ వేదికగా హిందీలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ డిమాండ్లను పునరుద్ఘాటిస్తూ, 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్'ను వెంటనే రద్దు చేయాలని, శంకరాచార్యులు, ధర్మాచార్యులు, సాధువులు, మతపరమైన ప్రతినిధులతో కూడిన కొత్త ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన సిట్‌పై ప్రజలకు నమ్మకం లేదని, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తు స్వతంత్రంగా జరగాలన్నారు. రామమందిరానికి అందిన నగదు, వస్తు రూపేణా వచ్చిన విరాళాల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కూడా రమేష్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధాని మోదీ తన మౌనాన్ని వీడాలని ఆయన అన్నారు. అంతకుముందు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ఆలయ నిర్వహణను అనధికారిక పద్ధతిలో తమ గుప్పిట్లోకి తీసుకున్నాయని ఆరోపించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన గెహ్లాట్, ట్రస్ట్‌ను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని, పారదర్శకత కోసం ప్రజలు ఇచ్చిన విరాళాల వివరాలను బహిర్గతం చేయాలన్న పార్టీ డిమాండ్లను పునరుద్ఘాటించారు. బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ దశాబ్దాల పాటు రామమందిర ఉద్యమాన్ని నడిపాయని, ఆ ఉద్యమం వల్లే వారు అధికారంలోకి రాగలిగారని గెహ్లాట్ పేర్కొన్నారు.

## కరూర్ తొక్కిసలాట కేసు....
# తమిళనాడు సిఎం పర్యటనలను కోర్టు నియంత్రించలేదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- డిఎంకె పిటిషన్ స్వీకరణకు నిరాకరణ



**న్యూఢిల్లీ:** కరూర్ తొక్కిసలాట కేసులో ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నిందితుడు కాదని, ఆయన పర్యటనలను కోర్టు నియంత్రించలేదని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆయన పర్యటనను ప్రశ్నిస్తూ, ఈ విషయంలో మంత్రులు సాక్షులను ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తూ 'ద్రవిడ మున్నేట్ర కజగం' (డిఎంకె) దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా మందలించింది. న్యాయమూర్తులు జస్టిస్ కె.వి.విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ఒక పాక్షిక కార్యదిన ధర్మాసనం డిఎంకె పిటిషన్‌ను స్వీకరించడానికి నిరాకరించి, కార్యనిర్వాహక అధిపతి పర్యటనను కోర్టు ఎలా నియంత్రించగలదని ప్రశ్నించింది. తొక్కిలాట బాధితుల కుటుంబాలను జులై 10న ముఖ్యమంత్రి కలువనున్నారు. 'ఈ కేసులలో నమోదైన ఎఫ్ఐఆర్‌లలో ముఖ్యమంత్రి నిందితుడు కాదు. ఈ రోజు ఈ కోర్టును రాజకీయ వేదికగా మార్చడం ఎలా సాధ్యం?' అని డిఎంకె కార్యదర్శి ఆర్.ఎస్.భారతి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్‌ను జస్టిస్ విశ్వనాథన్ ప్రశ్నించారు. గతేడాది సుప్రీంకోర్టు దర్యాప్తును సిబిఐకి బదిలీ చేసిన తీర్పును ఉల్లంఘిస్తూ, తొక్కిసలాట కేసుకు సంబంధించి టివికె మంత్రులు ఒక కథనాన్ని సృష్టించేలా బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని రంజిత్‌కుమార్ వాదించారు. ఈ సందర్భంగా జస్టిస్ కె.వి.విశ్వనాథన్ స్పందిస్తూ 'ముఖ్యమంత్రి పర్యటనను సుప్రీంకోర్టు నియంత్రించి, ఆయన పర్యటన ప్రణాళికను ఖరారు చేయాలని మీరు కోరుకుంటున్నారా? ఇది ఎలా సాధ్యం అవుతుంది' అని ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించి తమిళనాడు మంత్రి ఆదవ్ అర్జున చేసిన కొన్ని వ్యాఖ్యలపైనా, గత ఏడాది సుప్రీంకోర్టు విధించిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందుకు, ఆయనపైన డిఎంకె ధిక్కార పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉందని రంజిత్‌కుమార్ తెలిపారు. ఈ కేసు యోగ్యతల గురించి ముఖ్యమంత్రి, ఇతర రాష్ట్ర మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలను నియంత్రించడానికి పార్టీ ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు. అప్పుడు న్యాయమూర్తి విశ్వనాథన్ న్యాయవాది రంజిత్‌కుమార్‌ను ఉద్దేశించి 'అంటే మీరు భావ ప్రకటనా స్వేచ్ఛపై నిషేధాజ్ఞ విధించాలని కోరుకుంటున్నారా? మీరు మీ ప్రసంగంతో వారి ప్రసంగాన్ని ఎదుర్కొంటున్నారు. సుప్రీంకోర్టు సిబిఐకి బదిలీ చేసిన కేసులో రాజకీయ ప్రత్యర్థి తమను తాము ఎలా ప్రతివాదిగా చేర్చుకోగలరు ?' అని ప్రశ్నించారు. కుమార్ ఈ విషయమై స్పందిస్తూ 'లేదు, నేను అలా కాదు. నా ప్రార్థన ఏమిటంటే, సిబిఐ దర్యాప్తు పూర్తి అయ్యేవరకూ, నిష్పక్షపాతమైన, స్వతంత్ర దర్యాప్తునకు ఆటంకం కలిగించే విధంగా, నేర బాధ్యతను తొలగించే బహిరంగ ప్రకటనలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులతో మాట్లాడటం, లేదా పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు యోగ్యతపై మాట్లాడటం వంటివి ఏవీ ఉండకూడదు. భావ ప్రకటనా స్వేచ్ఛను మరింత బాధ్యతగా ఉపయోగించాలని పార్టీ కోరుకుంటోంది' అని న్యాయవాది రంజిత్‌కుమార్ చెప్పారు. అప్పటికే ప్రకటించిన రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో పరిహారం పంపిణీ, తొక్కిసలాట బాధితుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాకాల ఉత్తర్వులు ఈ కేసు దర్యాప్తును ఎలా ప్రభావితం చేస్తాయని జస్టిస్ విశ్వనాథన్ న్యాయవాది రంజిత్‌కుమార్‌ను ప్రశ్నించారు. డిఎంకె తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుని, చట్టప్రకారం మరేదైనా ఇతర మార్గాన్ని పొందవచ్చని లేనిపక్షంలో ఆ పిటిషన్‌ను కొట్టివేస్తామని కోర్టు రంజిత్‌కుమార్‌కు తెలిపింది. సిబిఐ విచారణ పెండింగ్‌లో ఉన్నంతకాలం ఈ కేసుపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, మంత్రి ఆదవ్ అర్జున, ఇతర నిందితులు బహిరంగ ప్రకటనలు చేయకుండా నిరోధించాలని, బాధితుల కుటుంబాలతో వారి సంభాషణలను నియంత్రించాలని కోరుతూ డిఎంకె కార్యదర్శి పిటిషన్ దాఖలు చేసారు. మృతులు, గాయపడిన బాధితుల కుటంబాలకు ప్రభుత్వ ఉత్తర్వులు, కారుణ్య నియామకాలు, ఇతర ప్రయోజనాలను పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి కరూర్ పర్యటనకు రానున్నారనే వార్తలను ఆ పిటిషన్‌లో ప్రస్తావించారు.

## టిఎంసి బ్యాంక్ ఖాతాల నిధుల కేసులో...
# 5 ప్రాంగణాలలో 'ఇడి' సోదాలు

- 3 బ్యాంక్ ఖాతాలు స్వాధీనం
- పార్టీ అకౌంట్లలో దాదాపు రూ.440 కోట్లు ఉన్నట్లు అంచనా

**కోల్‌కతా/న్యూఢిల్లీ :** తృణమూల్ కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాల్లోకి అనుమానాస్పద నిధులు మళ్లించిన వ్యవహారానికి సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మంగళవారం కోల్‌కతాలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ విషయాన్ని అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్ రాజధాని నగరంలోని సుమారు 5 ప్రాంతాలలో ఈ సోదాలు జరుగుతున్నాయని వారు చెప్పారు. విమానయాన, ప్రయాణ సంస్థల ద్వారా రూ.150 కోట్లకు పైగా నిధులు మళ్లించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. కోల్‌కతాకు చెందిన ప్రైవేట్ చార్టర్ విమానాల అద్దె 'కేర్‌వెల్ ఏవియేషన్' ప్రాంగణంలో, దాని డైరెక్టర్లు, ఒక ఎన్నికల ట్రస్ట్‌గా భావిస్తున్న సంస్థ ప్రాంగణాలలో సోదాలు జరుగుతున్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు చెప్పారు. అయితే 'పిటిఐ' కు కంపెనీ నుంచి ఇంకా సమాధానం రావాల్సి ఉంది. గత నెలలో కోల్‌కతా పోలీసులు డెబిట్ కార్యకలాపాలను స్థంభింపజేశారు. ప్రతిపక్షపార్టీ ఆర్థిక నియంత్రణపై తీవ్రమైన అంతర్గత కలహాలు కొనసాగుతున్నప్పటికీ నిధుల మూలంపై విచారణ కోరుతూ రెబల్ పార్టీ ఎమ్మెల్యేలు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో పార్టీకి చెందిన మూడు బ్యాంక్ ఖాతాలను స్వాధీనం చేసుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలలో దాదాపు రూ.440 కోట్లు ఉన్నట్లు అంచనా.

# 8వ తరగతి సోషల్ సైన్స్‌లో మార్పులు

**సుప్రీంకోర్టు ఆదేశాలతో దిగొచ్చిన ఎన్‌సిఇఆర్‌టి**




**న్యూఢిల్లీ :** న్యాయవ్యవస్థపై వివాదానికి దారితీసిన 8వ తరగతి సోషల్ సైన్స్ పాఠ్యపుస్తకాన్ని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) పూర్తిగా సవరించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వివాదాస్పద అంశాల్ని తొలగించి కొత్త అధ్యాయాన్ని విడుదల చేసింది. న్యాయ వ్యవస్థలో అవినీతి, కోర్టుల్లో భారీగా కేసుల పెండింగ్, కీలక తీర్పులకు సంబంధించిన అంశాల్ని తొలగించగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్), ట్రైబ్యునల్స్, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలపై కొత్త సమాచారాన్ని చేర్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో తీవ్ర వివాదం చెలరేగింది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపైనే సుప్రీంకోర్టు సుమోటాగా విచారణ చేపట్టింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తయిన, అలాగే డిజిటల్ కాపీలు అన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో ఎన్‌సిఇఆర్‌టి కూడా క్షమాపణలు చెప్పింది. కాగా, తాజాగా సవరించిన పాఠ్య పుస్తకంలో పలు కీలక మార్పులు చేశారు. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి 'న్యాయబద్ధమైన, సామరస్యపూరకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చారు. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించారు. ఇందులో కోర్టుల్లో కేసుల భారీ పెండింగ్‌కు న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని పేర్కొన్నారు. గతంలో విడుదలైన పుస్తక రూపకల్పన బృందంలో మొత్తం 51 మంది సభ్యులు ఉండగా, తాజా సవరించిన ఎడిషన్‌లో 48 మంది మాత్రమే ఉన్నారు. వివాదాస్పద అధ్యాయానికి బాధ్యత వహించినట్లు భావించిన మిషెల్ డానినో, సుపర్ణా దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్ పేర్లను జాబితా నుంచి ఎన్‌సిఇఆర్‌టి తొలగించింది. ఈ మార్పులతో 8 వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని న్యాయ వ్యవస్థ అధ్యాయాన్ని పూర్తిగా కొత్త రూపంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చింది.


IN THE COURT OF THE
HON'BLE 1st ADDL JUNIOR
CIVIL JUDGE AT BHUPALPALLY
OS. NO. 292 of 2024

Between:
1. Pillamari Ramesh
2. Pillamari Venkatswamy
... Petitioners / Plaintiffs
Vs
1) The state of Telangana Rep By District collector
2) Whom so ever it may concern
... Respondents / defendants

NOTICE

Where as the above named plaintiffs have filed a suit for declaration, declare the plaintiffs are legal heirs of the Deemed dead person i.e. Pillamari Nagamallu the said case is posted on 22.07.2026 for your appearance at 10.30 AM before the said court.

Therefore you are here by directed to appear before the said court along with documents to claim your defence if any otherwise the matter will be decided ex parte against you.

" By order of the court "

Sd/- CHEERLA ASHOK REDDY
B.tech, LLB
ADVOCATE
9849109050

# అమెరికా ఓటమి...క్వార్టర్స్‌లోకి బెల్జియం

ఫిఫా వరల్డ్ కప్‌లో ఆతిథ్య జట్ల పోరు ముగిసింది. టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న అమెరికా .. రౌండ్16 మ్యాచ్‌లో ఓటమి పాలైంది. బెల్జియం 4–1 గోల్స్ తేడాతో అమెరికాను ఓడించి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. బెల్జియం ప్లేయర్ చార్లెస్ డి కెటిలేర్ రెండు గోల్స్ చేశాడు. ఈ మ్యాచ్‌లో అమెరికా డిఫెన్స్ బలహీనత బయటపడింది. బెల్జియం దూకుడును ఏమాత్రం అమెరికా డిఫెండర్లు అడ్డుకోలేకపోయారు. అమెరికా ఫార్వర్డ్ ప్లేయర్ ఫోలారిన్ బలోగన్ ఈ మ్యాచ్లో ఆడాడు. ట్రంప్ జోక్యంతో అతనిపై ఓ మ్యాచ్ సస్పెన్షన్‌ను ఫిఫా రద్దు చేసిన విషయం తెలిసిందే. వివాదాస్పద రీతిలో బలోగన్ను ఆడించారు. అయినా కానీ అమెరికాకు ఆ అంశం కలిసిరాలేదు. బెల్జియం తరపున డీ కెలిటేరి 9, 33 నిమిషాల్లో, వానకేన్ 57వ నిమిషంలో, లుకాకు 93వ నిమిషంలో గోల్ చేశాడు. ఇక అమెరికా తరపున టిల్మాన్ 31వ నిమిషంలో గోల్ చేశాడు. బెల్జియంతో మ్యాచ్‌లో మరీ పేలవంగా అమెరికా ఆడినట్లు ఫుట్‌బాల్ నిపుణులు చెబుతున్నారు. ఇక ఈ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చిన మెక్సికో, కెనడా, అమెరికా దేశాలు ఈ టోర్నీ నుంచి ఔటయ్యాయి.



## పోర్చుగల్‌పై స్పెయిన్ విక్టరీ

ఫిఫా వరల్డ్‌కప్‌నుంచి పోర్చుగల్ ఔటైంది. స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో 1–0 గోల్స్ తేడాతో పోర్చుగల్ ఓడిపోయింది. స్టాపేజ్ టైంలో స్పెయిన్ ప్లేయర్ మైఖేల్ మెరినో 91వ నిమిషంలో గోల్ చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. ఫెర్రన్ టోరస్ నుంచి పాస్ అందుకున్న మెరినో.. పోర్చుగల్ గోల్‌కీపర్ డియోగో కోస్టాను బీట్ చేసి గోల్ చేశాడు. తమ జట్టు విజయానికి పోర్చుగల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రోనాల్డో చేసిన పోరాటం ఫలించలేదు. దీంతో ప్రపంచకప్‌లో రోనాల్డో కెరీర్ ముగిసిపోయింది. ఇదే తనకు చివరి వరల్డ్ కప్ అని రోనాల్డో ప్రకటించిన విషయం తెలిసిందే. శుక్రవారం కాలిఫోర్నియాలో జరిగే క్వార్టర్స్లో ఆ జట్టు బెల్జియంతో తలపడనున్నది.

# శాంసన్‌పై వేటుకు ఆ చిచ్చరపిడుగే కారణం..!

స్వదేశంలో టి–20 ప్రపంచకప్‌లో భారత్‌ను గెలిపించిన సంజూ శాంసన్ అనూహ్యంగా ఇప్పుడు స్క్వాడ్లో లేడు. మూడు మ్యాచుల్లో విఫలమయ్యాడని అతడిని జింబాబ్వే పర్యటనకు తప్పించారు. అయితే.. యువసంచలనం వైభవ్ సూర్యవంశీ కోసమే శాంసన్‌ను పక్కనపెట్టేశారనే ప్రచారం జరుగుతోంది. కానీ, ఆసియా క్రీడల స్క్వాడ్లో భాగమైన సంజూను జింబాబ్వే సిరీస్‌కు తీసుకోకపోవడానికి కారణం వైభవ్ కాదని, ఐపిఎల్లో దంచేస్తున్న చిచ్చరపిడుగు అని సెలెక్టర్లు చెప్పినట్టు క్రిక్‌ఇన్ఫో కథనం పేర్కొంది. ఐర్లాండ్ చేతిలో వైట్వాష్, ఇంగ్లండ్ చేతిలో పరాజయంతో భారత సెలెక్టర్లు టీ20 స్క్వాడ్లో భారీ మార్పులు చేశారు. జింబాబ్వే పర్యటనకు పలువురిని పక్కన పెట్టి.. ఐపిఎల్లో, దేశవాళీ క్రికెట్లో రాణించిన వాళ్లను ఎంపిక చేశారు. ఓపెనర్గా విఫలమవుతున్న సంజూ శాంస్న వేటు వేశారు. దాంతో, వైభవ్ సూర్యవంశీ కోసమే సంజూను తప్పించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అయితే.. అందరూ అనుకుంటున్నట్టు వైభవ్ కోసం సంజూను పక్కన పెట్టలేదని.. టీ20ల్లో చితక్కొడుతున్న ప్రభ్సిమ్రన్ సింగ్ కు అవకాశం ఇవ్వాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సెలెక్టర్లు చెప్పారని క్రిక్‌ఇన్ఫో కథనం వెల్లడించింది. 'సొంతగడ్డపై జరిగిన పొట్టి వరల్డ్ కప్‌లో విధ్వంసక ఇన్నింగ్స్లు ఆడిన సంజూ శాంసన్ టీ20 స్క్వాడ్లో భాగమే. సెప్టెంబర్లో జపాన్ వేదికగా మొదలయ్యే ఆసియా క్రీడల స్క్వాడ్లోనూ శాంసన్ ఉన్నాడు. అయితే.. జింబాబ్వే పర్యటనకు పెద్దగా ప్రాధాన్యం లేనందునే అతడిని ఎంపిక చేయలేదు. చిన్న సిరీస్కు ఇద్దరు సీనియర్ వికెట్ల కీపర్లు ఇషాన్ కిషన్, సంజూలను ఎంపిక చేయడం సరైంది కాదనిపించింది. ఐపిఎల్లో పంజాబ్ కింగ్స్ తరపున గత రెండు సీజన్లలో ప్రభ్సిమ్రన్ సింగ్ మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. అందుకని వికెట్ కీపర్, బ్యాటరైన అతడికి అవకాశం ఇవ్వాలనుకున్నాం' అని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్ల బృందం పేర్కొన్నట్టు క్రిక్‌ఇన్ఫో తెలిపింది. జింబాబ్వే సిరీస్ కోసం సోమవారం శ్రేయాస్ అయ్యర్ సారథిగా 15 మందితో కూడిన స్క్వాడ్ను ప్రకటించిన విషయం తెలిసిందే.



**కుర్రాళ్లకు తొలి అవకాశం...** జింబాబ్వేతో టీ20 సిరీస్ కోసం భారత సెలెక్టర్లు స్క్వాడ్లో కీలక మార్పులు చేశారు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన వారిలో సగం మందిని తప్పించి కొత్త వాళ్లకు ప్రాధాన్యమిచ్చారు. ఐర్లాం తేలిపోయిన ఓపెనర్ సంజూ శాంస్న వేటు పడగా.. ఓపెనర్గా వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కింది. అలానే వికెట్ కీపర్గా ప్రభ్సిమ్రన్ సింగ్ ఎంపికవ్వగా.. మిడిలార్డర్ బ్యాటర్గా సూర్యాన్ష్ షెడ్గే, ఫినిషర్గా రింకూ సింగ్ను తీసుకున్నారు. ఐపిఎల్ 19వ సీజన్లో మెరిసిన ప్రిన్స్ యాదవ్, అశోక్ శర్మ, హర్ష్ దూబే, మయాంక్ యాదవ్లో బౌలింగ్ దళంలో చోటు దక్కించుకున్నారు. భారత్, జింబాబ్వే మధ్య జూలై 23 నుంచి హరారేలో టీ20 సిరీస్ మొదలవ్వనుంది. ఈ సిరీస్తో ప్రభ్సిమ్రన్ అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేయనున్నాడు.

## మహిళ

# పర్యావరణ పరిరక్షణలో మహిళల కీలక పాత్ర

పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కోవడంలో మహిళలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి (యుఎన్) అంచనాల ప్రకారం, ప్రపంచ వ్యవసాయ కార్మిక శక్తిలో సుమారు 43 శాతం మంది మహిళలే. వ్యవసాయం, నీటి నిర్వహణ, ఆహార ఉత్పత్తి, కుటుంబ పోషణ వంటి అనేక రంగాల్లో మహిళల భాగస్వామ్యం సమాజ స్థిరమైన అభివృద్ధికి పునాదిగా నిలుస్తోంది. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో వాతావరణ మార్పులు ఒకటి. అనిశ్చిత వర్షాలు, కరువులు, వరదలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మహిళలు వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను స్వీకరించడంలో ముందుంటున్నారు. తక్కువ నీటితో పెరిగే



పంటలను సాగు చేయడం, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, స్థానిక విత్తనాలను సంరక్షించడం, మిశ్రమ పంటల సాగు వంటి పద్ధతులను అనుసరిస్తున్నారు. ఇవి పంటల ఉత్పాదకతను కాపాడటమే కాకుండా ప్రకృతి సమతుల్యతను కూడా రక్షిస్తాయి. మహిళలు కుటుంబంలో మొదటి ఉపాధ్యాయులు అనడంలో సందేహం లేదు. పిల్లలకు ప్రకృతి పట్ల బాధ్యత, నీటి పొదుపు, పరిశుభ్రత, చెట్ల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడంలో వారు ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. ఈ విధంగా మహిళలు కేవలం తమ కుటుంబాలను మాత్రమే కాకుండా మొత్తం సమాజాన్ని పర్యావరణ అనుకూల జీవన విధానాల వైపు నడిపించగలరు. స్వయం సహాయక సంఘాలు, మహిళా రైతు సంఘాలు మరియు గ్రామీణ అభివృద్ధి సంస్థల ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో మహిళలు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

## యుద్ధానికి ఎదురునిలిచిన 'నూర్'

అది 1944 సెప్టెంబర్ 13 ఉదయం.... మబ్బులతో కమ్ముకున్న వాతావరణం... డాచావ్ కాన్సంట్రేషన్ శిబిరం... ఒక యువతి తన మరణాన్ని అసాధారణ ధైర్యంతో ఎదుర్కొంది. చివరి క్షణంలో, రక్తంతో తడిసిన పెదవుల నుండి ఆమె పలికిన ఒకే పదం 'లిబర్టీ' (స్వేచ్ఛ). ఆ యువతి పేరు నూర్ ఇనాయత్ ఖాన్. భారతీయ మూలాలున్న కుటుంబంలో జన్మించిన ఆమె, టిప్పు సుల్తాన్ వంశానికి చెందినది. సూఫీ సాంప్రదాయంలో పెరిగిన నూర్ చిన్ననాటి నుంచి శాంతి, సంగీతం, ఆధ్యాత్మికతతో మమేకమైంది. ఫ్రాన్స్‌లో పెరిగి, రచన, సంగీతం వంటి కళలపై ఆసక్తి పెంచుకుంది. కానీ యుద్ధం ఆమెజీవితాన్ని పూర్తిగా మార్చింది. 1940లో నాజీలు ఫ్రాన్స్‌ను ఆక్రమించడంతో, ఆమె కుటుంబంతో కలిసి బ్రిటన్‌కు వెళ్లింది. అక్కడే ఆమె 'యుద్ధాన్ని తప్పించుకోవడం కాదు, దానికి ఎదురు నిలవడం అవసరం' అనే కీలక నిర్ణయం తీసుకుంది. ఈ లక్ష్యంతో 'స్పెషల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్' (ఎస్ఒఇ) అనే రహస్య విభాగంలో నూర్ చేరింది. శత్రు ప్రాంతాల్లో పని చేయడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఆమె, వైర్లెస్ రేడియో ఆపరేటర్‌గా అత్యంత ప్రమాదకరమైన బాధ్యతను చేపట్టింది. పారిస్‌లో పనిచేస్తూ, ఆమె బ్రిటన్‌కు కీలక సమాచారాన్ని రహస్యంగా పంపేది. జెస్టాపో అనే నాజీ రహస్య పోలీసుల కళ్ల ముందు పనిచేయడం ఎంత ప్రమాదకరమో తెలిసినా, నూర్ వెనుకడుగు వేయలేదు. సహచరులు పట్టుబడిన తర్వాత, ఆమెకు తప్పించుకునే అవకాశాలు వచ్చాయి. కానీ, నూర్ తన బాధ్యతను వదిలిపెట్టలేదు. అది ఆమెకు కేవలం పని కాదు... ఒక నైతిక బాధ్యత. చివరకు, ఒక ద్రోహం కారణంగా



జెస్టాపోకు దొరికిపోయింది. అధికారులు నెలల తరబడి ఆమెను ఒంటరిగా నిర్బంధించి, తీవ్రమైన మానసిక, శారీరక హింసకు గురిచేశారు. అయినప్పటికీ, ఆమె ఎలాంటి రహస్య సమాచారాన్ని బయటపెట్టలేదు. రెండుసార్లు తప్పించుకోవడానికి ప్రయత్నించినా విఫలమైంది. అయినా, తన సహచరుల పేర్లు చెప్పలేదు. ఆమె స్థిరత్వం, ధైర్యం చూసిన శత్రువులు ఆమెను అత్యంత ప్రమాదకారిగా ముద్ర వేసి, డాచావ్ శిబిరానికి తరలించారు. అక్కడే హతమార్చారు. ఆమె చూపిన అసామాన్య సాహసం యావత్ మహిళా లోకానికే ఆద ర్శం. మరణానంతరం ఆమెకు 'జార్జి క్రాస్', 'క్రోయిక్స్ డి గారె' వంటి అత్యుత్తమ అవార్డులు లభించాయి. నూర్ ను కేవలం ఒక గూఢచారిణిగా చూడడానికి వీల్లేదు. ఎందుకంటే ఆమె స్వేచ్ఛ కోసం ప్రాణాలు అర్పించిన మౌన యోధురాలు. చరిత్రలో తన పేరును చిరస్థాయిగా లిఖించుకున్న వీరనారి.




# 'అయోధ్య' కానుకల చోరీపై సిబిఐ విచారణ

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్

**ప్రజాపక్షం/తొర్రూరు :** అయోధ్య రామ మందిరం కానుకల చోరీపై వెంటనే సిబిఐ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రామమందిరం కానుకల చోరీపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అయోధ్య రామ మందిరంలో పెద్దఎత్తున రామ భక్తుల కానుకల చోరీ జరుగుతున్నా కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కుంభకోణం బయటపడినా నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తుందన్నారు. కానుకల చోరీకి బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భక్తి ముసుగులో బిజెపి నాయకుల గుడి దోపిడీ చూస్తే భక్తుల గుండె తరుక్కుపోతుందన్నారు. బిజెపి పాలనలో గుడిలో ఉన్న దేవుడి కానుకల కూడా రక్షణ లేదన్నారు. హిందుత్వం పేరుతో రాజకీయం చేస్తున్న బిజెపి చేతిలో దేవాలయాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, ఆలయాల పవిత్రతకు భంగం కలుగుతుందన్నారు. కానుకల చోరీ ఘటనపై బిజెపి తీరుతో భక్తుల గుండెల్లో ఆగ్రహం వ్యక్తమవుతుందన్నారు. దేవాలయాల సంపదను దోచుకుంటున్న బిజెపితో హిందూ ధర్మానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. గుడిలో దోపిడీతో పవిత్రతకు భంగం కలిగిందన్నారు. రామమందిరం విషయంలో బిజెపి తీరుతో భక్తుల విశ్వాసం దెబ్బతిన్నదన్నారు. దేవుడి ఆస్తి దేవుడికే చెందాలని, బిజెపి దోపిడీని సహించరాదని, బిజెపి నాయకులు చేసిన ఆలయ దోపిడీని ఖండిస్తున్నామని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, బి.అజయ్ సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, ఓమ బిక్షపతి, బందు మహేందర్, కిరణ్, లక్ష్మ ణ్, పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింత కుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగాచారి, వరిపెల్లి వెంకన్న, నెల్లూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







# భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమస్య డిమాండ్ చేశారు. మంగళవారం బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా జనరల్ బాడీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు గందె కొమురయ్య అధ్యక్షతన బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో జరిగింది. సమావేశానికి హాజరై సమ్మయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో జరిగే ఎఐటియుసిరాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని కార్మికలోకానికి పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రధానంగా సంక్షేమ బోర్డులో అవినీతి అక్రమాలను అరికట్టి బోర్డులో సభ్యులుగా కార్మిక నాయకులను చేర్చుకోవాలని, ల్యాబ్స్ అయినా కార్డులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను పరిష్కరించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికుడికి రూ,5వేలు పెన్షన్ ఇవ్వాలని, సహజ మరణానికి రెండు నుండి ఐదు లక్షల రూపాయల పెంచాలని ఆయన కోరారు. మెటర్నటీ, మ్యారేజ్ గిఫ్టును లక్ష రూపాయలకు పెంచాలన్నారు. పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ కూలీ రేట్లు పెంచుతామని కొన్ని ప్రైవేట్ సంఘాల నాయకులు వ్యక్తిగత లబ్ధి కోసం కార్మికులను తప్పుదోవ పట్టించేందుకు ఈనెల తొమ్మిదో తేదీన కరీంనగర్ నగరం పనుల బంద్‌కు పిలుపునిచ్చాయని, ఆ బంద్‌కు ఎఐటియుసికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈనెల 12న జరిగే ఎఐటియుసి జిల్లా మహాసభకు అధిక సంఖ్యలో భవన కార్మికులు హాజరు కావాలని పిట్టల సమ్మయ్య కోరారు. సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్ కన్స్ట్రక్షన్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సభ్యులు రేగుల కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కన్నం సదానందం, నగర కార్యదర్శి కసిభోసుల సంతోషచారి, గోదారి లక్ష్మణ్, బోయిని రాజయ్య, సుదర్శన్, అందే జంపయ్య రాజయ్య, అశోక్,సంపత్, కొమురయ్య, నాగుల శివకుమార్ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల నిధులు సకాలంలో అందక కార్మికుల ఇబ్బందులు

### ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్

**ప్రజాపక్షం/ములుగు :** సంక్షేమ పథకాల నిధులు సకాలంలో అందక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పేర్కొన్నారు. ఈ నెల 20న ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో పోలం కొండయ్య అధ్యక్షతన జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సన్నాహక సమావేశంలో జంపాల రవీందర్ మాట్లాడారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు కొంత మేర ఆర్థిక భరోసా లభిస్తున్నప్పటికీ, ప్రస్తుతం ప్రయివేట్ సంస్థ ద్వారా నిర్వహణ జరుగుతుండడంతో లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంక్షేమ పథకాల నిధులు సకాలంలో అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలం కొండయ్య, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేందర్, అధ్యక్షుడు బండి నరసయ్య, సభ్యులు మాతంగి శ్యాంసుందర్, సామల దేవేందర్, తిరుపతి, సమ్మయ్య, ఇంజం కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.




# 'రిమ్స్' కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం రిమ్స్ కరోనా ఓపీ ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ కృష్ణ ఏజెన్సీని రద్దు చేసి ఏడాదిన్నర అవుతున్నా కొత్త కాంట్రాక్టర్‌ను నియమించకుండా రిమ్స్ డైరెక్టర్ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నెలనెలా వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించడంతో పాటు కార్మికులకు వెంటనే యూనిఫామ్‌లు ఇవ్వాలన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు కొత్త కాంట్రాక్టర్‌ను నియమించాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 9న హైదరాబాద్‌లోని డిఎంఇ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి యూనియన్ నాయకులు డొంగ్రే చందు, ఎండీ. ముజీబ్, ఎస్కే. ఇక్బాల్, జి. సంగీత, కార్మికులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. మంగళవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించి కళాశాల అధికారి రమాదేవికి వినతిపత్రం అందజేసి ఓమయ్య మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆస్పత్రులలో పని చేస్తున్న సానిటేషన్, సెక్యూరిటీ పేషంట్ కేర్ సిబ్బందికి సంబంధించిన వేతన సవరణ ఒప్పందం కాలపరిమితి ముగిసి సంవత్సరమవుతున్న ఇప్పటికీ వేతనాలు పెరగకపోవడం అన్యాయమన్నారు. సంవత్సరానికి 23 జాతీయ పండగ అర్జీత సెలవులు ఇవ్వాలని ఈనెల 9న కోటీలోని డిఎంఇ కారాయలం ముట్టడి ఉన్నదని అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె నిర్వహించక తప్పదన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్, యూనియన్ కోశాధికారి భాగ్యలక్ష్మి, నాయకులు కవిత, స్వరూప, భారతి, కవిత, వెంకటేష్, సానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.




# శ్రమదోపిడీకి గురవుతున్న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు

### ఎఐటియుసి గద్వాల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు




**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** మెడికల్ కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు అన్నారు. మంగళవారం మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో జిజిహెచ్ మెడికల్ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడటంలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ సిబ్బంది అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని, అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ శ్రమదోపిడికీ గురౌవుతున్నారన్నారు. మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, .ప్రతి నెల ఒకటో తేదీన వేతనం ఇవ్వాలని, పండుగలు, 4 జాతీయ సెలవులు, 15 ఆర్జిత సెలవులు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా జమ చేయాలని, సంవత్సరానికి ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జి.రంగన్న, ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, కార్యదర్శి పరుశురామ్, భాష, నాగరాజు, సెలక్ష్మ ణ్, మతీన్, సుధాకర్, అంజమ్మ, చిట్టెమ్మ, వెంకటేశ్వరి, నాగేంద్రమ్మ, మహేశ్వరి, కిష్టమ్మ, వెంకటేష్, మునరీష, బేగం, హేమంత్‌తో పాటు ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# ఆరోగ్య రక్షకు అడ్డుగోడగా అధికారుల అలసత్వం!

నిర్మల్ జిల్లాలో నత్తనడకన
హెచ్‌పివి వ్యాక్సినేషన్
వేలాది బాలికలు
ఇంకా ఎదురుచూపులు



ప్రజా పక్షం/నిర్మల్ : భవిష్యత్తులో మహిళలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ప్రారంభించిన హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పివి) వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్మల్ జిల్లాలో అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్నట్లు కనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల ఆరోగ్య రక్షణ కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ ఉచితంగా ఈ టీకాలను అందుబాటులోకి తీసుకొచ్చినా, క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారుల అలసత్వం కారణంగా కార్యక్రమం ఆశించిన వేగంతో ముందుకు సాగడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టీకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, తల్లిదండ్రులను ఒప్పించడం, గ్రామాల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం వంటి చర్యల్లో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక సర్వేలో 14సంవత్సరాల లోపు వయస్సు కలిగిన సుమారు 2,100 మంది బాలికలను హెచ్‌పివి వ్యాక్సిన్‌కు అర్హులుగా గుర్తించారు. రెండు నెలల క్రితమే కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు కేవలం 897 మంది బాలికలకు మాత్రమే టీకా అందించగలిగారు. అంటే సగానికి కూడా చేరుకోని స్థాయిలోనే కార్యక్రమం నిలిచిపోయింది. ఇంకా 1,203 మంది బాలికలు టీకా కోసం ఎదురు చూస్తుండటం పరిస్థితి ఎంత నిర్లక్ష్యంగా ఉందో స్పష్టం చేస్తోంది. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ లక్ష్య సాధనలో తీవ్ర వెనుకబాటు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని నిర్మల్, సోన్, దిలావర్‌పూర్, సారంగాపూర్, మామడ, లక్ష్మణచందా, ఖానాపూర్, కడెం, పెంబి, కుభీర్, భైంసా, తానూర్, బాసర, ముధోల్, లోకేశ్వరం తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ ఏ ఒక్క కేంద్రంలోనూ లక్ష్యాన్ని చేరుకునే స్థాయిలో పురోగతి కనిపించడం లేదని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో తల్లిదండ్రులకు సరైన సమాచారం లేకపోవడం, మరికొన్ని చోట్ల ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించకపోవడం, ఇంకొన్ని గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించకపోవడం వల్ల టీకాల ప్రక్రియ మందగించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో విస్తృత ప్రచారం చేపట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా తగిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. హెచ్‌పివి వైరస్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు ప్రతి సంవత్సరం గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారని వైద్య గణాంకాలు చెబుతున్నాయి. ప్రజాప్రతినిధులు, వైద్య నిపుణులు, ప్రజా సంఘాల నాయకులు జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాలల ద్వారా తల్లిదండ్రులకు సమాచారం చేరవేయాలని,ప్రతి అర్హత గల బాలికకు ఆలస్యం లేకుండా హెచ్‌పివి వ్యాక్సిన్ అందేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బాలికల ఆరోగ్య రక్షణకు ఉద్దేశించిన ఈ కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యాన్ని కోల్పోకుండా వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.






## ప్రభుత్వ పాఠశాలలో.. సర్పంచే టీచర్ అయిన వేళ!

ప్రజాపక్షం/వాంకిడి : వాంకిడి మండలంలోని సమేల గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను స్థానిక సర్పంచ్ వాడ్గురే సంతోష్ సందర్శించి విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించారు. క్లిష్టమైన అంశాలను సులభమైన భాషలో వివరిస్తూ విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పడంతో చిన్నారులు ఆసక్తిగా ఆలకించారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యతోనే వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రజాప్రతినిధులు పాఠశాలలకు వచ్చి విద్యార్థులతో సమయం గడపడం, స్వయంగా పాఠాలు బోధించడం ఎంతో అరుదైన విషయమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ప్రధానోపాధ్యాయులు జాదవ్ సచిన్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో ఉచిత ఫ్రీజర్ బాక్స్ సేవలు

ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలో మార్వాడీ యువ మంచ్ సిర్పూర్ కాగజ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో మృతదేహాల కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఫ్రీజర్ బాక్స్ సేవను మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్వాడీ యువ మంచ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. మృతదేహాల సంరక్షణ కోసం ఉచిత ఫ్రీజర్ బాక్స్ సేవను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. నిరుపేద కుటుంబాలకు దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం సంస్థ ఆర్థిక సహాయం అందించేలా ముందుకు రావాలని సూచించారు. మార్వాడీ యువ మంచ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఉచిత ఫ్రీజర్ బాక్స్ సేవ అవసరమైన వారు 7013874633 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు శివ, చిప్పకుర్తి శ్రీనివాస్, గజ్జెల లక్ష్మణ్, యెమ్మాజీ సంతోష్, మార్వాడీ యువ మంచ్ సభ్యులు, వ్యాపారవేత్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## సింగరేణిలో రాజకీయ జోక్యం నశించాలి

ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీరభద్రయ్య

ప్రజాపక్షం/కాసిపేట : సింగరేణి వ్యాప్తంగా ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా మంగళవారం కాసిపేట 1 గనిపై కార్మికులు ధర్నా నిర్వహించి, మేనేజర్ సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీరభద్రయ్య మాట్లాడుతూ సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు నిర్వహించాలని, సొంతింటి పథకం అమలు చేయాలని, ఆదాయపు పన్ను భారాన్ని తొలగించి, వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు డ్రిల్ రాడ్లు, చేతి గ్లౌజులు, టూల్స్, నూతన ఎస్‌డిఎల్ యంత్రాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీ నారాయణ, వడ్ల మల్ల రాజేందర్, పార్వతి సురేష్, జంజీరాల రంజిత్ కుమార్, కోలకమలాకర్, చోడలింగయ్య పాల్గొన్నారు.




## పెండింగ్ రెవెన్యూ కేసులకు త్వరితగతిన పరిష్కారం

జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు

ప్రజాపక్షం/జన్నారం : మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు మంగళవారం జన్నారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ కేసులు, వివిధ దరఖాస్తులు, ఫైళ్ల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, దరఖాస్తులను ఆలస్యం చేయకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను అత్యంత త్వరగా పూర్తి చేయాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని సూచించారు. తహసీల్దార్ బక్కయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సోషల్ మీడియా దుష్ప్రభావాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : సోషల్ మీడియా కారణంగా కలిగే మానసిక ఒత్తిడి వల్ల చదువు సన్నగిల్లుతుందని, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల దుష్ప్రభావాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ షీ టీం సిబ్బంది సూచించారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నితికా పంత్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆసిఫాబాద్ షీ టీం ఫోన్ నంబర్ 8712670564 కు సమాచారం అందించాలని కోరారు. షీ టీం సిబ్బంది స్వప్న, రజని పాల్గొన్నారు.



## మహిళలు ఆర్థికంగా స్థిరపడాలి

ఉచిత కుట్టుమిషన్ల పంపిణీలో బొబ్బిలి రామకృష్ణ

ప్రజాపక్షం/నిజామాబాద్ : మహిళలు కుట్టుపని ద్వారా స్వయం ఉపాధి పొంది, ఆర్థికంగా స్థిరపడాలని లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఉచిత కుట్టు మిషన్ల పంపిణీని చేపట్టిందని నగర మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత అన్నారు. మంగళవారం రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద జిల్లాలో అర్హులైన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీలో నగర డిసిసి అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా మొత్తం రూ.1.02కోట్లతో 1700 కుట్టు మిషన్లను పంపిణీ చేస్తుండగా, అందులో కేవలం అర్బన్ నియోజకవర్గానికి 500 కుట్టు మిషన్లను కేటాయించి అర్హులైన లబ్ధిదారులకు అందించారన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మైనార్టీ నిరుపేద మహిళలు కుట్టుపని ద్వారా స్వయం ఉపాధి పొంది, ఆర్థికంగా స్థిరపడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఉచిత కుట్టుమిషన్ల పంపిణీని చేపట్టిందని తెలిపారు. దీని నిర్వహణను నిజామాబాద్‌లోని ఎన్‌ఎసి సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని మిషన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ పథకం కింద ఉచిత కుట్టుమిషన్ పొందాలనుకునే మహిళలు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుందని, దరఖాస్తుదారులు 1855 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. కుట్టుపనిలో శిక్షణ పొందిన సర్టిఫికెట్ తప్పనిసరి, వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల కంటే తక్కువ ఉన్న వారే అర్హులన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భోజన్న, కరీం, కోఆప్షన్ సభ్యులు నరేందర్‌సింగ్, ఖైసర్, అంతరెడ్డి విజయపాల్ పాల్గొన్నారు.

## 10న విద్యాసంస్థల బంద్

ప్రజాపక్షం/భైంసా : భైంసా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఎఐపిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో జూలై 10 రాష్ట్రవ్యాప్త బంద్ సన్నాహక సమావేశం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ముఖ్య నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగంలో రోజురోజుకూ పేరుకుపోతున్న ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి, విద్యార్థుల హక్కుల సాధన కోసం వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 10వ తేదీన (జూలై 10) రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఎఐపిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు సంఘాల ముఖ్య నాయకులు పరమేష్ , దిగంబర్, మహేందర్, కిరణ్,వెంకటేష్, కైలాష్,వినయ్, సంతోష్,పెద్ద సంఖ్యలో విద్యార్థి సంఘాల కార్యకర్తలు, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోండి

ప్రజాపక్షం/మోర్తాడ్ : తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీస్ కార్పొరేషన్ 2026–2027 ఆర్థిక సంవత్సరానికి నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాలలో గల అర్హులైన క్రిస్టియన్ మైనార్టీల నుంచి ఆర్థిక సహాయం పథకం కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లను ఆహ్వానిస్తున్నామని మోర్తాడ్ ఎంపిడిఒ తిరుమల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీ కమ్యూనిటీలకు చెందిన కుట్టు మిషన్, చిన్న వ్యాపారుల కోసం 21 నుంచి 55 సంవత్సరాల వయోపరిమితి గలవారు, అలాగే ఈ బైక్ స్కూటీ, మోటార్ బైక్ యూనిట్ల కోసం 21 నుంచి 50సంవత్సరాల వయోపరిమితి గల వారందరూ దీనికి అర్హులని తెలిపారు. దరఖాస్తుదారుల వార్షిక కుటుంబాదాయం పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల కంటే తక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక లక్ష యాభై వేల కంటే తక్కువగా ఉండాలని అర్హులైన వారు టిఎస్‌ఓబిఎంఎంఎస్.సిజిజి.జివోవి.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా 3 జూలై 2026 నుంచి 18 2026 సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర పూర్తి వివరాల కోసం దరఖాస్తు దారులు 04023391067 నంబర్‌ను సంప్రదించాలని, లేదా టిఎస్‌సిఎంఎఫ్‌సి.ఐఎన్ వెబ్‌సైట్ ను సంప్రదించవచ్చని ఎంపిడివో తిరుమల తెలిపారు.

## ‘సర్’ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి

కొండాపూర్ తహసీల్దార్ బి.అశోక్

ప్రజాపక్షం/కొండాపూర్ : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ముఖ్యంగా యువతి ,యువకులు ,యువజన సంఘాల ప్రతినిధులు క్రియాశీలక పాత్ర పోషించాలని కొండాపూర్ తహసీల్దార్ బి. అశోక్ పేర్కొన్నారు. మీ దగ్గరకు వచ్చే అధికారులకు సహకరించి సరైన వివరాలను తెలియజేయాలని అన్నారు. ఏలాంటి సందేహాలు ఉన్న బిఎల్ఓ ,జిపిఓ,పిఎస్ తహసీల్దార్ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని అన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ ఓ దగ్గర తీసుకుని జాగ్రత్తగా పూర్తి చేయాలని కలర్ ఫోటో ,చిరునామా, ధ్రువీకరణ పత్రం, వయస్సు ధ్రువీకరణ పత్రాలను జత చేసి బిఎల్‌ఓలకు ఇచ్చి రసీదు పొందాలన్నారు. ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా స్వతహాగా సర్‌ను పూర్తిచేసుకోవచ్చని అన్నారు. జులై 24,2026 లోపు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించని పక్షంలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పేరు నమోదు కాకపోవచ్చని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు తమతో పాటు కుటుంబ సభ్యులు ,స్నేహితులు, ఇరుగుపొరుగు వారిని కూడా ఈ కార్యక్రమంలో బాగస్వాములను చేసి తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీలో సహకరించాలని కోరారు.

## 12,13తేదీల్లో ఎఐటియుసి జిల్లా మహాసభలు

ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎఐటియుసి జిల్లా మహాసభలను జయప్రదం చేయండని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. మంగళవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఓమయ్య మాట్లాడారు. 12, 13 తేదీలలో నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో ఎఐటియుసి జిల్లా 22వ మహాసభలు నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా యూసుఫ్, నర్సింహ, సుధార్, భూమయ్య హాజరవుతున్నారని ఈ మహాసభల్లో ప్రభుత్వాలు అవలభిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై విస్తృతమైన చర్చలు నిర్వహిస్తామని గత మూడు సంవత్సరాలుగా ఎఐటియుసి జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించామని, భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను రూపొందించుకుంటామన్నారు.పెద్దసంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు చక్రపాణి, హన్మాండ్లు, ప్రసాద్, గోవర్ధన్, నాగనాథ్ పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



ప్రజాపక్షం/మాక్లూర్ : అధిక దిగుబడి, మంచి మద్దతు ధరతో గణనీయమైన లాభాలనందించే ఆయిల్‌పామ్ పంట సాగు చేసేందుకు జిల్లాలోని ఆదర్శ రైతులు చొరవ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నాపూర్ రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగుపై మంగళవారం స్థానిక రైతులకు అవగాహన సదస్సు నిర్వహించగా ఈ సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా, సాంప్రదాయ వరి పంట స్థానంలో ఆయిల్ పామ్ సాగు చేపడితే కలిగే ప్రయోజనాలపై అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టి దిగుబడులు పొందుతున్న ఆదర్శ రైతులు జైడి మధుసూదన్, లక్ష్మణ్, గడ్డం గంగారెడ్డి, సుధాకర్ తదితరులు తమ స్వీయ అనుభవాలను తోటి రైతులకు తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీతో తాము ఆయిల్ పామ్ పంట సాగు చేశామని, ప్రస్తుతం మంచి దిగుబడి చేతికి వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అంతర పంట సాగు ద్వారా అదనపు ఆదాయాన్ని సైతం అర్జించామని, డ్రిప్ ఏర్పాటు కోసం 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వమే డ్రిప్ పరికరాలను సమకూర్చిందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మిగతా రైతులు కూడా ఇదే స్ఫూర్తితో ఆయిల్‌పామ్ సాగును చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ పంట సాగుకు జిల్లాలో అనుకూల పరిస్థితులున్నాయని, పంట సాగుకవసరమైన ఆయిల్‌పామ్ మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సీజన్‌లో 1600 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా రైతుల ప్రయోజనార్థంకనీసం 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగును ప్రోత్సహించాలని నిర్ణయించామన్నారు. ఆయిల్‌పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని, ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ పంటకు ఉన్న డిమాండ్‌ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రూ.లక్షన్నర నుండి రెండు లక్షల వరకు ఆదాయం ఆర్జించే అవకాశాలున్నాయన్నారు. ఒక్కసారి ఆయిల్‌పామ్ చేపడితే కనీసం 30 సంవత్సరాల పాటు ఈ పంటతో గణనీయమైన ఆదాయం పొందవచ్చని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి, ఫ్రీయూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయికిరణ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు నాకు పిఎసిఎస్ చైర్మన్ అశోక్, చిన్నాపూర్ గ్రామసర్పంచ్ పుప్పాల చిన్న, ఉపసర్పంచ్ రమేష్ రైతులు పాల్గొన్నారు.

## ‘సర్’ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజాపక్షం/ సంగారెడ్డి : జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి పారదర్శకమైన తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణి పూర్తయిందని గ్రామీణ ప్రాంతాల్లో ప్రక్రియ వేగంగా కొనసాగుతుండగా పట్టణ ప్రాంతాల్లో కూడా మరింత వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ నెల 24వ తేదిలోపు ఎన్యురేషణ్ ఫారాల పంఫిణి సేకరణ ,టీజీటైజేషన్ ప్రక్రియ ను పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఓటర్లకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి పారాల నింపడంలో సహాయం చేయడంతో పాటు స్వీకరించిన ఫారాలను వెంటనే డిజిటైజ్ చేసేలా ప్రణాళిక చేస్తున్నాన్నారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను చురుకుగా వినియోగించుకోవాలని ఓటర్లకు అవగాహన కల్పించి కార్యక్రమం విజయవంతానికి సహకారించాలని కలక్టర్ సూచించారు. అలాగే ఎన్యుమరేషన్ పారాల పంపిణి సేకరణ డిజిటైజేషన్ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నుంచి అవసరమైన సూచనలు ,సలహాలు స్తాగతిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత ,పాండు ఈఆర్‌ఓలు తహసీల్దార్లు ,ఎన్నికల విభాగం అధికారులు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిదులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం కార్యకర్తలు కోలాహలంగా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజ్జల శంకర్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ సాధించిన విజయాలను, సమాజం పట్ల ఉన్న బాధ్యతను వివరించారు. మందకృష్ణ మాదిగ నేతృత్వంలో రానున్న రోజుల్లో సమాజంలోని సమస్యలపై, అణగారిన వర్గాల హక్కులకై నిరంతరం సమరశీల పోరాటాలకు వేదికగా ఎమ్మార్పీఎస్ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గజ్జల గంగయ్య, గస్కంటి కిష్టయ్య, పర్ల గంగయ్య, జిల్లా నాయకులు, ప్రజాస్వామికవాదులు, సామాజికి కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా గులాని సాయిలు

ప్రజాపక్షం/పిట్లం : పిట్లం మండలకేంద్రానికి చెందిన గులాని సాయిలును తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రదేశ్ కమిటీ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన గులాని సాయిలు మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు ప్రధాన కార్యదర్శిగా భాద్యతను అప్పగించినందుకు భవిష్యత్తులో రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కొరకు కృషి చేస్తామన్నారు. తనకు ఈ పదవిని కట్టబెట్టేందుకు సహకరించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిట్లం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గులాని సాయిలుకు తమ అభినందనలు తెలియజేశారు.

## 106 కేసుల నిందితుడు ‘అలవాటు దొంగ’ అరెస్ట్

22.5 తులాల బంగారు,
60 తులాల వెండి అభరణాలు,
నగదు 25వేలు స్వాధీనం
ఎస్పీ పరితోష్ ఫంకజ్




ప్రజాపక్షం/సంగారెడ్డి : సంగారెడ్డి గుమ్మడిదల పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో 106 కేసుల్లో నిందితుడిగా పేరుగాంచిన అలవాటు దొంగను అరెస్టు చేసినట్లు ఈ దొంగ నుండి 22.5 తులాల బంగారు, అభరణాలు 60 తులాల వెండి అభరణాలు, నగదు రూ.25వేలు స్వాధీనం చేసుకుని జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ కేసు చేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందిచారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా సిసిఎస్ పోలీసులు గుమ్మడిదల పోలీసులు సంయుక్త ఆపరేషన్ లో80 పాత కేసులు, 26 కొత్త కేసుల్లో నిందితుడైన అలవాటు హౌస్ బ్రేకింగ్ నిందితుడు కోటపల్లి చంద్ర అలియాస్ శేఖర్ను అరెస్ట్ చేసి బంగారు అభరణాలు ,వెండి అభరణాలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్న ఇంటి దొంగతనాల నేపథ్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టగా సిసిఎస్ సంగారెడ్డి, గుమ్మడిదల పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో నిందితుడిని ఆదుపులోకి తీసుకోవడం జరిగింది. నిందితుడు 2007 సంవత్సరం నుంచి రాత్రి వేళల్లో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతూ, ఇళ్లలో చొరబడి బంగారు అభరణాలు, ఇతర విలువైన వస్తువులు, దొంగలించి తెలిసిన వ్యక్తులకు విక్రయించడం, తాకట్టు పెట్టడం ద్వారా అక్రమంగా డబ్బు సంపాదిస్తూ విలాసవంతమైన జీవితం గడపడం కోసం ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తెలిందని ఎస్పీ వివరించారు.

ప్రజాపక్షం
Telugu National Daily

ఖమ్మం
బుధవారం
08-07-2026
www.prajapaksham.in

'వాల్తేరు వీరయ్య' భారీ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి,దర్శకుడు బాబీ కొల్లి మళ్లీ కలిసి పనిచేస్తున్న చిత్రం కోసం ప్రస్తుతం భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ విస్తృతంగా జరుగుతోంది.

రీల్

# ఫైట్ చేస్తున్న చిరంజీవి



వాల్తేరు వీరయ్య' భారీ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి,దర్శకుడు బాబీ కొల్లి మళ్లీ కలిసి పనిచేస్తున్న చిత్రం కోసం ప్రస్తుతం భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో విస్తృతంగా జరుగుతోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్న భారీ యాక్షన్ సన్నివేశం ఈ చిత్రంలో మేజర్ హైలెట్స్ లో ఒకటి. భారీ సంఖ్యలో ఫైటర్లతో అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సన్నివేశం, మెగాస్టార్ చిరంజీవిని పవర్ ఫుల్ , డైనమిక్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని రూపొందుతున్న ఈ యాక్షన్ ఘట్టంలో, మెగాస్టార్ స్వయంగా పాల్గొంటూ చాలా సాహసోపేతమైన స్టంట్స్ చేస్తున్నారు. థమన్ ఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ అద్భుతమైన విజువల్స్ అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాష్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్ ఆంటోనీ రూబెన్ పని చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పోట్లూరి అడిషనల్ స్క్రీన్‌ప్లేను సమకూర్చారు. స్టార్ రచయితల ద్వయం భానునందు సంభాషణలు రాస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి సరసన అనశ్వర రాజన్.

# 'ఓ.. సుకుమారి' సెన్సార్ పూర్తి



హీరో తిరువీర్,హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఎంటర్టైనర్ 'ఓ. సుకుమారి'తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు.విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్, టీజర్, సాంగ్స్ మంచి రెస్పాన్స్ వచ్చింది.తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ యు/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. వినోదం, ప్రేమ, నవ్వులతో నిండిన ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రం అలరించబోతోంది. రజాకార్, పోలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు.జూలై 17న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: భరత్ మంచిరాజు, ఆర్ట్ డైరెక్టర్: తిరుమల ఎం తిరుపతి, లిరిక్స్: పూర్ణాచారి, ఫైట్స్ : అంజి, కొరియోగ్రఫీ: జెడి మాస్టర్.

# 'రాజా ది రాజా' డిఫరెంట్ జానర్ సినిమా

## ట్రైలర్ లాంచ్ లో నిర్మాత రవిశంకర్



రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన 'రాజా ది రాజా' చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్ కు సంబంధించిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. బృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి నిర్మించిన ఈ చిత్రాన్ని కె. శ్రీలత రెడ్డి సమర్పిస్తున్నారు. ఈ సినిమా జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ డిస్ట్రిబ్యూషన్ రైట్స్ దక్కించుకోవడం ద్వారా, సినిమా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర బృందం ఇప్పుడు సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేసింది.రాజరిక కాలంలో సాయికుమార్ రాజా వీరాట వర్మ దేవరాయగా కనిపిస్తారు. సంప్రదాయాలను గౌరవించే రాజ్యంలో, ఆధ్యను ప్రాణంగా ప్రేమించే హీరోపై రాజ్యంలో జరిగిన కల్లోలానికి కారణమని నేరం మోపి మరణశిక్ష విధిస్తారు. ఆ తర్వాత వర్తమాన కాలంలో హీరో ఫ్యాషన్ డిజైనర్‌గా, ఆధ్య మోడల్‌గా మళ్లీ పుడతారు. విధి వారికి మరో అవకాశం ఇస్తుంది. ఈసారి వారి ప్రేమ గెలుస్తుందా? గత జన్మలో మిగిలిపోయిన కథకు ముగింపు పలుకుతాడా? అనేదే సినిమా ప్రధాన కథాంశం.పీరియాడిక్ ఎపిసోడ్స్‌లో రాజకుమారుడి హుందాతనాన్ని, ప్రస్తుత కాలంలో స్టైలిష్, ఎనర్జిటిక్ యువకుడిగా చక్కగా కనిపించారు. సాయికుమార్ తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోగా, డాక్టర్ నరేష్ విజయ కృష్ణ కూడా తన పాత్రలో మంచి నటన కనబరిచారు.ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'రాజా ది రాజా' ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. ఈ సినిమా హీరో రుత్విక్ తో పాటు నిర్మాత నిహారిక కూడా చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. ట్రైలర్‌లో రుత్విక్ యాక్టింగ్ చూస్తుంటే అసలు కొత్త హీరో చేస్తున్నట్లు అనిపించలేదు.17న అందరం థియేటర్లలో ఈ సినిమా చూద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో రుత్విక్, నిర్మాత నిహారిక దాసరి, దర్శకుడు అనిల్ పాల్గొన్నారు.

# 'వ్యూ' టీజర్ లాంచ్



మహేష్ కాంపెల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ' చిత్ర టీజర్‌ను చిత్రబృందం ఘనంగా విడుదల చేసింది. మిస్టరీ, సస్పెన్స్, ఎమోషనల్ అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించారు. కార్తికేయ సమర్పణలో పరవాణి చలనచిత్ర బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం విభిన్నమైన కథనంతో తెరకెక్కుతోంది. 'ది పాయింట్ ఆఫ్ వ్యూ' అనే ట్యాగ్‌లైన్‌నే కథలోని ప్రధాన అంశాన్ని ప్రతిబింబిస్తోంది. టీజర్ విడుదల సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ఘనంగా మీడియా సమావేశాన్ని నిర్వహించింది.ఈ సందర్భంగా నిర్మాత సత్య చౌదరి మాట్లాడుతూ నేను వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌ని. కానీ సినిమాలపై ఉన్న ఆసక్తితో ఈ రంగంలోకి వచ్చాను. దాదాపు పదేళ్ల క్రితం మహేష్ ఈ కథను నాకు వినిపించారు. ఒక మహిళా ప్రధాన కథతో మంచి సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించాను. దర్శకుడు మహేష్ కాంపెల్లి మాట్లాడుతూ ఇది నా తొలి దర్శకత్వ చిత్రం. నేను ఇంతకుముందు ఏ దర్శకుడి దగ్గరా పని చేయలేదని నిర్మాత సత్య గారికి ముందే చెప్పాను. అయినప్పటికీ నేను రాసుకున్న కథపై పూర్తి నమ్మకం ఉంది. దిశ ఘటనతో పాటు కొన్ని వాస్తవ సంఘటనల నుంచి ప్రేరణ పొందిన ఈ కథ ద్వారా మహిళల పట్ల సమాజంలో అవగాహన పెంచే బలమైన సందేశాన్ని ఇవ్వాలనుకున్నాను. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తారని ఆశిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు అర్జున్ , హీరోయిన్ సోనియా నాయుడు, హీరోయిన్ పూజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రొమాంటిక్ కామెడీ చిత్రంగా 'లవ్ ఓ లవ్'



లవ్ ఓ లవ్' ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. పావిష్ నారాయణన్, నాగ దుర్గా జంటగా నటించిన ఈ చిత్రానికి మాగేశ్ రాజేంద్రన్ దర్శకత్వం వహించారు. రొమాన్స్, కామెడీ, సమ్మేళనంగా రూపొందించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మాస్ కా దాస్ విశ్వక్ సేన్ చిత్ర బృందానికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ నిర్మాతలు సి. కళ్యాణ్, దామోదర్ ప్రసాద్, జి. నాగేశ్వర రెడ్డి గార్లు కూడా హాజరయ్యారు. లవ్ ఓ లవ్ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, చిత్ర యూనిట్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ, నగరానికి ఏమైంది 2 సినిమా షూటింగ్‌లో ఉన్నాను. పవిష్ సినిమా ఈవెంట్‌కు వెళ్లాల్సి ఉందని తరుణ్ భాస్కర్‌కు చెప్పగా, ఆయన కూడా రెండు గంటల ముందే షూటింగ్ నుంచి వెళ్లమని ప్రోత్సహించారు. లవ్ ఓ లవ్ గురించి చెప్పాలంటే, ఇది భాషలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే యూనివర్సల్ రొమాంటిక్ కామెడీ చిత్రంలా అనిపిస్తోంది. కథ, కంటెంట్ బాగుంటే తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ మంచి సినిమాలను ఆదరిస్తారు. అది తెలుగు సినిమా అయినా, తమిళ సినిమా అయినా ఎలాంటి తేడా చూపించరు. సూర్య, కార్తీ, ధనుష్, ప్రదీప్ రంగనాథన్ చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎంతగా ఆదరించారో మనందరికీ తెలుసు. అదే విధంగా పవిష్ కూడా ఆ జాబితాలో చేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత జి. ధనంజేయన్, దర్శకుడు మాగేశ్ రాజేంద్రన్ , నిర్మాత దినేష్ రాజ్, హీరో పవిష్, హీరో పవిష్ నారాయణన్ , హీరోయిన్ నాగ దుర్గా, నటి వనిత విజయకుమార్ పాల్గొన్నారు.

# రెండోసారి కలిసి నటిస్తున్న ప్రదీప్ – మమిత బైజు



రచయితగా, దర్శకుడిగా, హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు నిర్మాతగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నారు. పీఆర్ షో పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ బ్యానర్‌లో తొలి సినిమాగా, డ్యూడ సినిమాలో ఆయనతో కలిసి నటించిన మమిత బైజు, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో శివాజీ సొంటినేని, స్వాసిక, అనామిక మహి, లిజ్జీ ఆంటోని కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న సాయి అభ్యంక్కర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ది ఆల్ఫా యూనిట్ పేరుతో పరిచయం చేసిన ఆరుగురు సభ్యుల బృందం నిర్వహిస్తోంది. ఇందులో విశాల్ టీఆర్, యష్ వి, నరేన్ సౌడా, చాణక్కియన్ ఆర్, ధనుష్ కుమార్, ఇళంపరితి ఉన్నారు. సినిమాటోగ్రఫీని దినేష్ పురుషోత్తమన్, ఎడిటింగ్‌ను ప్రదీప్ ఈ రాఘవ్, ప్రొడక్షన్ డిజైన్‌ను అశ్విన్ లారా చూస్తున్నారు. ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్: రమేష్ నారాయణన్, డీవోపీ: దినేష్ పురుషోత్తమన్, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ్, ప్రొడక్షన్ డిజైనర్: అశ్విన్ లారా, యాక్షన్: దినేష్ కాశి.

## పారదర్శకంగా వేతనాల చెల్లింపులకు

# డిజిటల్ గవర్నెన్స్

## ప్రణాళికలతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలి

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాల చెల్లింపు
- ఏజెన్సీలకు సమయానికి ప్రభుత్వం నిధులు చెల్లిస్తున్నా ఉద్యోగులకు ఇవ్వడం లేదు
- అలాంటి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతన సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలకు సబంధించిన నిధులను ప్రభుత్వం ఏజెన్సీలకు చెల్లించినప్పటికీ సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్ఆర్‌డిలోని బోధి పెవిలియన్‌లో మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీ నుంచి గరిష్టంగా 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు చేసేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని, అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ ఖాతాల వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పిఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సిఎం స్పందిస్తూ డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని అధికారులకు సూచించారు.

**పరిపాలనలో పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు**

ప్రభుత్వ పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని, ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని, కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని సిఎం ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర సదుపాయాలను అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం పర్యవేక్షించేందుకు చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపి వేం నరేందర్ రెడ్డి, సిఎం సలహాదారు కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎంసిఆర్ హెచ్ఆర్‌డి వైస్ చైర్ పర్సన్ ఎ.శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్.శివ శంకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

## సిఎం రేవంత్ రెడ్డికి 125 మంది విద్యావేత్తలు, ప్రముఖుల బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే ప్రతిపాదనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ విద్యావేత్తలు, మేధావులు, పౌరసమాజ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. విద్య హక్కు చట్టం, రాజ్యాంగ పరిరక్షణలు, కాంగ్రెస్ ఎన్నికల హామీలకు విరుద్ధంగా ఈ నిర్ణయం ఉందని, వెంటనే ఆ ప్రతిపాదనను పునఃసమీక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యావేత్తలు, మేధావులు, పౌర సమాజానికి చెందిన 125 మందితో కూడిన లేఖను సిఎంకు పంపి ంచారు. లేఖ రాసిన వారిలో మాజీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.చంద్రకుమార్, జస్టిస్ రజని, జస్టిస్ రాధారాణి, జస్టిస్ నిమ్మ నారాయణ, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ వలీ ఖాద్రీ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి పుట్ట లక్ష్మణ్, పిడిఎస్‌యు, పివైఎల్, ఎస్‌సిఐఇ, పిఎవి, టిఎస్ఇసి, పిఎవి, ఎస్‌సిఐఇ, ఎపిటిఎఫ్, డిటిఎఫ్, టిపిటిఎఫ్, హెచ్‌సియు, ఒయు నేతలు ఉన్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలలో దాదాపు 8,769 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దళిత, ఆదివాసీ, పేద, వెనుకబడిన వర్గాల పిల్లలు, బాలికలు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. సమీపంలో పాఠశాలలు లేకపోతే రవాణా, భద్రతా సమస్యల కారణంగా డ్రాప్‌ఔట్లు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో 'విద్యపై ఖర్చు భవిష్యత్తుపై పెట్టుబడి' అని పేర్కొంటూ విద్యకు బడ్జెట్‌లో 15 శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రస్తుతం కేటాయింపులు 8.2 శాతానికే పరిమితమయ్యాయని లేఖలో వారు గుర్తు చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మూసివేసిన సుమారు 6,000 పాఠశాలలను పునరుద్ధరిస్తామని చెప్పి, ఇప్పుడు 23,000 పాఠశాలల మూసివేత దిశగా అడుగులు వేయడం విచారకరమని వారు విమర్శించారు. రాష్ట్ర విద్యాశాఖలో పర్యవేక్షణ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని కూడా లేఖలో పేర్కొన్నారు. మొత్తం 33 జిల్లాల్లో 25 జిల్లాలకు రెగ్యులర్ డిఈఓలు లేరని, 633 మండలాల్లో 612 మండలాలకు మండల విద్యాధికారులు లేరని వివరించారు.

పర్యవేక్షణ లోపం, ఉపాధ్యాయుల కొరత, ప్రైవేట్ పాఠశాలల విస్తరణ వంటి కారణాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు తగ్గుతున్నాయని అభిప్రాయపడ్డారు.

# తెలంగాణ టూరిజంపై ప్రభుత్వం ఫోకస్..

## కొత్త టూరిస్ట్ ప్రాజెక్టుల వరకు సమగ్ర కార్యాచరణకు ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను దేశంలోనే అగ్రశ్రేణి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించాలని, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ స్థాయి ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్‌లో అంతర్జాతీయ కార్నివాల్ నిర్వహణ అవకాశాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన పర్యాటక సలహా మండలి సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రస్తుత పర్యాటక కేంద్రాలతో పాటు కొత్తగా అభివృద్ధి చేయగల ప్రాంతాలను గుర్తించి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యాటకుల సంఖ్యను పెంచడంతో పాటు పర్యాటక ప్రాజెక్టులు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా నిలిచే విధంగా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, ఆహారం, వసతి వంటి మౌలిక సదుపాయాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేసి, పర్యాటక కేంద్రాల నిర్వహణపై రెండు మూడు రోజుల్లో సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తాత్కాలిక కాటేజీల ఏర్పాటుపై కూడా అధ్యయనం చేయాలని సూచించారు. పర్యాటక రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను పెంచేందుకు పిపిపి, లీజ్ విధానాల్లో అనువైన ప్రాంతాలను గుర్తించాలని, ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని చార్మినార్, కోఠి, పుత్లీబౌలి, లాడ్‌బజార్ ప్రాంతాల్లో హెరిటేజ్ వాక్‌లను విస్తరించాలని, తెలంగాణ సంస్కృతి, కళలు, నృత్యాలు, సంగీతం, బోనాలు, బతుకమ్మ, స్థానిక వంటకాలను పర్యాటక ప్రచారంలో భాగం చేయాలని మంత్రి సూచించారు. పాతబస్తీ, కొత్త నగరంలోని రూపొందించాలని ఆదేశించారు. సోమశిలలోని 1,600 ఎకరాల భూమిని పర్యాటక వెడ్డింగ్ డెస్టినేషన్లు, వాటర్ గోల్ఫ్ కోర్సు వంటి ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో పర్యాటక, భాషా సాంస్కృతిక ఎండీ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, పర్యాటక సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

# కాళేశ్వరాన్ని అప్పగిస్తా!

(మొదటి పేజీ తరువాయి)

రాయాలని, తాము కూడా వారికి విజ్ఞప్తి చేసి ఉభయ సభల(జాయింట్ సెషన్)ను ఏర్పాటు చేయిస్తామన్నారు. '' కూలిన కాళేశ్వరం: వైఫల్యం నుంచి పునర్మిణం వైపు'' అనే అంశంపైన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం నాడు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, వారం రోజులు కెసిఆర్‌కు అప్పగిస్తే కన్నెపల్లి పంపు హౌజ్‌లను నడిపిస్తాడని కెటిఆర్, ముందుచూపుతో కాళేశ్వరం కట్టారని హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. అదే నిజమైతే ప్రతిపక్ష నేత చంద్రశేఖర్‌రావు శాసనసభకు వచ్చి ఒప్పించాలని కోరారు. 'సభలో వాస్తవాలు అన్నీ మాట్లాడుదాం. ఒకవేళ ఎందుకు కాళేశ్వరం ఆయనకు అప్పగించాలనే అంశంపై చంద్రశేఖర్‌రావు కన్విన్స్ చేసిండంటే నూరు శాతం కెసిఆర్‌కు అప్పజెబుదాం. మొత్తం మూడింటికి మూడు అప్పజెప్పుదాం . రాబోయే మూడేళ్ళు అప్పజెబుదాం. ఏమి చేయిస్తడో చేయని. వారం రోజులు కాదు ప్రాజెక్టును ఎల్ అండ్ టిని మిగతా కాంట్రాక్టర్‌లను తీసేసి హోల్ సేల్‌గా మేజర్ కాంట్రాక్టర్‌ను చేసి కెసిఆర్‌కే ఇస్తామని' రేవంత్ రెడ్డి అన్నారు. నిజంగా తప్పు చేయకపోతే, ప్రమాదవశాత్తు కాళేశ్వరం కూలిపోయినట్లు కెసిఆర్ భావిస్తే కోరిన రోజు, కోరినన్నీ రోజులు ఉభయ సభలు ఏర్పాటు చేయిస్తామని, సబ్జెక్ట్ నిపుణులను కూడా కూడా పిలిపించి చర్చిద్దామన్నారు. వన్స్ ఫర్ ఆల్ కాళేశ్వరం అంశంపై చర్చ చేద్దామని, నిజంగానే మీ అనుభవంలో ఏమైనా చెబితే అమలు చేస్తామన్నారు.

**ప్రభుత్వం కట్టినవి వాడతలేదా?**

తెలంగాణ ప్రజలు కట్టిన పన్నులు, సొమ్ము వృథా కాకూడదని, నీళ్ళు గోదావరి పాలు కాకూడదనే ఉద్దేశ్యంతో కెసిఆర్ హయాంలో నిర్మించిన అనేక భవనాలు, ప్రాజెక్టులను వినియోగించటం లేదా అని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన కట్టిన సచివాలయాన్ని వినియోగిస్తలేమా, ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి అందరూ వచ్చిపోయేలా ఉపయోగించడం లేదా, వాళ్ళిచ్చిన రైతు భరోసాకు రూ. 2 వేలు అదనంగా ఇచ్చి రైతులకు ఇవ్వడం లేదా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీ ని ఇవ్వడం లేదా అని అన్నారు. నిజంగా కాళేశ్వరం ప్రాజెక్టును ఏమైనా చేయగలుగుతామంటే రాత్రి పగలు అక్కడే కూర్చొని మరమ్మతు పూర్తి చేయలేమా అని ప్రశ్నించారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం వృథా అవుతుందని, ఏమీ చేయలేకపోతున్నామనే బాధ తమకు, నిస్సహాయత, అవినీతికి పాల్పడిన వారిని ఏమి చేయలేకపోతున్నామనే ఆవేదన తమకు ఉన్నదన్నారు. అలాంటిది పాతవన్నీ మరిచిపోయి ఎదురు దాడి చేయాలని పిల్లలను అబద్ధాలు చెబుతూ జనం మీదికి పంపిస్తున్నాడని, అది ప్రజలు నమ్మితే కెసిఆర్ తాను వద్దామనుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు ఆర్థిక ఉగ్రవాదులు అని, తెలంగాణ వనరులను దోచుకున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించిన ప్రాంతాల్లో సరైన భూసర్వేలు, భూ పరీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. ఇసుక మేటలపై బ్యారేజీలు నిర్మించారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ వెన్నెముక లాంటిదని, అది పనిచేయకపోతే మొత్తం ప్రాజెక్టు ప్రభావితమవుతుందని చెప్పారు. ప్రాజెక్టుపై చర్చకు రావాలని కోరితే మిడిమిడి జ్ఞానం ఉన్న వారిని బిఆర్‌ఎస్ పంపిస్తున్నదన్నారు. ప్రాజెక్టు దెబ్బతిన్న తర్వాత ఇంజనీర్‌పై కేసు పెట్టింది కూడా బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ హయాంలోనే ఎన్‌డిఎస్ఎ ప్రాథమిక నివేదిక వచ్చిందని, నాణ్యత లోపాలు, నిర్వహణ వైఫల్యం, నిబంధనల ఉల్లంఘనల వల్లే బ్యారేజీ దెబ్బతిన్నట్లు అందులో పేర్కొన్నారని సిఎం వెల్లడించారు.

**కాళేశ్వరానికి రూ.30 వేల కోట్లు అప్పులు కట్టాం**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 30 నెలల్లో సుమారు రూ.1.80 లక్షల కోట్ల రుణాలు తీసుకువస్తే , తాము వచ్చాక ఒక్క చుక్క నీరు కాళేశ్వరం నుంచి తీసుకోకపోయినా, రైతుకు అణా పైసా ప్రయోజనం లేకున్నా కాళేశ్వరం కార్పొరేషన్ చేసిన అప్పుల కోసమే 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ. 33,574.11 కోట్లు కట్టామని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే రూ.2.08 లక్షల అప్పు తిరిగి చెల్లించామన్నారు. ఇందిరమ్మ జయంతి రోజు తెలంగాణలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. అలాగే రైతు భరోసా సభను ఈ నెల 10న మధ్యాహ్నం 2 గంటలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో సభ నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

**2027 జూలై నాటికి అందుబాటులోకి తెస్తాం : ఉత్తమ్**

దొంగే వేరేవాళ్లను తిట్టినట్లు, కాళేశ్వరం విషయంలో బిఆర్‌ఎస్ చేసిన తప్పులకు తమ ప్రభుత్వాన్ని నిందిస్తోందని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు వద్ద పరీక్షలు జరుగుతున్నాయని, తమ అంచనా ప్రకారం నెల రోజుల్లో అవి పూర్తి అవుతాయన్నారు. వర్షాకాలం పూర్తయ్యాక 2027 జూన్, జూలై మాసాలకు మూడు బ్యారేజ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సర్వశక్తుల ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ ప్రసాద్ బాబు, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, కార్పొరేషన్ చైర్మన్‌లు హాజరయ్యారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com